ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**
**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

సోమవారం, ఆగస్ట్ 25, 2014,

ఇరవై ఒకటవ సమావేశము, సంపుటము-2, నంబరు-6,

జయనామ సంవత్సరం, భాద్రపదం-3.

**MONDAY, THE 25th DAY OF AUGUST, 2014,**

**TWENTY FIRST SESSION, VOLUME - 2, NO.6,**

**3rd BHADRAPADAM, 1936 S.E.**

* * * * *

శాసన పరిషత్తు సచివాలయము,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**
**PUBLIC GARDENS,**
**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు
## సోమవారం, ఆగస్ట్ 25, 2014.

# అధికార నివేదిక

---

విషయ సూచిక

---

(1) నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానాలు
(2) 2014-15 బడ్జెట్‌పై మూడవ రోజు సాధారణ చర్చ

---

## ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL
## MONDAY, THE 25TH DAY OF AUGUST, 2014

(THE HOUSE ASSEMBLED AT 10.00 A.M.)
(THE HON'BLE CHAIRMAN IN THE CHAIR)

* * *

### నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానాలు

MR. CHAIRMAN: I will take-up Question Hour. First question (Q.No.7331) postponed at the request of the Member. Member not present to put Questions two (7494) and three (7492). 4th Question, Gade Srinivasulu Naidu garu, please put your question.

### ఐటిడిఏ ఆశ్రమ పాఠశాలలకు ఫర్నీచర్ నిత్యావసర వస్తువులు

ప్రశ్న నెం. 7392(54)

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన సాంఘీక సంక్షేమ, గిరిజన సంక్షేమ మరియు సాధికారత శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) ఐటిడిఏ నిర్వహిస్తున్న నైవాసిక పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం ఫర్నీచర్, నిత్యావసర సరకులను అందిస్తున్నదా?

ఆ) అయితే, ఆ వివరాలు తెలపండి.

**గౌరవనీయులైన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ( శ్రీ రావెల కిషోర్ బాబు) ః**

అ) అవునండీ, ఫర్నీచర్‌ను కొనుగోలు చేసి నైవాసిక పాఠశాలలకు సరఫరా చేయడమయింది. పౌర సరఫరాల శాఖ, గిరిజన సహకార సంస్థ కూడా నిత్యావసర సరకులను సరఫరా చేశాయి.

ఆ) ప్రభుత్వ ఉత్తరువుల ప్రకారం, పౌర సరఫరాల శాఖ రూపాయికి కిలో చొప్పున బియ్యాన్ని నైవాసిక పాఠశాలలకు అందిస్తున్నది. పప్పులు, నూనె, చెక్కెర, చింతపండు వంటి మిగిలిన నిత్యావసర సరకులను గిరిజన సహకార సంస్థ ద్వారా మాత్రమే సేకరించడమయింది. కూరగాయలు, పాలు, గ్రుడ్లను ఆమోదించిన టెండర్ల ద్వారా కొనుగోలు చేయడమయింది.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు (ఉపాధ్యాయుల నియోజకవర్గం, శ్రీకాకుళం, విజయనగరం మరియు విశాఖపట్నం)ః అధ్యక్షా, ఫర్నీచర్‌ను ప్రభుత్వం తరఫున సరఫరా చేస్తున్నారు. అయితే, ఇంకా కొన్ని ఐటిడిఏ పాఠశాలల్లో ఫర్నీచర్ లేదు. విజయనగరం జిల్లా మక్కువ మండలంలో మారుమూలన ఉన్న ఒక ఐటిడిఏ పాఠశాలకు నేను వెళితే అక్కడ 10 వ తరగతి చదువుతున్న పిల్లలకు కూడా బెంచెస్ లేవు. వీటి కోసం ప్రభుత్వ పరంగా నిధులను విడుదల చేస్తున్నా క్రింది స్థాయిలో ఐటిడిఏ పరిధిలో అవి ఎంత వరకు ఆ పాఠశాలలకు చేరుతున్నాయని అడుగుతున్నాను. అదే విధంగా, పేద గిరిజన పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో

పప్పులు, నూనెలు , కూరగాయలు, పాలు మొదలైనవి సరఫరా చేస్తున్నాం. ప్రభుత్వం ఖర్చుకు కూడా వెనుకాడకుండా మెస్ ఛార్జీలను పెంచి నిధులను విడుదల చేస్తుంది. వాస్తవానికి, అక్కడ సప్లయర్స్‌పైన కాని, డిస్ట్రిబ్యూటర్స్‌పైన కాని, వంట వండి పెట్టే విధానంపైన గాని మోనిటరింగ్ సరిగా లేకపోవడం వల్ల నాణ్యత లోపించి చాలా ఇబ్బందికరమైన పరిస్థితి ఉంది కాబట్టి దీనిని ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలనే ఉద్దేశ్యంతోనే ఈ ప్రశ్నను అడగడం జరిగింది. ప్రభుత్వం ఇస్తున్నటువంటివి గ్రామీణ ప్రాంతాలలోని ట్రైబల్స్‌కు చేరుతున్నాయా? లేదా? ఆ పాఠశాలలకు ఆ సరుకులు వెళుతున్నాయా? లేదా? అనే దాని గురించి పరిశీలించడానికి ప్రత్యేకంగా మోనిటరింగ్ కమిటీలను, విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేసి ఆ పేద పిల్లలను ఆదుకోవాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుకుతున్నాను. ప్రత్యేకించి కూరగాయలు, పాలు, గ్రుడ్ల సరఫరా ఏ రోజుకు ఆ రోజు మారిపోతున్నాయి కాబట్టి దానికి సంబంధించి కూడా ప్రత్యేకమైన సిస్టంను డెవలప్ చేసుకోవాలని కోరుతున్నాను.

రెండవది, టీచర్లను వార్డెన్లుగా ఉంచే పద్ధతి నుండి తప్పించి టీచర్‌ను టీచర్‌గానే ఉంచుతూ, వార్డెన్ పోస్టులను భర్తీ చేసి, పర్యవేక్షణ జరిగే విధంగా చేయాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ బి.చంగల్ రాయుడు (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, గురుకుల పాఠశాలల్లోనూ, గిరిజన సంక్షేమ హాస్టళ్లలోనూ ధరలకు సంబంధించి ఒకే విధమైన టారిఫ్ లేదు. గురుకుల పాఠశాల రేట్లకు , సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల రేట్లకు తేడాలున్నాయి. అన్నింటిని రేషనలైజ్ చేసి అప్‌డేట్‌గా ప్రజెంట్ రేటును ఒకే విధంగా ఉండేటట్లు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మీ ద్వారా మంత్రి గారి దృష్టికి తీసుకువస్తున్నాను.

ఇంతకుముందు చర్చలో కూడా గురుకుల పాఠశాలలకు, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకు సన్నబియ్యాన్ని సరఫరా చేస్తామని చెప్పారు. వాటిని ఎప్పటి నుండి ఇస్తారు? ఇప్పుడు రూపాయికి కిలో బియ్యాన్ని సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకు, గురుకుల పాఠశాలలకు సరఫరా చేయడం జరుగుతోంది. సన్నబియ్యాన్ని సరఫరా చేసే దృష్టి ప్రభుత్వంలో ఉందా? అటువంటి ప్రతిపాదన ఏదైనా ఉంటే సభ దృష్టికి తీసుకురావలసిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ పీరుకట్ల విశ్వ ప్రసాదరావు (స్థానికసంస్థలు, శ్రీకాకుళం): అధ్యక్షా, మోడల్ స్కూల్స్‌ను ప్రతి మండలంలో ఏర్పాటు చేయడం జరిగింది. వాటికి కావాలసిన మెటీరియల్‌ను హైదరాబాద్ నుండి పంపించారు. మెకానిక్‌లను పంపించకపోవడం వల్ల సంవత్సరాల తరబడి అవి అక్కడ నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఆ మెటీరియల్ ఆ పిల్లలకు ఏ విధంగానూ ఉపయోగపడడం లేదు. ఆ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను అడిగితే హైదరాబాద్ నుండి మెకానిక్స్ వచ్చి ఆల్టర్ చేయడం లేదని చెబుతున్నారు. వాటిని వేగంగా అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

డా. ఎం. గేయానంద్ (పట్టభద్రుల నియోజకవర్గం, కడప, అనంతపురం మరియు కర్నూలు): అధ్యక్షా, శ్రీశైలం ఐటిడిఎలో ఉన్న సోషల్ వెల్ఫేర్ పాఠశాలకు ఈ మధ్య కాలంలో వెళ్లి వచ్చాను. ఆ పాఠశాలకు ప్రక్కనే డ్యాం ఉన్నా అక్కడున్న పిల్లలకు త్రాగడానికి నీళ్లు లేవు. అదే విధంగా, పిల్లలు కూర్చోవడానికి బెంచీలు కూడా సరిగా లేవు. ఆ పిల్లల తల్లిదండ్రులు

వచ్చిపోయేందుకు గతంలో ఛార్జీలు ఇచ్చేవాళ్లు. ఈ మధ్య ఇవ్వడం లేదని గౌరవ సభ్యులు చెబుతున్నారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఎటువంటి పరిష్కారాలు ఇస్తారో చెప్పవలసిందిగా మంత్రి గారిని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ రావెల కిషోర్ బాబు : అధ్యక్షా, ఎస్టీలకు సంబంధించి మనకు మొత్తం 222 హాస్టళ్లు, 129 రెసిడెన్షియల్ పాఠశాలలున్నాయి. రెసిడెన్షియల్ స్కూల్స్‌లో దాదాపు 48 వేల మంది విద్యార్థులు, 222 హాస్టళ్లలో దాదాపు 20 వేల మంది విద్యార్థులున్నారు. మొత్తం దాదాపు 68వేల మంది విద్యార్థులు గురకుల పాఠశాలల్లో, హాస్టళ్లలో చదువుతున్నారు. గౌరవసభ్యులు అంటున్న విధంగా, గురుకుల పాఠశాలలకు అవసరమైన సరుకులను సరఫరా చేసే విధానంలో ఉన్న కొన్ని లోపాలను మేము కూడా గుర్తించడం జరిగింది. ఆ లోపాలన్నింటిని సరిచేసి అన్ని సరుకులు సరిగా సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేస్తున్నాను. పౌర సరఫరాల శాఖ అధికారులతో రాబోయే రెండు రోజుల్లో ఒక సమావేశాన్ని కూడా ఏర్పాటు చేయబోతున్నాం. ప్రస్తుతం రూపాయికి కిలో బియ్యాన్ని ఈ హాస్టళ్లకు ఇస్తున్నాము. గతంలో ఉదయలక్ష్మి గారు సివిల్ సప్లయిస్ కమీషనర్‌గా ఉన్నప్పుడు సన్నబియ్యాన్ని సరఫరా చేశారని చెప్పారు. ఇప్పుడు సప్లయ్ చేసే బియ్యాన్ని నేను పర్సనల్‌గా హాస్టళ్లకు వెళ్లి చెక్ చేసినప్పుడు 100 లాట్స్‌లో 20 లాట్ల వరకు సరైన బియ్యం అందడం లేదు. మరల సన్న బియ్యాన్ని సరఫరా చేసే విధానాన్ని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటామని తెలియజేస్తున్నాను.

తరువాత, జిల్లాలలో కూడా మోనిటరింగ్ కమిటీలను వేసి వాటిల్లో అధికారేతరులను అంటే ప్రజాప్రతినిధులను మెంబర్లుగా నియమించి, వాళ్లు పర్యవేక్షణ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేస్తున్నాను. మోడల్ స్కూల్స్‌లో మెటీరియల్‌కు సంబంధించి గుంటూరులో ఒక స్కూల్‌కు మెటీరియల్ వచ్చి గోడౌన్‌లో ఉందని చెప్పి మాకు సమాచారం వచ్చింది. దానిని కూడా స్ట్రీమ్‌లైన్ చేసి ఎక్కడా లోపాలు లేకుండా చూస్తామని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీశైలం ఐటిడిఏ పాఠశాలకు సంబంధించి తల్లిదండ్రులకు ఇంతకుముందు రానుపోను చార్జీలను ఇచ్చిన మాట వాస్తవమే. ఇప్పుడు ఇవ్వడం లేదని గౌరవ సభ్యులు మా దృష్టికి తీసుకువచ్చారు కాబట్టి ఆ విద్యార్థుల తల్లిదండ్రులకు ఛార్జీలను ఇచ్చే విధానాన్ని మరల కొనసాగిస్తామని తెలియజేస్తున్నాను. అక్కడున్న మంచినీటి సమస్యను కూడా పరిష్కారం చేస్తాం.

MR. CHAIRMAN: 5th question i.e., Question No.55 (7442) is deemed to have been answered since the Member Smt. Samanthakamani is not present. 6th Question i.e. Question No.56 (7462) postponed at the request of the Member. Question No.57 (7499) postponed at the request of the Member. Question No.58, Mohd. Jani, please put your question.

## ఉన్నత కులాల్లోని పేదవారి కోసం ప్రత్యేక పథకం

ప్రశ్న నెం. 7407 (58)

సర్వశ్రీ మహమ్మద్ జానీ, రుద్రరాజు పద్మరాజు, బి. చెంగల్ రాయుడు, ఎం.ఎల్.సిలు.,

గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు దయచేసి ఈక్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) అగ్రవర్ణాలలోని పేదవర్గాల సంక్షేమం కోసం ప్రత్యేక పథకాన్ని అమలు చేయడమవుతున్నదా?

ఆ) అయితే, గుర్తించిన అర్హత గల కులాల వివరాలు ఏమిటి?

గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారి తరఫున వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత, చేనేత, అబ్కారి మంత్రి (శ్రీ కొల్లు రవీంద్ర) ః

అ) ప్రస్తుతానికి అటువంటి పథకాన్ని దేనిని అమలుపరచడం లేదు. ఏమైనప్పటికీ, ప్రభుత్వం 2014-15 సంవత్సరపు బడ్జెట్‌లో కాపులు, బ్రాహ్మణుల సంక్షేమం కోసం బడ్జెట్‌ను సమకూర్చాలని ప్రతిపాదించడమైనది.

ఆ) కాపుల సంక్షేమం కోసం రూ.50.00కోట్ల మెత్తాన్ని, బ్రాహ్మణుల సంక్షేమం కోసం రూ.25.00కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రభుత్వం భవిష్యత్తులో అగ్రవర్ణాలలోని పేదల కోసం సముచిత సంక్షేమ పథకాలను రూపొందిస్తుంది.

శ్రీ మహ్మద్ జాని (శాసనసభ నియోజకవర్గం)ః అధ్యక్షా, మంత్రి గారు సమాధానం చెబుతూ 'ఎ' ప్రశ్నకు సమాధానంలో అగ్రవర్ణాలలోని పేదవర్గాల సంక్షేమం కోసం ప్రత్యేక పథకాన్ని అమలు చేయడలేదని చెప్పారు. తరువాత 'బి' ప్రశ్నలో రూ.50కోట్లు కాపులకు, రూ.25 కోట్లు బ్రాహ్మణులకు కేటాయించినట్లు చెప్పారు. ఈ రూ.50 కోట్లు, రూ. 25కోట్లు వారికి సరిపోవు కాబట్టి వాటిని పెంచే ఉద్దేశ్యం ప్రభుత్వానికి ఏమైనా ఉందా?

శ్రీ కొల్లు రవీంద్ర ః అధ్యక్షా, గౌరవ సభ్యులు జాని గారు అడిగినట్లు తప్పకుండా ఆలోచన చేస్తాం. ఎందుకంటే, గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మొట్టమొదటి సారిగా అగ్రవర్ణాలలోని అటు కాపులకు గాని, బ్రాహ్మణులకు గాని మొదటిసారిగా చంద్రబాబునాయుడి గారి ఆధ్వర్యంలో ఈరోజు బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెట్టడం జరిగింది. భవిష్యత్తులో దీనిని పెంచడానికి గాని, ఇతర వర్గాలకు సంబంధించి ఏవైనా ప్రతిపాదనలు వచ్చినా తప్పకుండా పరిశీలించి సహాయం చేయడం జరుగుతుందని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీ రుద్రరాజు పద్మరాజు (శాసనసభ నియోజకవర్గం)ః అధ్యక్షా, అగ్రవర్ణాలలోని కాపులు మరియు బ్రాహ్మణుల సంక్షేమం కోసం బెడ్జెట్‌లో కాపులకు రూ.50కోట్లు, బ్రాహ్మణ నిధి క్రింద రూ.25 కోట్లు కేటాయించినట్లు గౌరవ మంత్రి గారు చెప్పారు. చంద్రబాబు నాయుడు గారు పాదయాత్ర చేసినప్పుడు చేసినటువలంటి వాగ్దానాలలో భాగంగా బ్రాహ్మణులకు రూ.500కోట్లతో బ్రాహ్మణ నిధిని పెడతామని ఆరోజు వాగ్దానం చేయడం జరిగింది. అలాగే, కాపులకు సంబంధించి రూ.1000కోట్ల నిధిని ఏర్పాటు చేస్తామని కూడా చెప్పడం జరిగింది. కాని, ఈ బడ్జెట్‌లో వారికి కేటాయించినటువంటి నిధులను చూస్తే చాలా తక్కువగా ఉన్నాయి. నేను ఒక ప్రశ్నను సూటిగా అడుగుతున్నాను. అగ్రవర్ణాలలో కాపులు, బ్రాహ్మణులే ఆర్థికంగా వెనుకబడి ఉన్నారా? లేక ఇతరులు కూడా ఎవరైనా వెనుకబడి ఉన్నారా? అది మీ దృష్టికి వచ్చిందా? ఈ ఇద్దరు కూడా అగ్రవర్ణాలలో ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని ఏ కమీషన్‌ను అయినా చెప్పిందా? లేదా ఏదైనా కమీషన్‌ను వేశారా లేక వేయబోతున్నారా అని మీ ద్వారా గౌరవ మంత్రి గారిని అడుగుతున్నాను.

శ్రీ కొల్లు రవీంద్ర : అధ్యక్షా, గౌరవ సభ్యులు పద్మరాజు గారు అడిగిన ప్రశ్నకు భవిష్యత్తులో ఎవరైనా ప్రతిపాదన పంపినట్లయితే కచ్చితంగా వారికి కూడా తగిన న్యాయం చేయడం జరుగుతుంది.

గతంలో ముఖ్యమంత్రి గారు పాదయాత్ర చేసిన సమయంలో కాపులకు గాని, బ్రాహ్మణులకు గాని ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పిన దానిలో భాగంగానే మొదటి విడితగా కాపులకు రూ.50కోట్లు, బ్రాహ్మణులకు రూ.25 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించడం జరిగింది. ఇతర కులాల నుండి ఏదైనా ప్రతిపాదనలు వస్తే వాటిని పరిశీలించి తప్పకుండా న్యాయం చేయడం జరుగుతుందని ఆరోజు ఇచ్చిన హామీకి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలియజేస్తున్నాను.

SRI B. CHANGAL RAYUDU: Sir, the very purpose of this question is defeated. Answer is totally different. The sanctum and sanctorum of the question is different from the answer. రాష్ట్రంలో ఉన్నటువంటి ఉన్నత కులాలలో అర్థికంగా వెనుకబడిన వారందరికి కూడా ఈ సౌకర్యం కల్పిస్తున్నారా అని ప్రశ్న అడిగితే రెండు పేర్లు చెప్పి వాళ్లకు నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆ రెండు పేర్ల గురించి మేము ఎప్పుడూ అడగలేదు. మేము అడిగిన ప్రశ్నను చూడండి అధ్యక్షా. What is your name అని అంటే My name is Chengalrayudu అని అంటే ఫుల్ మార్కులు వస్తాయి. కనీసం మా ఫాదర్ పేరు చెప్పినా పాస్ మార్కులు వస్తాయి. మా తాత పేరు చెపితే మనవడు కాబట్టి కొన్ని మార్కులైనా వస్తాయి. వీళ్ల ముగ్గురు పేర్లు లేకుండా ఆన్సర్ వస్తే, ఆన్సర్ వచ్చిందని ఎలా అనుకుంటాం? ఇక్కడున్న ప్రశ్నలన్నింటికి బిట్ రూపంలో ఆన్సర్లు వచ్చాయి.

మిస్టర్ ఛైర్మన్ : చంగల్ రాయుడు గారూ.. మిగతా వారి నుండి ఏమైనా విజ్ఞప్తులు వస్తే ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి గారు చెబుతున్నారు.

శ్రీ బి.చంగల్ రాయుడు : అధ్యక్షా, హిందూపురం నుంచి విశాఖపట్టణం వరకు మిగతా వారు ఎవరూ అడగలేదు. అర్థికంగా వెనుకబడిన వారందరినీ, ఉన్నత కులాలలో ఉన్నటువంటి చిన్నా, చితకా అందరిని మేము ఆదుకుంటాం. మేము చేస్తామని చెప్పి ఆరు నెలలు పాటు ఊరూరు తిరిగి చెప్పిన మాటల్లో ఇద్దరికి మాత్రమే ఇస్తే మిగతా వారి సంగతి ఏమిటి? ఇది కూడా ఫుల్ మీల్ అవుతుందా? కాదే? దీని మీద ఒక కమీషన్‌ను వేయమనండి. I request the Government through you Sir. ఏదో ఒక కులం కాకుండా, ఆ కులం, ఈ కులం అని కాకుండా ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారందరి గురించి ఒక కమీషన్‌ను వేయాలి. ఉన్నత కులాల్లో కూడా అడుక్కొని తినే వాళ్లున్నారు. బువ్వ దొరకని వాళ్లున్నారు. అందరి గురించి రాష్ట్ర ప్రభుత్వం ఒక కమీషన్ వేసి ఆర్థికంగా వెసులుబాటు కల్పించే విధంగా చర్యలు తీసుకోవలసిందిగా మీ ద్వారా కోరుతున్నాను. అలాంటి ప్రతిపాదన ప్రభుత్వం దగ్గర ఏమైనా ఉందా? ఉంటే ఎప్పటి లోపు చేస్తారో చెప్పవలసిందిగా కోరుతున్నాను.

ఉ.10.20

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు ః ఆంధ్రప్రదేశ్‌లో 23జిల్లాలుగా కలిసి ఉన్నప్పుడు బిసిలుగా గుర్తించిన చాలామంది ఆంధ్రాప్రాంతం వారు ఇప్పుడు తెలంగాణాప్రాంతంలో ఉన్నారు. అటువంటి వారిని ఎఫ్.సిలుగా గుర్తిస్తూ తెలంగాణా ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని చూస్తున్నదని తెలిసింది. అటువంటి పరిస్థితిగనక ఏర్పడితే మన ప్రభుత్వం వారిని కాపాడాలని ఈ సభ ద్వారా నేను కోరుతున్నాను.

శ్రీ ఎమ్.వి.ఎస్.శర్మ (పట్టభద్రుల నియోజకవర్గం, శ్రీకాకుళం, విజయనగరం మరియు విశాఖపట్నం)ః అధ్యక్షా, రిజర్వేషన్‌కు రెండు కులాలను ఎంచి వాటికి ప్రత్యేకించి నిధులు కేటాయించడానికి కొలబద్ద ఏమిటి? గతంలో ఓ.సి., బి.సి, ఎస్సీ వంటి వర్గాలను కేటాయించడానికి ఒక కొలబద్ద పెట్టుకుని నిర్ణయించింది. ప్రతిదానికి ఒక కమీషన్ ఉన్నది. బి.సి. అయితే ఫలానా ఉండాలి అనే కొలబద్ద ఉన్నది. అవి కాకుండా మిగతావాళ్లు ఓ.సి క్రిందకి వస్తారు. అయితే, ఇక్కడ ఓ.సి.లలో రెండు కులాలను ఎంచి చేయడమనేది ఏమైనా political expediencyనా, లేకపోతే మిగతావాళ్లు అందుకు ఎలిజిబులిటీ లేనందువల్లనా అనేది తెలియడం లేదు. ప్రభుత్వం వారు కోరితేనే ఇస్తామని అనడం arbitrary అవదా? కోరితే ఇస్తామనడమేమిటి? అవసరం, అర్హత ఉంటే ప్రభుత్వం ఆదుకోవడం అవసరమని భావిస్తే ఖచ్చితంగా ఇవ్వాలి. దానివెనక ఒక అధ్యయన నివేదిక ఉండాలి. కేవలం ఎన్నికల హామీలాగా ఆర్బిట్రరీగా నిర్ణయించడమనేది సరైన విధానం కాదు. కాబట్టి, other than SC, ST and BC కులాలపై ప్రభుత్వం ఒక అధ్యయన కమిటీ వేసి వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులను అధ్యయనం చేసి దాని ఆధారంగా నిర్ణయం తీసుకుంటే అది సరైనదవుతుంది. లేదా, ప్రభుత్వం రిక్వెస్ట్‌లకోసం ప్రతిపాదనలు పెడితే చాలా వస్తాయి. అలా వచ్చినప్పుడు ఆలోచిస్తామనేది పద్ధతి కాదు. దానిపై స్పందించాలని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కొల్లు రవీందర్ ః గతంలోని మ్యానిఫెస్టోలో గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా ఈ రెండు వర్గాలకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధి పెడతామని చెప్పడం జరిగింది. అందులో భాగంగా మొదటవిడతగా మేము ఇవ్వడం జరిగింది. గౌరవసభ్యులు చెప్పిన విషయాలను తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని తెలియచేస్తున్నాను. ఏవైతే ఆర్థికంగా వెనకబడిన వర్గాలున్నాయో వాటికి తప్పకుండా న్యాయం చేస్తామని మనవిచేస్తున్నాను. తెలంగాణాలో కొన్ని బి.సి. కులాలను పరిగణనలోకి తీసుకోకుండా ఆ ప్రభుత్వం వారు జి.వో.ని విడుదల చేయడానికి సిద్ధపడిన తరుణంలో ఈ అంశాన్ని చీఫ్ సెక్రటరీగారి వద్దకు తీసుకువెళ్లడం జరిగింది. వెంటనే తెలంగాణ చీఫ్ సెక్రటరీగారి వద్దకు కూడా ఈ విషయాన్ని తీసుకువెళ్లి విభజన చట్టంలో ఉన్నవిధంగా పది సంవత్సరాలు ఉమ్మడిగా ఉండాలనే విషయాన్నే కొనసాగించాలని చెప్పడం జరిగింది.

మిస్టర్ ఛైర్మన్ ః దీనిపై ఒక ప్రత్యేక కమీషన్ వేయమని గౌరవ సభ్యులు కోరారు. Examine to include benefits to Economically Backward Sections వాటిపై ఏదైనా కమీషన్ వేస్తారా?

శ్రీ కొల్లు రవీందర్ ః కమీషన్ ఏర్పాటు చేయడం విషయంపై కూడా పరిశీలన చేస్తాము అధ్యక్షా.

శ్రీమతి పమిడి శమంతకమణి ః ఈ రోజు 4 ప్రశ్నలు ఉన్నాయి. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాను అధ్యక్షా, కొద్దిగా లేటయ్యింది. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి కూడా నేను ఒక ప్రశ్న ఇచ్చాను.

MR. CHAIRMAN: Question Nos.7494 (52) and 7492 (53) are deemed to have been answered.

## HOUSES UNDER S.C. & S.T. SUB-PLAN

L.C.Q. No. 7494 (52)
Smt P. Samanthakamani, M.L.C.

Will the Minister for Rural development & Housing be pleased to state?

a) Number of Houses sanctioned under SC,ST Sub-Plan in Ananthapur District;
b) Whether it is a fact that construction work has not been yet started under the sub-plan; and
c) If so, the time by which the work will be completed ?

Hon'ble Minister for Rural Development & Housing (Smt. Kimidi Mrunalini):

a) During 2013-14, 7,227 houses under SC Sub-Plan & 1515 Houses under Tribal Sub-Plan were sanctioned in Ananthapur District.
b) No, Sir.
c) 2,498 houses were completed under SCSP and 646 Houses were completed under TSP during the year 2013-14. The balance houses are at various stages of construction.

## BANGARUTHALLI SCHEME

L.C.Q. No. 7492 (53)
Smt P. Samanthakamani, M.L.C.

Will the Minister for Rural development & Housing be pleased to state?

a) total number of girls covered under BANGARU THALLI PATHAKAM in Ananthapur District; and
b) The number of girls benefited under this PATHAKAM so far?

Hon'ble Minister for Rural Development & Housing (Smt. Kimidi Mrunalini):

a) 9,055 girls children
b) 1,01,068 girl child.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం (ఉపాధ్యాయ నియోజకవర్గం, ప్రకాశం, నెల్లూరు మరియు చిత్తూరు)ః మేము చాలా ప్రశ్నలు ఇచ్చాము, కానీ, ఒక్కటి కూడా రావడం లేదు. శమంతకమణిగారివి మాత్రం రోజూ 2,3వస్తున్నాయి. ఇది చాల imbalance గా ఉన్నది.

డా. ఎమ్.గేయానంద్ ః మేము ఇచ్చిన ప్రశ్నలు కూడా రావడం లేదు సార్.

మిస్టర్ ఛైర్మన్ ః లాటరీ వేస్తున్నారు. మొన్న చంద్రశేఖర్ గారు ఉన్నప్పుడు కూడా నేను చెప్పాను.

శ్రీ ఎమ్.వి.ఎస్.శర్మ ః ఒక ప్రశ్న పిడిఎఫ్ గ్రూప్‌కి రావాలి సార్. We are six in number Sir. కానీ, గడచిన అయిదు రోజులలో ఇప్పటికి రెండుసార్లు మాకు ప్రశ్నలు రాలేదు. దీనిపై కొద్దిగా ఎగ్జామిన్ చేయండి సార్.

MR CHAIRMAN: Mr. Sarma, you remember, I have also told. I requested you over phone when you are in the Quarters. Immediately, you came and given the Questions. I have also initiated for giving Questions. Definitely, we will sort it out. Moreover, you have a lot of experience. రాష్ట్రం కొత్తదైనా సభ్యులంతా పాతవాళ్లే. అందరికీ తెలుసు.

డా.ఎమ్.గేయానంద్ : అసలు ఏ ప్రశ్నలు ఉన్నాయని కనుక్కోవడానికి మేము క్వశ్చన్స్ సెక్షన్‌కు వెడితే అక్కడ ఈ పింక్‌బుక్ (ప్రశ్నల బుక్‌లెట్) ఇంకా వాళ్లకు రాలేదన్నారు. ప్రింటింగ్‌ప్రెస్‌లో తెలంగాణావాళ్లు ఉండి ప్రింట్ చేయడంలేదంటున్నారు. ఏదో ఒకటి దానికి తగిన ఏర్పాటు చేయండిసార్, ఇంకెవరినైనా పెట్టి చేయించండి సార్. లేకపోతే ఇబ్బందవుతుంది.

MR. CHAIRMAN: It was brought to my notice. Definitely, we will sort it out.

## వాతావరణం మార్పు

ప్రశ్న నెం. 7446(59)
శ్రీమతి పి. శమంతకమణి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన అటవీ, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలోని కోస్తా ప్రాంత విపత్తులు, కరువులు, మానవ అనారోగ్యాలు, జలవనరుల క్షీణతకు వాతావరణ కారణమయ్యాయా?

ఆ) రాష్ట్రంలోని వాతావరణ మార్పులపై ప్రభుత్వం ఏదైనా కార్యచరణ ప్రణాళికను రూపొందించిందా?

ఇ) అయితే, ఆ వివరాలేమిటి?

గౌరవనీయులైన అడవులు, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక విజ్ఞానశాఖమంత్రి (శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి):

అ) అవునండీ.

ఆ) అవునండీ.

ఇ) వాతావరణ మార్పులపై రాష్ట్ర కార్యాచరణ ప్రణాళిక (ఎస్ఎపిసిసి)ను రూపొందించవలసిందిగా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. వాతావరణ మార్పులపై జాతీయ కార్యాచరణ ప్రణాళికకు అనుగుణంగా ఎస్ఎపిసిసిని రూపొందించవలసి ఉంటుంది. ఆ ప్రకారంగా, అటవీ, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన శాఖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ఎస్ఎపిసిసిని రూపొందించవలసిందిగా రాష్ట్రానికి నోడల్ ఏజెన్సీ అయినట్టి ఇపిటిఆర్ఐకి సూచించింది.

వాతావరణ మార్పుపై రాష్ట్ర కార్యాచరణ ప్రణాళిక వాతావరణ మార్పు ప్రతికూల ప్రభావానికి కీలకమైనట్టి ఈ క్రింది ముఖ్యమైన రంగాలను గుర్తించింది.

1. వ్యవసాయం 2.తీర ప్రాంత నిర్వహణ 3.అడవుల పెంపకం & జీవవైవిధ్యం 4.ఇంధనం 5.పరిశ్రమలు (గనుల త్రవ్వకంతో సహా) 6.రవాణా 7.ఆరోగ్యం 8.పట్టణాభివృద్ధి 9.పర్యాటక 10.గ్రామీణాభివృద్ధి 11.వాతావరణ మార్పుపై పరిశోధన.

తీర ప్రాంతాలు, కరువు పీడిత ప్రాంతాలు రెండింటికీ విపత్తు మదింపు అధ్యయనాన్ని నిర్వహించడమయింది. డేటా ఆధారంగా, వాతావరణ మార్పు కారణంగా ప్రస్తుతమున్న, రాబోవు ప్రతికూల ప్రభావాలను తగ్గించడానికి ప్రణాళికలను ఉదహరించడమయింది.

విపత్తు అధ్యయన ఫలితాలను దృష్టిలో ఉంచుకుంటూ, రంగంవారీ ప్రాధాన్యతలను గుర్తించి, నివేదికలో చేర్చడమయింది. గుర్తించిన ప్రాధాన్యతల అమలుకోసం రెండు ప్రణాళికా కాలాలు అంటే 2012-2017 మరియు 2017-2022 కోసం కూడా బడ్జెటును అంచనా వేసి, నివేదికలో చేర్చడమయింది. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ మంత్రిత్వ (ఎంఓఇఎఫ్) శాఖ వాతావరణ మార్పుపై జాతీయ స్టీరింగ్ కమిటీ ఎస్ఎపిసిసి నివేదికను ఆమోదించింది.

శ్రీమతి పి. శమంతకమణి : పోడు వ్యవసాయం, స్మగ్లర్ల వ్యవహారాలతో అడవుల పరిస్థితి అస్తవ్యస్తం అయిపోతున్నది సార్. వర్షాలకు, మిగతా వాతావరణానికి అనుకూలంగా ఉన్న అడవులు నేడు చాలా మార్పులకు గురికావడం, చాలాచోట్ల అనావృష్టికి గురవుతున్నది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో అడవుల పెంపకం సరిగా లేనందువల్ల వర్షపాతం చాలా తక్కువగా ఉన్నది. మరోప్రక్క కోస్తా ప్రాంతంలో కూడా అనేక విపత్తులు సంభవిస్తున్నాయి. వాతావరణం సరిగా లేనందువల్ల అక్కడ ఉన్న గిరిజనపుత్రులు చాలావరకు అనారోగ్యాలకు, అంటువ్యాధులకు గురవుతున్నారు. వీటి మీద శాశ్వత నివారణ ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా? దానిపై ప్రభుత్వం ఏమైనా ఆలోచించిందా? వాటిని అమలు పరచడంపై ఏదైనా విధానమున్నదా అనే వివరాలను తెలియచేయవలసిందిగా గౌరవమంత్రిగారిని కోరుతున్నాను.

ఉ.10.30

SRI B. GOPALAKRISHNA REDDY: Sir, we appreciate the anxiety of the Hon'ble Member. గౌరవసభ్యులు పర్యావరణం మరియు అడవుల సంరక్షణ విషయంలో గతంలో జరిగిన పొరపాట్లు జరగకుండా చూడాలని సలహానిచ్చారు. చాలా సంతోషం. వాస్తవానికి ఈ ప్రభుత్వం అడవులను అభివృద్ధి చేయాలని కృతనిశ్చయంతో ఉంది. అది social forestry విషయంలో కావచ్చు, మొక్కలు నాటే విషయంలో కావచ్చు. గతంలో రాష్ట్రం మొత్తం మీద కోటి మొక్కలు ఉచితంగా ఇచ్చేవారు. ప్రస్తుతం ప్రతి జిల్లాకు కోటి మొక్కలను ఉచితంగా ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నాము. ఆ విధంగా పర్యావరణం మరియు అడవులను సంరక్షించడం జరుగుతోంది. తీరప్రాంతం మన రాష్ట్రంలో దాదాపు 972 కిలోమీటర్ల మేర ఉంది. ఆ మొత్తం తీరప్రాంతాన్ని తుఫానుల నుండి పరిరక్షించడానికి తగిన నివారణ చర్యలను కూడా తీసుకోవడం

జరుగుతోంది. బలహీన వర్గాలకు చెందిన వారందరినీ కూడా సంరక్షించడం కోసం వన సంరక్షణ కార్యక్రమం ద్వారా ఫలసాయం మరియు భూమిపై హక్కును వారు తీసుకునే విధంగా చేయడం జరుగుతోంది. కేంద్రప్రభుత్వం కూడా ఈ అంశం కోసం ఒక పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆ పథకం ద్వారా ఎక్కువ నిధులను తీసుకువచ్చి పర్యావరణం మరియు అడవులను అభివృద్ధి చేయడం జరుగుతుందని తమరి ద్వారా నేను సభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీమతి పమిడి శమంతకమణి: అధ్యక్షా, అత్యంత విలువైన ఎర్రచందనం చాలావరకూ స్మగ్లర్ల ద్వారా విదేశాలకు తరలిపోతోంది. ఈ మధ్యనే ఈ విషయాలను వార్తాపత్రికలద్వారా, టెలివిజన్ల ద్వారా కూడా వీక్షించడం జరిగింది. ఈ స్మగ్లర్ల ముఠాకు ముఖ్య నాయకుడైన గంగిరెడ్డిగారిపై ప్రభుత్వం ఎటువంటి కఠిన చర్యలను తీసుకుంటోంది? ఇటువంటి వారిపై కఠిన చర్యలను ప్రభుత్వం తీసుకోకపోతే ఈయనను చూసి మరొక వ్యక్తి, ఆ వ్యక్తిని చూసి ఇంకొక వ్యక్తి మరలా స్మగ్లింగుకు పాల్పడి ఇది ఒక ఆనవాయితీగా మారుతుంది. అత్యంత విలువైన ఎర్రచందనాన్ని విదేశాలకు తరలిస్తోన్న స్మగ్లర్లపై చర్యలు తీసుకోకపోతే ఏ విధంగా ఈ ప్రభుత్వాన్ని కొనసాగిస్తారో మంత్రిగారు తెలియజేయవలసిందిగా తమరిద్వారా నేను కోరుతున్నాను.

శ్రీ పి.జె.చంద్రశేఖరరావు (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, సముద్ర తీరప్రాంతాల వద్ద మడ అడవులు అని ఉంటాయి. రొయ్యలు సముద్రంలో కాక మడ అడవులలో గుడ్లు పెడతాయి. ఈ మడ్ అడవులు నాశనం కావడం వల్ల రొయ్యల ఉత్పత్తి సముద్రంలో తగ్గి జాలర్లకు నష్టం జరుగుతోంది, జీవ వైవిధ్యానికి కూడా చాలా ఇబ్బంది కలుగుతోంది. దీనికి సంబంధించి ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటోంది?

2012-2017, 2017-2022 సంవత్సరాల కోసం బడ్జెట్‌ను అంచనా వేసి పంచవర్ష ప్రణాళిక ప్రాతిపదికగా కేంద్రప్రభుత్వం ఇచ్చేదానిలో భాగంగా దీనిని గౌరవమంత్రిగారు ప్రస్తావించారు. ఆ పంచవర్ష ప్రణాళికలను కూడా ఎత్తివేసే ప్రమాదం ఉంది కాబట్టి దీనికి ప్రత్యామ్నాయంగా కేంద్రప్రభుత్వ ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో చేయడమనే అంశానికి భిన్నంగా 972 కిలోమీటర్ల తీరప్రాంతం ఉన్న నేపథ్యంలో ప్రత్యేకమైన ప్రణాళికలను రూపొందించే అవసరం ఏదైనా ఉన్నదా?

గతంలో అనేక తుఫానులు సంభవించినప్పుడు కోస్తా తీరప్రాంతంలో కొన్ని వందల తుఫాను షెల్టర్లను నిర్మించడం జరిగింది. ప్రస్తుతం తుఫాను సంభవిస్తే, మనుషులుగానీ, పశువులుగానీ ఉండడానికి అక్కడ ఒక్క తుఫాను షెల్టర్ కూడా లేదనే విషయం గౌరవ మంత్రిగారికి తమరిద్వారా తెలియజేస్తున్నాను. వాటిని పునరుద్ధరించడానికి ఏవైనా ప్రణాళికలు, ఆలోచనగానీ చేసి ఆ ప్రజల మాన, ప్రాణ రక్షణకోసం ఏదైనా చర్యలు తీసుకుంటారా అని తమరిద్వారా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ రుద్రరాజు పద్మరాజు: అధ్యక్షా, జాతీయ అటవీ విధానం ప్రకారం భౌగోళిక ప్రదేశంలో 33 శాతం అడవులుండాలి. కానీ, మన రాష్ట్రంలో 25.6 శాతం మాత్రమే ఉందనేది మంత్రిగారికి కూడా బాగా తెలుసని నేను భావిస్తున్నాను. కానీ, 7.46 శాతం గ్యాప్ ఏదైతే ఉన్నదో దానిని ఏ విధంగా భర్తీ చేయదలచుకున్నారనేది నా మొదటి ప్రశ్న.

రెండవది, మనకు 972 కిలోమీటర్ల చాలా సుదీర్ఘమైన తీరప్రాంతం ఉంది. సునామీ, జల్, లైలా, నీలం వంటి తుఫానులు సంభవించినపుడు తీరప్రాంతమంతా కోతకు గురికావడం మా ప్రాంతంలో కూడా మేము చూడడం జరిగింది. రెండు సంవత్సరాల క్రితం 'అంతర్వేది' అనే పుణ్యక్షేత్రంలో సముద్రం ఒక కిలోమీటర్ ముందుకు వచ్చిన సంఘటనలను కూడా మేము చూడడం జరిగింది. గతంలో ఆ ప్రాంతంలో సరుగుడు చెట్లు అంటే "cashew rhinos" వేయడం వల్ల సముద్రగాలి ఉధృతికి, కోతకు గురి కాకుండా ఉండడం కోసం అటవీ శాఖ చర్యలు తీసుకుంటూ ఉండేది. ఈ మధ్యకాలంలో అటువంటి శ్రద్ధను ప్రభుత్వం తీసుకుంటున్నట్లుగా అనిపించడం లేదు. దయచేసి అటువంటి చెట్లను ఆ ప్రాంతంలో నాటవలసిన ఆవశ్యకత ఉంది. చెట్లను నాటినప్పటికీ, వాటికి సరైన సంరక్షణ లేకపోవడం వల్ల సముద్రం ఈ విధమైన కోతకు గురికావడం జరుగుతోంది. దయచేసి దీనికి సంబంధించి ఎటువంటి చర్యలను తీసుకుంటారో మంత్రిగారు చెప్పవలసిందిగా తమరిద్వారా నేను కోరుతున్నాను.

శ్రీ ఆర్.రెడ్డపరెడ్డి (నామినేటెడ్): అధ్యక్షా, మొదటిది, direct consequences of climatic changes, industrialization మరియు రెండవది, decreasing forest cover. ఇండస్ట్రియలైజేషన్ గురించి మనం ఏమీ చేయలేము. కానీ, గత సంవత్సరం అటవీ శాఖకు సంబంధించి స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు కూడా నేను సీనియర్ అధికారులతో అనేకసార్లు చర్చించడం జరిగింది. అందరి కంప్లైంట్, budget allocation for afforestation, both for forest department and social forestry. రెండింటికీ కూడా చాలా తక్కువ కేటాయింపులున్నాయి. Totally, negligible allocation has been made for social forestry. వాళ్ల ఎస్టాబ్లిష్‌మెంట్ ఖర్చులకు కూడా నిధులు సరిపోవడంలేదు. జిల్లాల్లో కూడా ప్రస్తుతం సోషల్ ఫారెస్ట్రీకోసం జిల్లాకు ఒక డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ అధికారి ఉన్నారు. మాకు ఒక పాఠశాలకు 100 చెట్లు ఇస్తారా అని ఆ అధికారిని అడిగితే సార్ చెట్లు ఏమీ లేవని చెబుతున్నారు. నేను పలమనేరుకు వెళ్లి చెట్లను నాటే కార్యక్రమంలో పాల్గొని వచ్చాను. కొన్ని చెట్టను అక్కడ నాటడానికి నేను కూడా తీసుకుని వెళ్లాను. ప్రతి మున్సిపాలిటీకి కొన్ని fixed amount of trees పెట్టారు. నేను కూడా చొరవ తీసుకుని దానికంటే రెట్టింపు చెట్లను నాటాలని వారితో చెప్పాను. So, I request the Hon'ble Minister to see the social forestry. మీకు గుర్తుందో లేదో, 80 వ దశకంలో social forestry చేసి ఆ రోజుల్లో మంచి vegetation either side of the roads అభివృద్ధి చేయడం జరిగింది. అప్పుడు విదేశాల నుంచి ఎయిడ్ కూడా రావడం జరిగింది. For the last ten years social forestry is totally neglected and proper allocation of funds should be made to the social forestry.

డా. ఎం. గేయానంద్: అధ్యక్షా, వాతావరణ మార్పు అనేది అన్ని దేశాలలో చర్చ జరుగుతున్న విషయం. మా అనంతపురం జిల్లాలో దీని ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. You come and see there is a desert look. ప్రస్తుతం అక్కడ ఎడారి ఉంది. వాతావరణ మార్పుల వల్ల వస్తున్న consequences అనేవి చాలా profoundగా ఉంటాయని చెబుతున్నారు. అవి ఎంత profoundగా ఉంటాయంటే రాబోయే 20 లేక 30 సంవత్సరాలలో సగం విశాఖపట్నం నగరం మునిగిపోతుందని చెబుతున్నారు. కరవు మరింత పెరుగుతుందని చెబుతున్నారు.

ఉ.10.40

కరువు మరింత తీవ్రమవుతుంది, దోమలు పెరుగుతాయని చెపుతూ ఒక పరిష్కారాన్ని చెపుతున్నారు. కార్బన్ ట్రేడింగ్, కార్బన్ క్రెడిట్స్ ఇవి రెండూ ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున డిబేట్‌లో ఉంటున్న విషయాలు. చాలా దేశాలు దీంతో లాభం పొందుతున్నాయి. అందువల్ల మన రాష్ట్రంలో కార్బన్ ట్రేడింగ్, కార్బన్ క్రెడిట్స్‌కు సంబంధించి మీరు ఎటువంటి కార్యాచరణ రూపొందించారు, ఎన్ని నిధులొస్తున్నాయి, ఏ ఏ సంస్థలను ఇందులో భాగస్వాములను చేస్తున్నారు వంటి అంశాలను చెప్పాల్సిందిగా కోరుతున్నాను. అదే విధంగా వాతావరణ మార్పులకు సంబంధించి ఒక ప్రత్యేకమైన కమీషన్‌ను మన రాష్ట్రంలో ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. జాతీయ స్థాయిలో ఒక కమిటీ వేశారు, అందుకు పచౌరి గారికి నోబుల్ బహుమతి కూడా వచ్చింది. కాబట్టి వాతావరణ మార్పులను అధ్యయనం చేయడం కోసం ఒక ప్రత్యేకమైన కమీషన్‌ను మన రాష్ట్రంలో ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. అందుకు ప్రభుత్వం సమాధానం చెప్పవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి : సార్, ప్రపంచమంతా వాతావరణ మార్పులపై దృష్టి సారిస్తుంది, చాలా సంతోషం. ఒక ప్రత్యేకమైన కమిటీ వేయమని కూడా సలహా ఇచ్చారు. కార్బన్ ట్రేడింగ్, క్రెడిట్స్‌కు సంబంధించి ఏ విధంగా చర్యలు తీసుకుంటారని. కార్బన్ ట్రేడింగ్, క్రెడిట్స్‌లను ఇండస్ట్రియల్ పర్పస్‌కు వినియోగిస్తారు. రెండవదిగా సభ్యులు శ్రీ రెడ్డెప్పరెడ్డి గారు మున్సిపాలటీలో మాకు మొక్కలు ఎక్కువగా కావాలని అడుగుతున్నామని చెప్పారు. తప్పకుండా ఎన్ని మొక్కలు కావాలన్నా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. నీడకు సంబంధించినవైనా, పండ్ల చెట్లనైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. చంద్రబాబు నాయుడు గారు ప్రభుత్వంలోని రావడంతోటే ఎర్ర చందనానికి సంబంధించి ప్రకంపనలు ప్రారంభమయ్యాయి. అయితే ఎర్ర చందనానికి సంబంధించి స్మగ్లర్ల యాటిట్యూడ్ ఎక్కువగా ఉండింది. తమిళనాడు రాష్ట్రం నుంచి కూలీలను తెప్పించి చెరకు పంటను కొట్టిన విధంగా కొట్టివేశారు. దానికి సంబంధించి కొంత మందిని అరెస్టు చేశారు, కొంత మందిపైన పిడి చట్ట పెట్టారు. కానీ జైల్లో కూర్చున్న వారిని స్వాతంత్ర సమర యోధులుగా భావించి రాజమండ్రి జైలుకు వెళ్లి పరామర్శించడం బాధ కలిగిస్తుంది. వారు ఒక పార్టీకి సంబంధించిన వారని నేను చెప్పను. అటవీకరణలో ఉండే గ్యాప్‌ను ఎలా ఫిల్ చేస్తారని అడిగారు సభ్యులు శ్రీ రుద్రరాజు పద్మరాజు గారు అడిగారు, కానీ అది ఉండే అడవిని పరిరక్షించుకున్నా, లేకపోతే రహదారులకిరువైపులా చెట్లు నాటించినా సరిపోతుంది. నిన్ననే 65వ వన హోత్స సభ జరిగింది, అందులో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరూ పాల్గొని ఉంటారని అనుకుంటున్నాను. దాన్ని ఉత్సవం లాగా చేశారు. నవ్యాంధ్రప్రదేశ్‌ను హరితాంధ్రప్రదేశ్‌గా చేయాలని ఒక దృక్పథంతో ముందుకు పోతున్నాం. దానికి సంబంధించి నిధుల కొరత లేదు. కాంపెన్సేటరీ afforestation క్రింద 'క్యాంపా నిధులు' మనకు దాదాపు రూ.1800 కోట్లు ఉంది. కనుక నిధుల కొరత ఏ మాత్రం లేదు. అదే విధంగా ఫారెస్ట్ డెవ్‌లప్‌మెంటు కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. వారు అప్పులన్నిటినీ తీర్చేసి ఇంకా దాదాపు రూ.200 కోట్లు సమకూర్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రమైన తరువాత అటవీ ప్రాంతం దాదాపు ఒక్క కోటి ఎకరాలుంది. ప్రతి జిల్లాలో కూడా అటవీ విస్తీర్ణం ఉంది. సదరు ఆదాయంతోనే ప్రభుత్వాన్ని నడపొచ్చు. అటువంటిది అటివీ శాఖ పోయి మాకు నిధులివ్వమని ప్రభుత్వాన్ని అడిగే పరిస్థితి లేదు. మేమే ప్రభుత్వానికి కాంట్రిబ్యూట్ చేసే పరిస్థితి వస్తుందని మీకందరికీ సవినయంగా మనవి చేసుకుంటున్నాను. ఇంకా ఏమైనా అనుబంధ ప్రశ్నలు అడిగితే నేను. సమాధానం చెపుతాను.

శ్రీ రుద్రరాజు పద్మరాజు : సముద్ర తీర ప్రాంతాలకు సంబంధించిన ప్రాంతాల్లో తుఫానుల వల్ల భారీగా తీర ప్రాంత కోతలు సంబవిస్తున్నవి. How you are going to arrest it.

శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి : తీర ప్రాంతాల్లో జీడి మామిడి చెట్లకు బదులుగా తాటి చెట్లను నాటి నట్లయితే అవి కొంచెం తాకిడిని తట్టుకోగలుగుతాయి. దానికి సంబంధించి పరిశీలన చేసీ తప్పకుండా తగు చర్యలు తీసుకుంటాం.

డా. ఎం. గేయానంద్ : కార్బన్ ట్రేడింగ్ వల్ల రాష్ట్రానికి నిధులొస్తాయి, కాబట్టి దానిపైన దృష్టిని సారించాలని కోరుతున్నాను.

శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి : పరిశ్రమల్లో కాలుష్య నివారణకు పరిశ్రమలు తీసుకుంటున్నాయి, కానీ దాన్ని పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది, తప్పకుండా పర్యవేక్షిస్తాం.

డా. ఎం. గేయానంద్ : చెట్లు పెంచి దానికి సంబంధించి ప్రాపర్ అకౌంటింగ్ చేస్తే నిధులొస్తాయి.

SRI BOJJAL GOPALA KRISHNA REDDY : We will examine.

శ్రీ బి. చంగల్‌రాయుడు : వాతావరణ కాలుష్యానికి ముఖ్య కారణం పరిశ్రమలు, రవాణా. కాకినాడ నుంచి చెన్నై వరకు బకింగ్‌హామ్ కెనాల్‌ను పునరుద్ధరించగలిగితే రవాణా ఖర్చులు తగ్గుతాయి. అందులో చెన్నై వరకు ప్యాసింజర్లను కూడా తీసుకువచ్చే అ వకాశాం ఉంది. నిధులు కాలసినన్ని ఉన్నాయని అంటున్నారు కాబట్టి దాన్ని పునరుద్ధరించే ఆలోచన ప్రభుత్వానికేమైనా ఉందా? వాతావరణ పరిరక్షణ క్రింద ఆ కెనాల్‌ను పూర్తి చేయగలిగితే బాగుంటుంది. ఇదే విషయాన్ని బిఏసిలో కూడా ప్రస్తావించాం.

మిస్టర్ ఛైర్మన్ : మీరు అడుగుతున్న ప్రశ్న ప్రస్తుత ప్రశ్నకు సంబంధించినదా?

శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి : సదరు ప్రశ్న ఈ ప్రశ్నకు సంబంధం లేకపోయినా సమాధానం చెపుతాను. రాష్ట్ర ప్రభుత్వానికి దాన్ని పునరుద్ధరించాలనే ఆలోచన ఉంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో దాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నం చేస్తున్నాం. దాన్ని అనుబంధ ప్రశ్నగా తీసుకోకుండా తప్పకుండా పరిగణనలోకి తీసుకొని చర్యలు చేపడతాం.

శ్రీ గాదె శ్రీనివాసులునాయుడు : అధ్యక్షా, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన శాఖకు సంబంంధించి కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలోని మ్యాచింగ్ రేట్స్‌తో, విద్యార్థులతో అన్ని జిల్లాలో ఇన్‌స్పైర్ కార్యక్రమాన్ని విద్యాశాఖ నిర్వహిస్తున్నది. అందులో విద్యార్థులు శాస్త్రవేత్తలుగా అభివృద్ధి చెందడానికి ఎన్నో ఆలోచనలను అక్కడ ప్రజెంట్ చేస్తున్నారు. మనం కూడా విద్యా శాఖతో అనుసంధానమైన మంచి ఆర్బిట్‌ను మనం తెచ్చుకొని మనం ప్రోత్సహించినట్లయితే, అ చిన్న పిల్లల్ని శాస్త్రవేత్తలుగా ప్రోత్సహించడంతోపాటు మనం అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. కాబట్జి ఆ విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రిగారిని ఈ సభాముఖంగా కోరుతున్నాను. రెండవదిగా ఎర్ర చందనానికి సంబంధించి అరెస్టులు జరుగుతున్నాయి, దాన్ని నిరోధిస్తున్నామని చెపుతున్నారు, కానీ పనిలేక కూలీలవుతున్న వారు అరెస్టు అవుతున్నారు తప్ప దాని వెనుక ఉండి నడిపించే

వ్యక్తులు అలాగే ఉంటున్నారు, వారు మళ్లీ వేరే కూలీలను పెట్టి పని చేయించుకుంటున్నారు. విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నాను.

ఉ.10.50

శ్రీ బి.గోపాలకృష్ణారెడ్డి : విద్యాశాఖతో మేము కూడా అనుసంధానమై కార్యాచరణ ప్రణాళిక చేస్తే బాగుంటుందని మీరు చెప్పారు. గతంలో శ్రీకాళహస్తిలోని హైస్కూలులో సైన్స్ అండ్ టెక్నాలజీ ఎగ్జిబిషన్ నిర్వహించారు. అందులో ఇన్నోవేటివ్‌గా చేశారు. కరెంటుకు సంబంధించి తడి తగిలితేనే మోటార్ ఆఫ్ అయిపోయేటట్లుగా కొత్త కొత్త టెక్నాలజీతో, విద్యార్థులలో ఒక ఆలోచన రేకెత్తింపచేసే విధంగా ఆ కార్యక్రమం ఉంది. ప్రభుత్వం తరఫునుండి ఇటువంటి కార్యక్రమాలకు ప్రతి విద్యార్థికి ఒక రు.5000 ఇస్తారు. అది నిజంగా చాలా మంచి కార్యక్రమం. తప్పకుండా దానిని పరిగణనలోకి తీసుకుంటాము.

అదేవిధంగా ఎర్రచందనం విషయంలో అమాయకులను అరెస్టు చేస్తున్నట్లు, పెద్ద పెద్ద స్మగ్లర్లు బయట ఉన్నట్లు చెప్పారు. అది వాస్తవమే. ఇటీవల రేణిగుంటలో 300 మంది కూలి వాళ్ళను అరెస్టు చేయడం జరిగింది. నిజంగా మనం చేయాల్సింది అది కాదు. పెద్ద పెద్ద బడా స్మగ్లర్లు రావడమే ఇతర దేశాలకు వెళ్ళిపోయారు. వాళ్ళని పట్టుకోవాలి. వాళ్ళు ఒక్కొక్క దేశంలో ఒక్కొక్కరోజు ఉంటున్నారట. ఏది ఏమైనాసరే వాళ్ళని ఛేజ్‌చేసి పట్టుకుని కచ్చితంగా శిక్షిస్తామని మీకు తెలియజేస్తున్నాను. అదే విధంగా కొంతమంది రాజమండ్రి జైలులో ఉన్నారు. వాళ్ళమీద పి.డి యాక్టు కూడ పెట్టడం జరిగింది. ఇంకా ఎవరైతే ఉన్నారో వాళ్ళందరి మీదా చట్టరీత్యా చర్యలు తీసుకుంటాము.

MR. CHAIRMAN: Question No.60 (7516) postponed at the request of the Member. Now, the House is adjourned for 15 minutes Tea Break.

(Then, the House adjourned for Tea Break at 10-53 a.m.)

***

**(AFTER TEA BREAK, THE HOUSE RE-ASSEMBLED AT 11-18 A.M.)**
**(HON'BLE CHAIRMAN IN THE CHAIR)**

* * *

## 2014-15 బడ్జెట్‌పై మూడవ రోజు సాధారణ చర్చ

MR. CHAIRMAN: Now, General Discussion on Annual Financial Statement (Budget) for 2014-2015.

శ్రీ ఆదిరెడ్డి అప్పారావు (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, 1-10-1953లో శ్రీ పొట్టి శ్రీరాములు గారి ప్రాణ త్యాగం ఫలితంగా కర్నూలు రాజధానిగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రానికి మొదటి బడ్జెట్ 1954-55లో, అలాగే 1-11-1956లో హైదరాబాదు రాజధానిగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు మొదటి బడ్జెట్ 1957-58లో ప్రవేశ పెట్టే అవకాశం ఆ రోజున శ్రీ బెజవాడ గోపాల రెడ్డి గారికి కలగడం చాలా అదృష్టం. అది చరిత్రలో నిలిచిపోతుంది. అలాగే ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంగా వున్నప్పుడు 1999-2004 కాలంలో శ్రీ యనమల రామకృష్ణుడు గారు 5 పర్యాయాలు బడ్జెట్‌ని ప్రవేశపెట్టారు. అయితే రాష్ట్రం విడిపోయిన తరువాత మొదటి బడ్జెట్ ని ప్రవేశపెట్టే అవకాశం శ్రీ యనమల రామకృష్ణుడు గారికి వచ్చింది. అందుకు వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. అలాగే మరో విషయం ఏమిటంటే మొదటి బడ్జెట్‌లో 23.71 కోట్ల రాబడి అయితే ఈ రోజు 2014-15 బడ్జెట్ లో రెవెన్యూ రాబడి 92 వేల కోట్లు, అలాగే వ్యయం 98 వేల కోట్లు చూపించడం జరిగింది. బడ్జెట్ డాక్యుమెంటులో రెవెన్యూ లోటు 6 వేల 64 కోట్లు కాగా, ద్రవ్య లోటు 12 వేల 24 కోట్లు వుంటుందని చూపించడం జరిగింది.

ఉ.11.20

అధ్యక్షా, అలాగే ఇంకో విషయమేమంటే, బడ్జెట్‌లో రెవిన్యూ రాబడిలోని రూ.92,000 కోట్లలో రూ.28,830 కోట్లు సెంట్రల్ గ్రాంట్ క్రింద వస్తోందని చెప్పడం జరిగింది. ఇక్కడ మనం ఒక విషయాన్ని గ్రహించాలి. 2012-2013లో ఉమ్మడి రాష్ట్రం మొత్తానికే అంటే రాష్ట్రం విడిపోకముందు, సెంట్రల్ గవర్నమెంట్ ఇచ్చిన గ్రాంట్ రూ.7,683 కోట్లు అయితే, రాష్ట్రం విడిపోయాక కేంద్రం నుండి రూ.28,830 కోట్లు ఇస్తారని బడ్జెట్లో చూపించడమనేది చూస్తే, అప్పుడు 23 జిల్లాలుండేవి. ఇప్పుడు అవి 13 జిల్లాలే. మరి 13 జిల్లాలే ఉన్నప్పుడు కూడా పెద్ద అమౌంట్ వస్తుందని చెప్పడమనేది చూస్తే, దానికి బేస్ ఏమిటనేది తెలియజేయాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఎందుకంటే, హామీ ఏమన్నా ఉందా? విడిపోయిన తరువాత కూడా ఇంత పెద్ద అమౌంట్ సెంట్రల్ గవర్నమెంట్ నుండి గ్రాంట్-ఇన్-ఎయిడ్ రూపంలో వస్తుందని చెప్పడంలో ఏదైనా హామీ ఉంటే తెలియపరచాలి. దాన్ని ఎలా తీర్చుకుంటారనే ఆలోచన కూడా చేయాలని తమ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

అలాగే, సెంట్రల్ గవర్నమెంట్ నుండి గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా వస్తుందని చెబుతున్నటువంటి రూ.28,830 కోట్లు అక్కడ నుండి రావడం జరిగితే, దాని యొక్క ప్రభావం ప్లాన్ ఎక్స్‌పెండిచర్ మీద పడుతుంది. మనం బడ్జెట్లో ప్లాన్ ఎక్స్‌పెండిచర్‌లో రూ.26,672 కోట్లు చూపిస్తున్నాము. ఎందుకంటే, ఈ ప్లాన్ ఎక్స్‌పెండిచర్ గురించి కూడా Annual Plan 2014-2015 Sectorwise Outlays అని ఉంది. ఇందులో ఎకనామిక్ సర్వీసెస్, అగ్రికల్చర్ అండ్ ఎలైడ్ సర్వీసెస్ అని, రూరల్

డెవలప్‌మెంట్ అలా వేరు వేరు పద్దుల క్రింద మొత్తం ప్లాన్ ఎక్స్‌పెండిచర్ క్రింద రూ.26,672 కోట్లు మనం చూపించడం జరిగింది. అయితే, నేను తమ ద్వారా చెప్పేదేమంటే వీటిల్లోనే వెనుకబడిన తరగతుల సంక్షేమం, మైనారిటీ, స్త్రీ, శిశు సంక్షేమం, హౌసింగ్, పెన్షన్లు, ఆరోగ్యం, ఇరిగేషన్ అని ఎన్నో పద్దులున్నాయి. అన్నింటికీ కలిపి కూడా సెంట్రల్ గవర్నమెంట్ నుండి వస్తుందని ఆశిస్తున్నటువంటి రూ.28,832 కోట్ల ప్రభావం వీటి మీద ఎక్కువగా ఉంటుంది. సెంట్రల్ గవర్నమెంట్ ఈ అమౌంట్ విషయంలో ఏదైనా తగ్గించడం జరిగితే, ఇప్పటికే మనం వివిధ రకాల పద్దులకు అరకొర ఎలాట్‌మెంట్లు తప్ప మనం పూర్తిగా చేయలేకపోయాం. ఆ పరిస్థితుల్లో ఇప్పటికే ఎలాట్‌మెంట్లు ఇచ్చినప్పుడు, దీని ప్రభావం వల్ల ఇది తగ్గితే ఈ ప్లాన్ ఎక్స్‌పెండిచర్‌ని ఏ విధంగా మనం పూర్తి చేసుకోగలుగుతామన్న విషయం మీద కూడా ఒకసారి ఈ బడ్జెట్ రూపంగా కూడా ఆలోచించమని కోరుతున్నాను.

అలాగే, ఇటువంటి పరిస్థితుల్లో మనకు రెవిన్యూ లోటు ఉంది. ఆర్థికంగా ఇబ్బందులున్నాయని చెబుతున్నాను. ఇలాంటి పరిస్థితుల్లో కూడా మన క్యాపిటల్ విషయంలో ఏవిధంగా మనం ఉండాలి అనే విషయాన్ని కూడా తమ దృష్టికి తీసుకురావాలన్నది మా యొక్క చిన్న సూచన. ఈ పరిస్థితుల్లో ఆగస్టు, 15 న మన ప్రధాని గారు ఏమన్నారంటే – ప్రగల్భాలు మాని, వాస్తవాలు గ్రహించి, ఆ వాస్తవాలు గురించి ఆలోచించండి. 70 శాతం ప్రజలు టాయ్‌లెట్లు లేకుండా బ్రతుకుతున్నారు. వాటి గురించి ముందు ఆలోచించండని చెప్పారు. అందుచేత, ప్రజల జీవన విధానాలు దేశంలో ఏ విధంగా ఉన్నాయి అనే దాని గురించి పీఎం గారు చెప్పడం జరిగింది. అవన్నీ దృష్టిలో పెట్టుకుంటూ, మరొక విషయమేమంటే రెవిన్యూ డిఫిసిట్ ఒక సంవత్సరానికి రూ.25,000 కోట్లు ఉంటుందని మనం అంచనా వేస్తున్నాము. అందు గురించే మనం రాజధాని విషయంలో, తక్కువ ఎక్స్‌పెండిచర్‌తో రాజధాని నిర్మించుకోవడానికి, డబ్బును ఎక్కువగా డెవలప్‌మెంట్ కొరకు ఉపయోగించుకోవడానికి చేసే విధానంలో ప్రయాణం చేయాలని విన్నవించుకుంటున్నాను. ఎందుకంటే, సెంట్రల్ గవర్నమెంట్ ఈ విషయంలో చాలా ముందుచూపుతో చెప్పడం జరిగింది. ఏపీ రెగ్యులేషన్ యాక్టులో లక్ష ఎకరాల రిజర్వు ఫారెస్ట్‌ని క్యాపిటల్ కట్టుకోవడానికి డీ నోటిఫై చేసి ఇస్తామని, అలాగే, యాక్టులోని పార్ట్–X (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ స్పెషల్ ఎకనామిక్ మెషర్స్) సెక్షన్**–94 (3)** ప్రకారం ముఖ్యమైనటువంటి బిల్డింగులు కట్టుకోవడానికి డబ్బులిస్తామని సెంట్రల్ గవర్నమెంట్ హామీనిచ్చిన మాట అందరికీ తెలిసిన విషయమే. అటువంటి పరిస్థితుల్లో సెంట్రల్ గవర్నమెంట్ సూచనలు కూడా మనం కన్సిడర్ చేసుకుంటూ ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

ఇవాళ రాజధాని విషయంలో రకరకాల వదంతులు మనకు వినపడుతున్నాయి. అది ఖచ్చితంగా విజయవాడ–గుంటూరు మధ్యలోనే వస్తున్నదని అందరూ రూఢీగా మాట్లాడేటట్టుగా, ఆలోచించే విధంగా పేపర్లలో వార్తలు గానీ, ప్రభుత్వంలోని ప్రముఖ వ్యక్తుల నోట్లో నుండి వచ్చిన మాటల్ని చూస్తున్నాము. దీన్ని బట్టి రాజధాని ఖచ్చితంగా బెజవాడ, గుంటూరులోనే వస్తుందనే ఆలోచన అందరికీ అర్థమౌతోంది. ఈ విషయంలో మేం చెప్పేదేమంటే, ఇప్పుడున్న పరిస్థితుల్లో సెంట్రల్ గవర్నమెంట్ వారు ఎక్కడైతే ఫారెస్టు ల్యాండ్ ఉంటుందో, అక్కడ లక్ష ఎకరాలను డీ–నోటిఫై చేసి మీకిస్తామని చెప్పి సిద్ధంగా ఉన్నప్పుడు, రాష్ట్రాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని అన్నప్పుడు మనం ఎక్కడైతే ఫారెస్టు ల్యాండ్ ఎక్కువగా ఉందో దాన్ని ఐడెంటిఫై చేయాలి. ఇవాళ ఉన్న వాతావరణాన్ని బట్టి అది సెంట్రల్‌లో ఉండటం తప్పు కాదు. At the same time, ల్యాండ్

అక్విజిషన్‌కు ఎక్కువ డబ్బు ఖర్చుపెట్టకుండా, ఎక్కడైతే రిజర్వు ఫారెస్ట్ ఉందో, దాన్ని డీ-నోటిఫై చేయించుకుని ముందుకు వెళితే మంచిదనేది ఒక ఆలోచన.

అలాగే, కొన్ని విషయాల్ని పరిశీలిస్తే, ఎప్పుడైతే రాజధాని గుంటూరు-విజయవాడ మధ్యలో రావచ్చని చెబుతున్నారో అక్కడ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. అక్కడున్నవి మంచి భూములు. వ్యవసాయంకు అనుకూలంగా ఉన్న భూములు. అలాంటివి పాడు చేసి, ఎక్కువ రేటున్న భూముల్ని మీరు ఎక్వైర్ చేయడానికి ప్రయత్నం చేసి, అవి డెవలప్ చేయడానికి కొంత ఇబ్బంది కలిగే పరిస్థితి ఉన్నప్పుడు దాని జోలికి వెళ్లకూడదు. ఈ క్యాపిటల్ విషయంలో అందరి ఆలోచనలూ తీసుకోవాలి. శివరామకృష్ణన్ కమిటీ ఉంది. అలాగే, పెద్దలు నారాయణ గారు ఇక్కడే ఉన్నారు. వారితో ఒక కమిటీ ఉంది. వారి యొక్క ఆలోచనలు ఇంకా బయటకు రాలేదు. నేను అనేదేమంటే – ఉభయ సభల్లో అన్ని పార్టీలకు సంబంధించిన పెద్దలున్నారు. రాజధాని అంశాన్ని కూడా ఇక్కడ డిస్కషన్‌కు పెట్టండి. ఆ విధంగా పెట్టి క్యాపిటల్ విషయంలో ఏం చేద్దాం? ఎలా మనం ముందుకు వెళదాం? ఖర్చు తగ్గించుకుందాం అనే విషయాలను మనం డిస్కషన్‌కు పెడితే, ప్రాంతీయ విభేదాలు లేనట్టి పరిస్థితి వస్తుంది. అలాగే, ఎవరి ఆలోచనలు వాళ్లు చెబుతారు. పరిస్థితులను బట్టి, కమిటీ రిపోర్టులను బట్టి ముందుకు వెళ్లే పరిస్థితి ఉంటుంది. కాబట్టి, ఈ విషయాలన్నీ కూడా దృష్టిలో పెట్టుకుని ముందుకు వెళ్లాలని కోరుతున్నాను.

ఇవాళ సెంట్రల్ గవర్నమెంట్ చట్టపరంగా కొన్ని హామీలిస్తుంది. ఆ విధంగా హామీలిచ్చినా కూడా మీరు ఒక విషయం గ్రహించాలి. ఈ రోజున తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో బిజెపి వారున్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో తెలుగుదేశం వారున్నారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు గారు మన రాష్ట్రానికి వస్తూపోతున్నారు. ఆయన ఖచ్చితంగా డెవలప్ చేద్దామని వాగ్దానాలు కూడా చేయడం జరుగుతోంది కాబట్టి, మీ పలుకుబడిని ఉపయోగించుకుని ఏదైతే సెంట్రల్ గవర్నమెంట్ వాగ్దానాలు చేసిందో, ఆ వాగ్దానాలన్నింటినీ అమలుచేసే దిశగా ముందుకు వెళ్లాలని కోరుతున్నాను. రాజ్యసభలో గతంలో రాష్ట్రం విడిపోకముందు ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గారు మూడు హామీలివ్వడం జరిగింది. వాటన్నింటికీ కట్టుబడి ఉన్నాము, ఇంకా మెరుగైనటువంటి పద్ధతుల్లో వాటిని అమలుచేస్తామని ఆ రోజున వెంకయ్యనాయుడు గారు, జైట్లీ గారు చెప్పిన విషయాలను కూడా మనం మర్చిపోకూడదు.

ఉ.11.30

అప్పుడు వారు 3 హామీలు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని పదేళ్ల వరకూ ఇస్తామని బిజెపి వారు చెప్పడం జరిగింది. ప్రత్యేకప్రతిపత్తి ఇస్తే ఖచ్చితంగా గ్రాంట్ ఇన్ ఎయిడ్ తీసుకోవచ్చు. తద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధిచేసుకునే అవకాశం ఉంటుంది. బిజెపితో స్నేహపూర్వకమైన వాతావరణం ఉన్నది కాబట్టి తప్పనిసరిగా దానిని ఉపయోగించుకోవాలని కోరుతున్నాను. అలాగే, రాయలసీమ 4 జిల్లాలకు, ఉత్తర కోస్తాలోని 3 జిల్లాలలకు బుందేల్‌ఖండ్ తరహాలో ప్యాకేజీ ఇస్తామని అన్నారు గానీ, కేంద్రప్రభుత్వ బడ్జెట్‌లో గానీ, రాష్ట్ర బడ్జెట్‌లోగానీ ఎక్కడా ఆ ప్రస్తావన లేకపోవడం దురదృష్టకరం. అనాడు మాట ఇచ్చినప్పటికీ ఈనాడు అమలు చేయడానికి ఎందుకు ముందుకు రాలేకపోతున్నారో ప్రశ్నించవలసిన బాధ్యత ఈ ప్రభుత్వంపైన ఉన్నదని తెలియచేస్తున్నాను. రాష్ట్రం విడిపోతే – మొదటిసంవత్సరం ఆర్థికవనరుల లోటు ఎంత ఉంటే అంత

యూనియన్ బడ్జెట్‌లో పెట్టి సహకరిస్తామన్నారు. కానీ, అది బడ్జెట్‌లో పెట్టిన దాఖలాలు కనబడడం లేదు. దానిపై కేంద్రప్రభుత్వాన్ని ఏ విధంగా రిక్వెస్ట్ చేసి తీసుకురాదల్చుకున్నారనే విషయాన్ని కూడా ఆలోచించాలి. రెండవ సంవత్సరం వచ్చేసరికి రిసోర్సెస్ గ్యాప్‌కు సంబంధించి 14వ ఆర్థిక సంఘానికి రికమెండ్ చేస్తామని చెప్పడం జరిగింది. ప్రధానమంత్రిగారు హామీ ఇచ్చినప్పుడు, వెంకయ్యనాయుడు గారు, అరుణ్‌జైట్లీ గారు చేస్తామని చెప్పినప్పుడు త్వరగా చేయించుకోకపోతే అభివృద్ధి కుంటుపడుతుంది. అలాగే శ్రీ యనమల రామకృష్ణుడు గారు దక్కన్ క్రానికల్‌లో ఒక స్టేట్‌మెంట్ ఇచ్చారు. కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ చేయగలిగితే ఒక సంవత్సరం లోపల మన రాష్ట్రాన్ని మంచి పురోగతిలోకి తీసుకువెళ్లవచ్చు అని ఆ స్టేట్‌మెంట్‌లో చెప్పారు. మరి ఈ ప్రభుత్వానికి బి.జె.పి.తో ఉన్న పరిచయాన్ని బట్టి కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేకపోతున్నారు?

ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలకు ఈ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉన్నదని చెబుతున్నారు. రైతులకు, మహిళలకు రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చారు. ఎన్నికల సమయంలో రైతులకు, మహిళలకు రుణమాఫీ చేసి డాక్యుమెంట్లు ఇంటికి పట్టుకువచ్చి ఇస్తామన్నట్లుగా మాట్లాడారు. అధ్యక్షా, కావాలంటే ఎన్నికల మ్యానిఫెస్టోలో చూడండి, ఆ సమయంలో పాంప్లెట్స్ కూడా వేశారు. కానీ, నేడు రైతు రుణమాఫీ అంటే లక్షన్నర రూపాయల ఇన్సూరెన్స్‌ని కూడా కవర్ చేసుకుని కుటుంబంలో ఒకరికి ఇస్తామంటున్నారు. ఒక కుటుంబం అంటే కనీసం ఇద్దరన్నదమ్ములు ఉంటారు. ఒక అగ్రికల్చరల్ యూనిట్ అంటే భార్యా, భర్త, పిల్లలు, మరియు మేజర్ అయిన పెళ్లికాని ఆడపిల్ల కూడా ఆ పరిధిలోకి వస్తారు. మరి కుటుంబంలో ఒక్కరికే లోను మాఫీ చేస్తే మిగిలిన అన్న గానీ, తమ్ముడు గానీ ఏ విధంగా బాధపడతారనే విషయాన్ని గమనించవలసిందిగా కోరుతున్నాను. మహిళారుణాల విషయానికి వస్తే – లక్ష లోపు అయితే మాఫీ చేస్తాం, లక్షకంటే ఎక్కువైతే పెట్టుబడి పెట్టిస్తామనడం కూడ దురదృష్టకరం. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటలకు కట్టుబడి ఈ ప్రభుత్వం ఉంటుందనే మేము ఆశించాము. అదే విధంగా, రైతులు, మహిళలు, ప్రజలు కూడా ఆశించారు. కానీ, ఇవాళ పరిస్థితి చూస్తుంటే అంతా నిరాశపడుతున్నారు. ఏ విధంగా వీటన్నింటిని దాటుకుని ముందుకు వెడతారనే ఆందోళన అందరిలోనూ ప్రారంభమయింది. అలాగే, పెన్షన్ విషయానికి వస్తే వికలాంగులకు రూ.1500లు ఇస్తామన్నారు. 40 నుండి 79 శాతం డిజేబులిటీ ఉంటే రూ.1000లు 80 శాతం దాటితే రూ.1500లు ఇస్తామని ఇప్పుడంటున్నారు. ఈ విధంగా చేయడం ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడమా అని నేను ప్రశ్నిస్తున్నాను. వాగ్దానాలను నమ్మి ప్రజలు ఓట్లు వేసి గెలిపించి అధికారాన్ని కట్టబెట్టారు. అటువంటప్పుడు ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా అమలు చేయడానికి కట్టుబడి ఉండాలని కోరుతున్నాను. నిరుద్యోగ భృతి రూ.1000నుండి రూ.2000లు వరకూ ఇస్తామన్నారు. కానీ, వాటిగురించి బడ్జెట్‌లో ప్రస్తావించిన దాఖలాలు లేవు.

ఫీజు రీయంబర్సుమెంట్ విషయానికి వస్తే 2014–15 విద్యా సంవత్సరానికి స్థానికతను దృష్టిలో పెట్టుకుని 58:42 నిష్పత్తిలో భరించవలసి ఉంటుంది. ఈ విధంగా రకరకాల ఆలోచనలతో రాబోయే విద్యాసంవత్సరానికి ఆలోచిస్తున్నారు తప్ప ఇప్పటికే ఇంజనీరింగ్, మెడిసిన్,ఆర్కిటెక్చర్ వంటి కోర్సులు చదువుతున్న రెండు, మూడు, నాలుగవ సంవత్సరం విద్యార్థుల పరిస్థితి ఏమిటి? ఇవాళ పేపర్లో ఒక వార్త చదివాను. ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్ ప్రకారం స్థానికతను ఆధారంగా తీసుకుని విద్యార్థులు తెలంగాణాలో చదివినా, ఆంధ్రాలో చదివినా వాళ్ల ఫీజులు భరిస్తామని అన్నారు. చాలా

సంతోషం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కాకుండా, రెండవ సంవత్సరం, మూడవ సంవత్సరం, ఆఖరు సంవత్సరం చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు గురించి కూడా ఆలోచించాలి. చాలా కాలేజీలలో వందల, వేల కోట్ల రూపాయలు పెండింగ్‌లో పడిపోయి ఫైనలియర్ విద్యార్థుల దగ్గరకు వచ్చేసరికి ఫీజు కడతారా లేదా, లేకపోతే డాక్యుమెంట్లు ఇవ్వము అనే పరిస్థితికి వచ్చేశాయి. వాళ్ల బాధ వాళ్లది. అటువంటి పరిస్థితి రానివ్వకుండా ఆయా కాలేజీలు నాణ్యత గల విద్యను అందించేవిధంగా ఫీజు రీయంబర్సుమెంటు విషయంలో శ్రద్ధ తీసుకోవాలని, ఈ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని మీ ద్వారా కోరుతున్నాను అధ్యక్షా. మన రాష్ట్రం విడిపోకముందు రూ.580కోట్లు ఉమ్మడి రాష్ట్రంలో రిలీజ్ చేశారు. ఆ సొమ్ము ట్రెజరీలో పడే రెండు మూడు రోజులముందు ఈ రాష్ట్రం విడిపోయింది. ఇప్పుడు ఆ సొమ్ము ఏ ఖాతాలోకి వెళ్లాయి? దానిని ఫీజు రీయంబర్సుమెంటుకు వినియోగించారా లేదా అనే విషయంలో క్లారిటీ లేదు. ఈ విషయాన్ని స్పష్టంగా తెలియచేసి విద్యార్థులలో ఉన్న బాధను తొలగించాలని కోరుతున్నాను.

వైద్య, అరోగ్యం కోసం బడ్జెట్‌లో రూ.4300కోట్లు కేటాయించడం జరిగింది. అయితే, ఆరోగ్యం విషయానికి వస్తే – ఆసుపత్రులలో కనీస మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, సరైన పనివాళ్లు, పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన డాక్టర్లు లేకుండా ఆసుపత్రులు పనిచేస్తున్నాయి. ఉదాహరణకు రాజమండ్రిలో ఏపి వైద్యవిధాన పరిషత్తు చాలా ముఖ్యమైన ఆసుపత్రి. దాని చుట్టుపక్కల నాలుగైదు నియోజకవర్గాలనుండి ప్రజలు వచ్చి వైద్యం చేయించుకుంటారు. ఈవేళ ఆసుపత్రులలో గైనకాలజీ విభాగానికి నలుగురు డాక్టర్లు ఉండాలంటే ఇద్దరే ఉన్నారు. ఇప్పుడు కాదు గత రెండేళ్లుగా అదే పరిస్థితి. ఈ విషయమై ఎన్నిసార్లు చెప్పినా అది అరణ్యరోదన అవుతోంది తప్ప ఎవరూ పట్టించుకోవడం లేదు. గైనకాలజీ విభాగంలో మగవాళ్లు ఉంటున్నారు. ఇంతకన్నా ఏం చెప్పగలము? ఆ విషయంలో కూడా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆర్థోపెడిక్ విభాగానికి వచ్చేసరికి సర్జెన్ లేరు. నియోనాటల్ కేర్ విభాగానికి సంబంధించి అప్పుడే పుట్టిన పిల్లలకోసం ఇంక్యుబేటర్స్ పెడుతున్నాము, వసతులు కల్పించాము అని చెబుతున్నారు తప్ప ఎన్ని వసతులు కల్పించినా వాటిని ఆపరేట్ చేసే డాక్టర్లు ఒక్కళ్లు కూడా లేరు. ఆ స్పెషలిస్ట్‌ల బదులు నలుగురు ఎమ్‌బిబిఎస్‌లను వేశారు. ఎమ్‌బిబిఎస్‌లకు నియోనాటలజీలో ఎంత అనుభవం ఉంటుందో భగవంతునికే తెలియాలి. చనిపోతే పేదవానిపిల్లలే కదా అనే భావనలో ఉన్నారు తప్ప ఈ పేదపిల్లలకు మనం ఏం చెయ్యాలి అని జాగ్రత్త చూపిన దాఖలాలు కనబడడం లేదు. ఇటువంటి పరిస్థితులను చక్కబెట్టడానికి శ్రద్ధ చూపించడం లేదు, ముందుకు రావడం లేదు. ఎందుకంటే రాజమండ్రి ఆసుపత్రికి వచ్చేసరికి మెడికో లీగల్ వర్క్ ఎక్కువగా ఉంటుంది. యాక్సిడెంట్స్‌లో చనిపోయేవారికి పోస్టుమార్టమ్ చేసేవారు గానీ, పోలీసు గొడవలు ఎక్కువగా ఉంటే సరైన పద్ధతులు లేకపోవడం వల్ల మెడికో లీగల్ వర్క్ చేయడం మంచిది కాదని పి.జి. చదివిన డాక్టరు ఎవరూ అక్కడ ఉండడానికి అంగీకరించడం లేదు. ఈ పరిస్థితులలో కొంత వర్క్ షేర్ చేసుకోవడానికి ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ నుండి నిపుణులను అపాయింట్ చేస్తే, పి.జి. డాక్టర్లు వాళ్ల పని చేసుకోవడానికి అవకాశం ఉంటుందని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఈ రోజువరకూ శ్రద్ధ చూపిన దాఖలాలు లేవు.

11.40 – 12.00

కాబట్టి, పేదవారికోసం ఉన్న ఈ ప్రభుత్వ ఆసుపత్రుల విషయంలో మౌలిక సదుపాయాలు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన డాక్టర్లను నియమించే విషయంలో శ్రద్ధ తీసుకోవాలని నేను తమరిద్వారా కోరుతున్నాను.

వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సమయంలో రాష్ట్రమంత్రివర్యులు ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రిగారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాననే విషయం చెప్పడం జరిగింది. అయితే, అదే సందర్భంలో ఆయన ఒక మాటను చెప్పడం జరిగింది. "Everything else can wait, agriculture can't" అని చెప్పింది, అగ్రికల్చర్ సైంటిస్టు "నార్మన్ బోర్లాగ్" అని చెప్పారు. కానీ, ఆ మాటలను 1951వ సంవత్సరంలో మొదటి పంచవర్ష ప్రణాళికను దేశానికి అంకితం చేస్తూ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూగారు చేసినటువంటి వ్యాఖ్యలు తప్ప అగ్రికల్చర్ సైంటిస్టు చేసిన వ్యాఖ్యలు కావనేది నా అభిప్రాయం. నేను చెప్పింది కరెక్టు అయితే దానిని సవరించడానికి ప్రయత్నం చేయండి సర్, తప్పయితే ఆ మాటను నేను ఉపసంహరించుకుంటాను.

బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 17 శాతం ఉందని ఒక స్టేట్‌మెంట్ ఇవ్వడం జరిగింది. అదే విధంగా వ్యవసాయ బడ్జెట్‌లో 2003-2004వ సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 54.33 శాతం నుండి 2012-2013 సంవత్సరం నాటికి అది 49.28కి తగ్గిందని ఒక స్టేట్‌మెంట్ ఉంటుంది. అలాగే, సోషియో ఎకనామిక్ సర్వేద్వారా మన బడ్జెట్‌లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి 23.33 ఉందని ఇవ్వడం జరుగుతోంది. మన వద్ద ఉన్న వివరాల ప్రకారం, industry-wise contribution of gross State domestic product of Andhra Pradesh in constant prices దాంట్లో స్థూల ఉత్పత్తి 23.33 అని ఉంది. అంటే, ఒకచోట 17 శాతం, మరొక చోట 49.28 శాతానికి తగ్గిపోయిందని, ఇంకొకచోట 23.33 అని చెబుతున్నారు. ఈ మూడు సంఖ్యలు అధికారికంగా వారు ఇచ్చినవే. వీటిలో ఒకదానికొకటి పొంతన లేదు. దేనిని మనం కన్సిడర్ చేయాలనే విషయంలో స్పష్టతనివ్వాలని తమరిద్వారా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మరొక విషయం, ప్రత్యేకంగా వ్యవసాయ బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టడం జరిగింది. ఇంతకుముందు ఎప్పుడైనా ఆంధ్రప్రదేశ్‌లో ఒక బడ్జెట్ తర్వాత మరొక ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సాంప్రదాయం ఉన్నదా? నాకు ఆ విషయం తెలియదు. అటువంటి సాంప్రదాయం ఉంటే సంతోషమే. లేనట్లయితే ఆ సాంప్రదాయాన్ని ఎక్కడనుండి తీసుకువచ్చారు? For this, the procedure in Financial matters, the Annual Financial Statement or the statement of the essential receipts and the expenditure of the State in respect of every financial year herein referred to the Budget shall be presented to the Assembly, on such day as the Governor may appoint దీనికోసం గవర్నర్‌గారి అనుమతిని కూడా తీసుకోవాలి. అలాగే, ఈ బడ్జెట్‌లో వసూళ్లు మరియు చెల్లింపులు కూడా ఉండాలి. వ్యవసాయ బడ్జెట్‌లో వసూళ్లు ఏమైనా ఉన్నాయా? వ్యవసాయ రంగంలో చెల్లింపులుంటాయి. కానీ, వసూళ్లు లేవు. బడ్జెట్‌కు అర్థం, వసూళ్లు మరియు చెల్లింపులు. ఈ రెండూ ఉన్నప్పుడే అది బడ్జెట్ అవుతుంది. ఈ రెండూ లేనప్పుడు అది బడ్జెట్‌గా ప్రవేశపెట్టవచ్చా? కానీ,బడ్జెట్‌ను వివిధ భాగాలుగా ప్రవేశపెట్టే సాంప్రదాయం మాత్రం లోక్‌సభలో ఉంది. లోక్‌సభ బిజినెస్ రూల్స్‌లో it was mentioned in the Presentation of Budget in parts that "Nothing hereinbefore contained shall be deemed to prevent the presentation of the Budget to the House in two or more parts and when such presentation takes place, each part shall be dealt with in accordance with these rules as if it were the Budget." ఒక్క పార్లమెంట్‌లోనే రైల్వే బడ్జెట్, సాధారణ బడ్జెట్ మాదిరిగా మూడు, నాలుగు సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టవచ్చు కానీ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సాంప్రదాయం ఉన్నదా? ఈ మధ్యనే సభలో ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్‌కు గవర్నర్‌గారి అనుమతిని తీసుకున్నారా అనే విషయాల గురించి తెలియజేయవలసిందిగా తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఏది ఏమైనా, బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉన్నాయి. ఆనాడు ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోకు, నేడు వారు చేస్తున్న విధానానికి ఎక్కడా పొంతనలేదు. రూ. 1 లక్ష కోట్లకు పైగా రుణమాఫీ చేస్తామని చెప్పిన వారు నేడు ఎంత మొత్తానికి రుణమాఫీని చేస్తున్నారు? అది నెగ్లిజబుల్ ఫిగర్. ఇచ్చిన మాటకు మేము కట్టుబడి ఉన్నామని ఏదైతే మీరు బడ్జెట్‌లో చెబుతున్నారో, ప్రజలయొక్క నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముందుకు వెళ్లవలసిన బాధ్యత ఉందని తమరిద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం: అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌పై మాట్లాడేందుకు అవకాశం ఇచ్చిన తమరికి ముందుగా నా కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను. బడ్జెట్‌కు ముందు మహాత్మా గాంధీజీ కథనాన్ని, చివర మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్‌గారి కథనాన్ని చెబుతూ, రెండు చోట్లా పైన అయితే సమాంతర విభేదాలే తప్ప మరొక రకమైన విభేదాలు ఉండని సమాజం మా లక్ష్యమని చెప్పడం జరిగింది. అలాగే, మార్టిన్ లూథర్ కింగ్ చాలా గట్టిగా చెప్పిన విషయం, “మహాపర్వతాలు ఏదో ఒకరోజు క్రిందకి దిగుతాయి, మహా లోయలు ఏదో ఒకరోజుకి పైకి వస్తాయి, సమతలమైన భూతలం అనేది ఆవిష్కరింపబడే రోజు వస్తుందని” ఆయన చెప్పారు. ఈ రెండు కథనాలూ చాలా గొప్ప కథనాలు. అయితే, వీరిద్దరూ బలిదానాలు చేసిన వారు, క్రూరంగా హత్యకు గురైనటువంటివారు. ఆదర్శాలకోసం, ఉటంకింపుల కోసం, ఉద్ఘాటనల కోసం ఈ మహానుభావులను వాడుకోవడమే తప్ప, ఆచరణకు, అనుసరణకి, చరిత్ర వారిని ఎంతవరకూ వాడుకుందనేది అనుమానాస్పదమైన విషయం. ఏదిఏమైనా దానికి నేను వారిని అభినందిస్తున్నాను.

ఈ బడ్జెట్‌లో కొంత స్వాప్నికత ఉంది, కొంత వాస్తవికత ఉంది, కొంత అపాలజిస్టిక్‌గా కూడా ఉందని నా అభిప్రాయం. సుమారు రూ. 1.12 లక్షల కోట్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఏప్రిల్, మే నెల రెండు నెలలనూ తీసివేస్తే, రూ. 81,823 కోట్లు మాత్రమే ఈ 10 నెలలకుగాను నికర బడ్జెట్ ఇది. కేంద్ర ప్రాయోజితాలు, రూ. 10,313 కోట్లు కూడా ప్లాన్ బడ్జెట్‌నుండి తీసివేస్తే, ప్లాన్ బడ్జెట్ కేవలం రూ. 16,359 కోట్లు మాత్రమే కేటాయించారు. గత పది సంవత్సరాల బడ్జెట్‌ను మనం పరిశీలిస్తే, కనీసం 15 శాతం వార్షిక ప్రణాళిక తగ్గుతూ ఉండడం మనం గమనిస్తున్నాము. చెప్పినదానికి, వనరుల లభ్యతకు, వినియోగానికి మధ్య తేడా కనిపిస్తూ ఉంది. కేంద్రం నుంచి రూ. 14,500 కోట్లు రావాలని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో ఆ ప్రస్తావన ఏమీలేదు. అన్నింటికంటే బాధాకరం, ఆదాయం 47 శాతాన్ని మనం పొందాలి, ఖర్చు 52 శాతం మనం పెట్టాలి. ఇది చాలా భారమైన విషయం. అలాగే, ఎఫ్.ఆర్.బి.ఎం. పరిధిని కూడా మొట్టమొదటిసారి రాష్ట్రం దాటిపోయేటటువంటి విధంగా కనిపిస్తూ ఉంది. మొత్తం మీద చూసినట్లయితే ఇది ఓట్ ఆన్ అక్కౌంట్ బడ్జెట్‌కోసం తయారుచేసినదే తప్ప సమగ్రమైనది కాదనే అభిప్రాయాన్ని ప్రభుత్వమే వ్యక్తం చేసి వచ్చేసారికి జీరో నుంచి ప్రతి రూపాయిని సమర్థించుకునేటటువంటి విధంగా ఒక comprehensive financial management పద్ధతి ద్వారా సత్యమంతా ఒక్కచోటే అనేటటువంటి పద్ధతిలో మేము బడ్జెట్‌ను రూపొందిస్తామని చెప్పారు. కాబట్టి ప్రభుత్వమే ఈ బడ్జెట్ విషయంలో కొంచెం అపాలజిస్టిక్‌గా ఉన్నప్పుడు, దానిని ఇంకా లోతుల్లోకి పోయి తరచిచూడవలసిన అవసరం లేదు. దానికి అనుగుణంగానే కేటాయింపులు చాలా లోతుగా ఉన్నాయి.

ఈ బడ్జెట్ మొత్తాన్ని చదివితే, కాంగ్రెస్ బడ్జెట్, తెలుగుదేశం బడ్జెట్  ఈ రెండు బడ్జెట్‌లూ చదివేటపుడు పదజాలంలోనే చాలా తేడా ఉంది.  చాలా పెద్ద పదాలు, optic fiber network, tourism circuit,  smart cities, logistic hubs, silicon corridor, digital literacy, mega IT hub, comprehensive financial management లాంటి పదాలను విన్నప్పుడు నాకు 'కన్యాశుల్కం' నాటకం గుర్తుకు వస్తోంది.  ఆ నాటకంలోని  గిరీశం గ్రామంలోకి తన శిష్యుడును తీసుకువెళ్తాడు. ఆయన ప్రతిభను ప్రదర్శింపజేయాలనేది ఆయన ఉద్దేశ్యం. గిరీశం వెంకటేశం తల్లి "నాయనా, మీరిద్దరూ ఆంగ్లంలో మాట్లాడుకుంటే, విని ముచ్చటపడాలని ఉందని" వారితో చెబుతుంది.  అప్పుడు వెంకటేశం,  "twinkle, twinkle, little star" అని అంటాడు.  రెండవ వ్యక్తి దానికి జవాబుగా,   "there is a white man on the tent" అని సమాధామిస్తాడు.  మళ్లీ దానికి జవాబుగా వెంకటేశం   "a boy stood on the burning deck" అని చెబితే, ఓహో ఏమి మాట్లాడుకుంటున్నారని  ఆమె వెలవెలబోతుంది.  మీ పదజాలం ఆ విధంగా అనిపిస్తుందేమోనని నాకు కొంచెం అనుమానంగా ఉంది.  బడ్జెట్‌ను చదివితే నాకు ఎందుకో అది గుర్తుకు వచ్చింది.

నేడు భారతదేశానికి సంబంధించి లేదా మన రాష్ట్రానికి సంబంధించి అభివృద్ధి విషయంలో చాలా చర్చ జరుగుతోంది. "An uncertain glory" అనే పుస్తకాన్ని శ్రీ అమర్త్యసేన్ మరియు డ్రీజ్ అనే వారు ఈ మధ్యనే తీసుకువచ్చారు.  తెలుగుదేశం ప్రభుత్వమూ,  ఈ విజన్లను తయారుచేసేవారు  ఈ పుస్తకాన్ని  చదివారో లేదో గానీ నాకు వారు చదివినట్లుగా అనిపిస్తోంది.  ఆ పుస్తకంలో, "భారతదేశం చాలా పెద్ద ఎత్తున అభివృద్ధి చెందినట్లు కనిపిస్తోంది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందే మొదటి రెండు  దేశాల్లో భారతదేశం ఒకటి.  Economic growth ఎక్కువగా కనిపిస్తూ ఉంది. కానీ అనుకున్నట్లుగా ఫలితాలు లేవు.  ఇది ఒక అనిశ్చితమైన కీర్తి మాత్రమే అన్నట్లుగా అనిపిస్తోందని" చెబుతూ,  ఒక మాట చెప్పారు. "In the long run, even the feasibility of high economic growth is threatened by the under development of social and physical infrastructure and the neglect of human capabilities.  It is in contrast with the Asian approach of simultaneous pursuit of economic growth and human development as pioneered by Japan, South Korea and China." "ప్రపంచంలో మిగలిన సంగతులు అలాగే పెట్టండి.  చాలా వేగంగా అభివృద్ధి చెందుతోన్న asian giantsతో పోల్చుకున్నా కూడా భారతదేశ అభివృద్ధి మాత్రం ఏదో ఒక వైవిధ్యంతో కూడినటువంటి విధంగా ఉంది.  Human infrastructure, physical infrastructure వద్ద ఈ దేశం అనుకున్నట్లుగా ముందుకు పోలేకపోవడంతో మధ్యంతరంగా ఈ దేశం ఎక్కడో నిలబడిపోయే విధంగా ఉందని" ఆ పుస్తకంలో చెప్పుకుంటూ వచ్చారు.  నేను ప్రభుత్వం ఇచ్చిన శ్వేతపత్రాలను కూడా చదివాను.  ఈ పెరుగుదల ద్వారా వచ్చిన ఆదాయాన్ని పెద్ద ఎత్తున హ్యూమన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కోసం మరియు సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కోసం ఖర్చు చేసేటప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి జరుగుతుందనేది ఆ పుస్తకంలో ఉంది.  ఆ పుస్తకం చదివి వ్రాశారా లేదా చూడక అటూ ఇటూగా వ్రాశారా అని నాకు అనిపించింది. చాలా సంతోషం.  కానీ, ఈ  బడ్జెట్ ఆ విధంగా ఉన్నదా? మొత్తం  విజన్ ఆ విధంగా ఉన్నదా?  ఫీల్డ్‌లో  ఏమి జరుగుతుంది ఈ మాటలవల్ల, పనుల వల్ల అనేది చూసినపుడు కొంచెం అనుమానం మరియు ఆందోళన కూడా కలుగుతుంది.

ఈ బడ్జెట్‌ను గణాంకాలూ, జమాఖర్చుల క్రింద చూడకుండా ఒక విజన్ క్రింద, మరీ ముఖ్యంగా తెలుగుదేశం ప్రభుత్వం కొత్తగా అధికారంలోకి వచ్చి స్వర్ణాంధ్రను నిర్మించాలని ఉత్సాహం చూపుతున్న సందర్భంలో చెబుతున్న ఒక విజన్ క్రింద చూసినట్లయితే మరొక రకంగా

దీనిని విశ్లేషించవలసిన అవసరం వస్తుంది. గణాంకాల గురించి పెద్దగా చర్చ అవసరం లేదు. 1995-2004 సంవత్సరం మధ్యలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉంది. దానిని పదే పదే గ్లోరిఫై చేసి చెబుతున్నారు. మరీ ముఖ్యంగా 2వ దశ సంస్కరణలను మేమే తీసుకువచ్చామని చెబుతున్నారు. 2వ దశ సంస్కరణల వల్ల ఏమి జరిగిందనేది అందరికంటే వారికే ఎక్కువగా తెలుసు. దానిని పెద్ద ఎత్తున తీసుకురావడం వల్ల పీర విద్యుత్ సంస్కరణల ఫలితం ఏమైంది? వ్యవసాయాన్ని, గ్రామాలను వదిలేసిన ఫలితం ఏమైంది? పెన్షనర్లకు డి.ఏ. కూడా ఇవ్వకుండా వదలివేయడం వల్ల ఏమైంది? ఏడు ఇనిస్టిట్యూషన్నన్నిటినీ ప్రపంచబ్యాంకుతో ఒప్పందం కుదుర్చుకుని వాటిని ముంచివేసిన దానివల్ల ఏమైంది లాంటివి చూసినట్లయితే మళ్లీ అదే దానిలోకి వెళ్లడమనేది కొంచెం ఇబ్బంది కలుగుతుంది. కొంచెం బ్యాలన్సింగ్‌గా మధ్యమధ్యలో కొంచెం జాగ్రత్తతో గ్రామాలగురించి మాట్లాడుతున్నారు, హ్యూమన్ డెవలప్‌మెంట్ గురించి చర్చిస్తున్నారు, కొంచెం బ్యాలెన్స్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు కానీ ఈ రెండింటి మధ్యా ఏదో ఒక పెద్ద ఊగిసలాట ఈ బడ్జెట్‌లో ప్రతిచోటా కనిపిస్తూ ఉంది.

ఆధార్‌ను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరూ వ్యతిరేకించారు. ఇప్పుడు పాలకపక్షంలోకి వచ్చిన తర్వాత ఆధార్ కార్డు సర్వానికి ఆధారం అని చెబుతూ ఉన్నారు. మాకు ఒక భయం కూడా ఏమిటంటే, ఉత్తరాంధ్రలో ఉన్న బాక్సైట్ త్రవ్వకాలకు సంబంధించి ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడుగారు తీవ్రంగా వ్యతిరేకించారు. మళ్లీ బాక్సైట్ త్రవ్వకాలను చేపడదామని అక్కడకు వెళ్లినపుడు ఆయన మాట్లాడారు. అలాగే, మంచినీరును అందించడానికి సుజల స్రవంతిని పెట్టారు. కార్పోరేట్ బాధ్యత క్రింద ఇప్పటికే శానిటేషన్‌కు సంబంధించినంతవరకూ కేంద్రప్రభుత్వం అప్పజెప్పి ఉంది. అది ఏ మేరకు అమలైందనేది చూస్తే మంచిది. ఛత్తీస్‌ఘడ్‌లో ఉన్న ఒక నది మొత్తాన్ని ఒక ఏజెన్సీ కొనుక్కోవడం జరిగింది. అక్కడి ప్రజలు అల్లరిచేస్తే మళ్లీ వెనుకకు తీసుకోవడం జరిగింది. మంచినీరును ఇవ్వాలని వారు అప్పజెప్పినతర్వాత ప్రభుత్వం బాధ్యత తీసుకోకపోతే, అది కూడా పబ్లిక్, ప్రయివేటు భాగస్వామ్యం క్రిందకు వెళ్లిపోతే స్థానిక సంస్థలకు ఏమి అవకాశాలు, అధికారాలుంటాయి? అందువల్ల మాకు ఈ విషయంలో మాత్రం తెలుగుదేశం ప్రభుత్వం మళ్లీ వెనుకకు పోతోందేమోనని ఒక ఆందోళన ఉంది. అయితే నాలుగైదు విషయాలు చెప్పే విషయంలో చాలా స్పష్టంగా చెప్పే ప్రయత్నం చేశారు. బడ్జెట్ తయారీలో మంచి కసరత్తు చేశారు. ఈ బడ్జెట్ పత్రంలో కొంత సరకుంది. అయితే బడ్జెట్ లోపల ఏముంది, బయట ఏముంది, మధ్యలో ఏముందనేది తెలుసుకోవాలంటే ఆచరణను చూస్తేనే అర్థం అవుతుంది. చాలా లోతుకు చూస్తేనే అర్థం అవుతుంది. ఈ బడ్జెట్‌ను తయారుచేసిన వారు పండితులు. పండిత భాష దీనిలో పదేపదే కనిపిస్తూ ఉంది.

తెలుగుదేశం ప్రభుత్వానికి ఐ.టి. సెక్టారుకు సంబంధించి కొన్ని ఆశలు, పెద్ద పెద్ద కలలు, ఊహలు కూడా ఉన్నాయి. వాస్తవానికి, భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌కు ఐ.టి.రంగంలో రెండవస్థానం రావడానికి ప్రధానమైన పాత్రను శ్రీ చంద్రబాబునాయుడుగారు పోషించారు. దానిలో ఎటువంటి సందేహం లేదు. కానీ, ఇప్పుడు మన పరిస్థితి ఏమిటి? 1.8 శాతం మాత్రమే ఐ.టి. ఉద్యోగాలు శేషాంధ్రలో ఉన్నాయి. కేవలం 2 శాతం మాత్రమే ఐ.టి. ఎగుమతులు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. అంటే, 21 వేల ఉద్యోగాలను, 5 లక్షల ఉద్యోగాలకు పెంచాలని, ఎగుమతులను 5 శాతం పెంచాలని ఒక ప్రతిపాదన. అంటే, రేపటికి రేపు పెంచాలని కాదు. ఎగుమతులు రెండున్నర రెట్లు, ఉద్యోగాలు 24 రెట్లు పెంచేటటువంటి ప్రణాళిక ఇది. కేటాయింపులు రూ. 111 కోట్లు మాత్రమే.

అది వేరే విషయం. ఏమైనా ఇప్పుడా పరిస్థితి లేదు. పెద్దఎత్తున ఐ.టి. ఎగుమతులుగానీ, ఐ.టి. ఉద్యోగాలను సంపాదించడం కోసం వియత్నాం, ఫిన్‌లాంటి లాంటి చిన్నదేశాలు కూడా ముందుకు వచ్చాయి. ఇతర రాష్ట్రాలు కూడా పెద్ద ఎత్తున ఐ.టి.రంగంలోకి ప్రవేశిస్తున్నాయి. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో కూడా మనం ఎంత ప్రయత్నం చేసినా హైదరాబాదును దాటి విశాఖపట్నం రావడానికి వారు పెద్దగా పూనుకోలేదు. కర్నాటక ప్రభుత్వం కూడా బెంగుళూరు దాటి మిగిలిన నగరాలకు ఐ.టి. రంగాన్ని తీసుకువెళ్లాలని ఎంత ప్రయత్నం చేసినా బెంగుళూరు నగరం దాటి వారు బయటికి రాలేదు. యూరప్ నుంచి మార్కెట్ కూడా మనకు దొరికే పరిస్థితి కనిపించడం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని పూర్వమంత ఆశలను ఐ.టి. రంగంపై పెట్టుకోవడమనేది ఎంతవరకూ న్యాయమో చూడాలి.

డ్వాక్రాకు సంబంధించి పదేపదే తెలుగుదేశం ప్రభుత్వం చాలా గొప్పగా చెప్పుకునే విషయం. నిజంగా ఆంధ్రప్రదేశ్‌కు ఒక పెద్ద అవకాశం అది. 1990 వ సంవత్సరంలో అక్షరాస్యత ఉద్యమం, ఆ తరువాత సారా వ్యతిరేక ఉద్యమం వచ్చినపుడు యాంటీ ఎస్టాబ్లిష్‌మెంట్‌గా ఉన్న మహిళలందరినీ pro-establishment గా తీసుకురావడమనే ఉద్దేశ్యంతో చేయడం జరిగింది. దానికి మేము ఆనాడు ప్రత్యక్షసాక్షులం. మా నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలోనే మొట్టమొదటి డ్వాక్రా గ్రూపును ప్రారంభించడం జరిగింది. నేను కూడా ఆ కార్యక్రమానికి హాజరయ్యాను. దానిని ఒక పెద్ద సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్రింద, సోషల్ క్యాపిటల్ క్రింద వాడుకుని ఉన్నట్లయితే ఒకరకంగా ఉండేది. కొంతకాలం ఆ ప్రయత్నం జరిగింది. మహిళాసాధికారత కోసం కొంతకాలంపాటు వారిని పెద్దఎత్తున వాడుకోవడం జరిగింది. రానురానూ వారిని వడ్డీకి అప్పులు ఇచ్చేవారి క్రింద, క్రింది స్థాయిలో ఉండే వారికి ఆ రుణాలు కూడా మానుకుంటే పైస్థాయిలో కొద్దిమంది దానిని మేనేజ్ చేసేటట్లుగా మారిపోయింది.

మ.12.00

అలాగే చిన్న చిన్న వస్తువులను తయారు చేసి ఎగుమతి చేయడంలో బంగ్లాదేశ్ చాలా పెద్ద ఎత్తున ముందుకు పోతోంది. అలాగే పొదుపు చేయడం ద్వారా కేపిటల్‌ని అంతర్గతంగా సమకూర్చుకునే అంశంలో కూడా బంగ్లాదేశ్ పెద్ద పాత్రను పోషించింది. జపాన్‌కో, ఎక్కడికో పోకండి. చిన్న చిన్న దేశాలకు, మన లాంటి దేశాలకు వెళ్లండి. చిత్తూరు జిల్లాలో కూడా దానికి సంబంధించి కొన్ని మోడల్స్ ఉన్నాయి. డ్వాక్రా గ్రూపులను కేవలం పొలిటికల్‌గా ఉపయోగించుకోకుండా వారిని ఒక పెద్ద సోషల్ మూవ్‌మెంటులోకి తీసుకరావలసిన అవసరం ఉంది. ఈరోజు మరుగుదొడ్ల గురించి అందరమూ మాట్లాడుకుంటున్నాం . దీంట్లో పెద్ద ఎత్తున వాళ్లను వాళ్లను ఇన్వాల్వ్ చేసి ఉండవలసింది. పిల్లలను పాఠశాలలకు తీసుకరావడంలో మనం 12వ ర్యాంకులో ఉన్నాం . దీంట్లో కూడా వాళ్లను పెద్ద ఎత్తున ఇన్వాల్వ్ చేసి ఉండాల్సింది. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణ బాధ్యతలను ఆ కార్యకర్తలకు అప్పజెప్పడం కాదు, వారికి ఎప్పుడో అప్పజెప్పేశాం . కానీ మొత్తం అధికారాలు అప్పజెప్పి వారి చేత అవి నిర్వహించబడేలా చేసి ఉండాల్సింది. ఆ కేపిటల్‌ని ఆవిధంగా ఉపయోగించుకున్నట్లయితే పెద్ద ఫలితాలు వస్తాయి. అలా కాకుండా వాళ్లను కేవలం పొలిటికల్ కేపిటల్‌గా మాత్రమే ఉపయోగించుకుంటే ఫలితాలు రావు. దీన్ని నేను చాలా స్పష్టంగా చెప్పదలుచుకున్నాను.

మనకున్న పెద్ద వనరు తీర ప్రాంతం . 14 ఓడరేవులు వస్తాయన్నారు. చాలా సంతోషం, రావాలి కూడా . కానీ మనకు కొన్ని అనుభవాలున్నాయి. ఓడ రేవు వచ్చీ రాకముందే ఏమి

జరిగిందో నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం ఓడరేవు ఒక పెద్ద ఉదాహరణ. వచ్చీ రాకముందే ఎక్కడెక్కడి వాళ్లో దేశమంతా కూలిపోయిందేమోనన్న విధంగా ఎలక్ట్రిసిటీ ఉత్పత్తి కోసం అక్కడ దిగిపోయారు. మొన్న మాట్లాడినపుడు చంద్రబాబు నాయుడు గారు కూడా కృష్ణపట్నం లో ఇలా జరిగిందని చెప్పారు. నిజమే, భయమేస్తోంది. నెల్లూరు ఆ కాలుష్యాన్ని తట్టుకుని బతుకుతుందా లేదా ! తీర ప్రాంతాన్ని జాగ్రత్తగా చూసుకోనట్లయితే, ముఖ్యంగా పెట్రో రసాయనాలు, ఎరువులు, మందులు తదితర వాటికి సంబంధించిన పరిశ్రమలు విపరీతంగా అక్కడికి వచ్చినట్లయితే నిర్దాక్షిణ్యంగా సముద్రాన్ని డంపింగ్ యార్డు క్రింద మారిస్తే, తీరప్రాంతంలో కాలుష్యాన్ని వెదజల్లే ప్రమాదం ఉంది. ఆల్‌రెడీ ఓయన్‌జిసి వల్ల అమలాపురం ప్రాంతంలో భూమి ఒక అరడుగు క్రిందకి వెళ్లిపోయిందని, సముద్ర మట్టం పెరుగుతోందనే రీడింగున్న పరిస్థితి ఉంది. సముద్ర తీరం చుట్టూ అభివృద్ధి జరగవలసిందే. అందులో సందేహం లేదు. చైనాలో సముద్ర తీరం చుట్టూ అభివృద్ధి జరిగింది. మిగతా చోట్ల అంతంత మాత్రంగానే ఉంది. జాగ్రత్తలు తీసుకోనట్లయితే ఈ తీర ప్రాంత అభివృద్ధిలో చాలా ప్రమాదం జరుగుతుంది, ధ్వంసం చేసేస్తారు, భూములు లాగేస్తారు, సముద్రాన్ని కాలుష్య భరితం చేస్తారు. పరిశ్రమలు ఆవిధంగా మీరు పెట్టదలుచుకుంటే ఎక్కువ పరిశ్రమలను రాయలసీమకి కేటాయిస్తే మంచిదని మా అభిప్రాయం . పరిశ్రమలు, ఓడరేవులు రాగానే అభివృద్ధి జరగదు. అందుకు విశాఖపట్నం అనుభవం మనకుంది. విశాఖపట్నానికి షిప్‌యార్డ్ వచ్చాక, విశాఖపట్నానికి సెంట్రల్ గవర్నమెంటు నుంచి స్టీల్ ప్లాంటు వచ్చాక, ఆ రెండింటి చుట్టూ పెద్ద ఎత్తున చిన్న చిన్న ప్రైవేటు పరిశ్రమలు వచ్చాయే తప్ప ఆటోమేటిక్‌గా ప్రైవేటు వాళ్లు పరుగెత్తుకుని రాలేదు. రేపు కూడా మీరు ఓడరేవు పెట్టగానే ప్రభుత్వ రంగం క్రింద రకరకాల వనరులను సమకూర్చుకుని మీరు పరిశ్రమలు పెట్టడానికి పూనుకున్నప్పుడే ప్రైవేటు రంగంలో పరిశ్రమలు వస్తాయే తప్ప వాళ్లు అమాయకంగా వచ్చే పరిస్థితి ఉండదు.

మ్యాన్యుఫ్యాక్చరింగ్ సెక్టారు గురించి బడ్జెటులో ఎక్కడా ప్రస్తావన లేదు. ఎంతసేపూ పెట్రో రసాయనాల లాంటివి, లేదంటే పెద్ద స్టీలు ఫ్యాక్టరీ లాంటివి పెట్టారే గానీ మ్యాన్యుఫ్యాక్చరింగ్ గురించి చెప్పలేదు. చైనా డెవలప్‌మెంటులో ఉన్న ప్రధానాంశం ఏమంటే – వాళ్లు మ్యాన్యుఫ్యాక్చరింగ్ మీద ఎక్కువ మనసు పెట్టారు. దాంతో వస్తూత్పత్తి పెద్ద ఎత్తున జరిగింది. చిన్న చిన్న వస్తువుల ఉత్పత్తి, ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తి పరిశ్రమల వల్ల ఉపాధి పెద్ద ఎత్తున దొరుకుతోంది, ఆ ఉపాధి వల్ల అదనంగా వాళ్ల కొనుగోలు శక్తి పెరుగుతోది. కొనుగోలు శక్తి పెరగడం వల్ల వాళ్లకి మిగులు తలెత్తుతోంది. ఆ మిగిలిన ఆదాయమే పెట్టుబడుల క్రింద మారడం జరుగుతోంది. ఇంతకు ముందు గోపాలక్రిష్ణారెడ్డి గారు ఎర్రచందనం గురించి మాట్లాడుతూ, దాన్ని ఎగుమతి చేస్తామని చెప్పారు. నాకొక విషయం అర్థం కావడం లేదు. మన దేశంలో ఎర్ర చందనం ఉంది, ప్రపంచంలో ఎక్కడా లేదు. దాన్ని ఎందుకు ఎగుమతి చేయాలి? దాన్ని మిగతా దేశాల వాళ్లు ఏమి చేసుకుంటారు? దాన్ని మన దేశంలో ఎందుకు వాడుకోలేకపోతున్నారు? దాంతో మిగతా దేశాల వాళ్లు బొమ్మలు, మందులు తయారు చేస్తారని చెబుతున్నారు. వాటిని మనం ఇక్కడ చేయలేమా? దాన్ని మ్యాన్యుఫ్యాక్చరింగ్ వైపు నుంచి చూడకపోతే అనుకున్న విధంగా దేశాభివృద్ధి జరిగే పరిస్థితి ఉండదు.

అధ్యక్షా, వ్యవసాయానికి సంబంధించి నేను కొంచెం వేగంగా చెప్పే ప్రయత్నం చేస్తాను. చాలా కీలకమైన అంశం . యునైటెడ్ నేషన్స్ వాళ్లు పాపులేషన్ ఎస్టిమేట్స్‌ను లేటెస్ట్‌గా రిలీజ్ చేశారు. వాళ్లు రిలీజ్ చేసిన దాంట్లో .. 2050 నాటికి కూడా భారతదేశంలో 80కోట్ల మంది

వ్యవసాయం మీదే ఆధారపడి ఉంటారని చెప్పారు. చాలా జాగ్రత్తగా వినవలసిన విషయం . మనం ఎంత స్మార్ట్ సిటీలు కట్టినా, ఏమి చేసినా కూడా 2050నాటికి కూడా భారతదేశంలో 80కోట్ల మంది వ్యవసాయం మీదే ఆధారపడి ఉంటారన్నది యునైటెడ్ నేషన్స్ వాళ్లు పాప్యులేషన్ ఎస్టిమేట్స్‌లో మొన్నటికి మొన్న చెప్పిన అంశం . మీరు చెప్పిన లెక్కల ప్రకారం కూడా జియస్‌డిపి లో 54.33శాతం 2003లో ఉంటే, ఈరోజు 49.28శాతం అంటే 50 శాతం జియస్‌డిపి వ్యవసాయం మీదే వస్తోంది. ఈనాటికి కూడా 70శాతం మంది గ్రామీణ ప్రాంతాలలో ఉంటున్న మాట వాస్తవం . ఈపరిస్థితుల్లో ఏరకమైన వ్యవసాయ విధానం ఉండాలన్న దాని మీద పెద్ద చర్చ జరుగుతోంది. ఎవరేమి చెప్పినా, ఈ అవశేష ఆంధ్రప్రదేశ్ కూడా వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగానే చాలా కాలం ఉంటుంది. ఉపాధి కూడా వ్యవసాయ ఆధారితంగానే ఏర్పడుతోంది. గ్రామీణ ఆధారితంగానే ఉంటుంది. అలాంటపుడు వ్యవసాయం పట్ల మనకున్న దృక్పథం ఏమిటి, విజన్ ఏమిటన్నది చాలా కీలకమైన అంశం . ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయమంతా మాగాణి చుట్టూ, నీరు బాగా లభ్యమవుతున్న ప్రాంతాలలో పంటలు పండించే దాని చుట్టూ తిరిగింది. హరిత విప్లవం ప్రవేశపెట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు మన పరిశోధనలు, మన వ్యయం, మన శక్తిసామర్థ్యాలు దాని మీదే ఖర్చు పెట్టాం . ఇది మారాలి. స్వామినాథన్‌గారు చాలా స్పష్టంగా చెప్పారు. వ్యవసాయ జోన్లు ఏర్పాటు చేయండి, జియోగ్రాఫికల్‌గా, బయోలాజికల్‌గా, ఏ రకమైన పంటలు ఎక్కడ పండించడానికి అవకాశం ఉందో దానికి అనుగుణంగా పరిశోధన, ప్రణాళిక రూపొందించండి. మొక్కజొన్నను తీసుకొచ్చి మొత్తం దేశమంతా రుద్దవద్దు. హరిత విప్లవం గురించి స్వామినాథన్ బాధపడ్డారు. ఒక ఫలితం వచ్చింది, చాలా నష్టాలు కూడా వచ్చాయి, స్థానికత కోల్పోయారు, విత్తనాలకు విదేశాల మీద ఆధారపడవలసిన పరిస్థితి వచ్చింది, రసాయనిక ఎరువులు విపరీతంగా వాడడం జరుగుతోంది.

హరిత విప్లవానికి సంబంధించి ఆరోజు మనం పశ్చిమ గోదావరి జిల్లాను ఉదాహరణగా తీసుకున్నాం . ఈరోజు పశ్చిమ గోదావరి జిల్లాలో ఏ గ్రామంలోనైనా మంచినీరు కూడా దొరకడం కష్టంగా ఉంది. It is a fact. ఒకరం చేసింది కాదు ఇది. ఒక రోజు ఒక నిర్ణయం తీసుకున్నాం, కరెక్ట్ అనుకున్నాం, చేశాం . ఫలితం చూసినట్లయితే అది ఈరోజు వికటించింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని, స్థానిక వంగడాలను ఉపయోగించుకునే విధంగా, పెద్ద ఎత్తున రసాయన ఎరువులు వాడకుండా , పూర్తిగా సేంద్రీయ ఎరువులు వాడేలా, రకరకాల పంటలు అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. అసలు భారతీయ ఆహార విధానంలో కూడా పెద్ద ఎత్తున మార్పులు రావలసిన అవసరం ఉందని స్వామినాథన్ గారు అంటారు. క్లైమేట్ ఛేంజ్ వల్ల ఈ పంటల విధానంలోనే మొత్తం మార్పు వచ్చింది. ఒక 50, 60 ఏళ్లలో ఇప్పుడు పండుతున్న పంటలలో, మరీ ముఖ్యంగా గోధుమ పంట తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని కోపెన్‌హెగెన్‌లో ఆయన చెప్పారు. కాబట్టి వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకున్నపుడు, ఆంధ్రప్రదేశ్‌లోని వనరులను గమనంలో పెట్టుకున్నపుడు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయ ఆధారితం అనుకున్నపుడు, ఒక క్రమబద్ధమైన పద్ధతిని పాటించవలసిన అవసరం ఉంది. స్వామినాథన్ గారు చాలా స్పష్టంగా చెబుతారు, పండించిన దానికి ఒకటిన్నర రెట్లు గిట్టుబాటు ధర ఉన్నప్పుడే ఆ వ్యవసాయానికి అర్థముందని. చిన్న కమతాలున్నాయి, యంత్రాల సపోర్టు వాటికి అవసరం. రుణ మాఫీ విషయం గురించి చాలా పెద్ద ఎత్తున చర్చించారు. అసలు ఆంధ్రప్రదేశ్‌లో ఎంత మంది రైతులు రుణాలు తీసుకుంటున్నారు? ఎంత శాతం రుణాలు రైతులకు అందుతున్నాయి? అసలు రైతులందరూ రుణాలు తీసుకుంటున్నారా? Please, go through the statistics. I do not

want to reveal all these things. మీ ప్రభుత్వం ఈరోజు వచ్చింది . రైతులు రుణాలు తీసుకుని వుంటే గత ప్రభుత్వ కాలంలో తీసుకుని ఉండాలి. అంత గొప్ప రుణ సౌకర్యం ఆంధ్రప్రదేశ్‌లో ఉందని అనుకుంటున్నారా? 52శాతం మంది రైతులకు ఇప్పటికీ బ్యాంకు ఎకౌంట్లు లేవని నిన్నగాక మొన్న ప్రకటించిన పరిస్థితి ఉన్నపుడు, గిట్టుబాటు ధరలు, రుణాలు చాలా కీలకాంశాలు అవుతాయి. ఈవిషయాన్ని నేను ఇంకా సాగదీయాలనుకోవడం లేదు.

జల యజ్ఞంలో 11.87లక్షల ఎకరాలు సాగులోకి వస్తుందని చెప్పారు. 11 ప్రాజెక్టులు ఈ ఏడాది లోపల పూర్తి అవుతాయని చెప్పారు. ఈ ప్రాజెక్టులనినంటికీ సంబంధించి నీరుందని నేను అనుకోవడం లేదు. సరే, ఐదేళ్లకు ఒకసారి నీళ్లొచ్చినా వచ్చినట్లే, కొంచైమైనా భూమి తడుస్తుంది, కొంచెమైనా నీరు భూమిలోకి ఇంకి వాటర్ టేబుల్ పెరుగుతుందని, ఆమేరకైనా మేలు జరిగినా జరిగినట్టేనని చెప్పి ఈ ప్రాజెక్టులు కట్టడమే తప్ప వాస్తవంగా జలయజ్ఞం క్రింద చేపట్టిన ప్రాజెక్టులన్నీ కూడా అదనపు జలాల మీద ఆధారపడి కట్టినవే తప్ప నికర జలాల మీద ఆధారపడి కట్టినటువంటివి కానప్పుడు మనము పెద్ద ఎత్తున మెట్ట పంటల మీద ఆధారపడివలసి ఉంది.

మ 12.10

పట్టణాలకు సంబంధించిన అంశాన్ని ముఖ్యంగా చెప్పాల్సిన అవసరముంది. ఎక్కువ జనాభా కలిగిన నగరాలు తెలంగాణాతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా ఉన్నాయి. హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున పట్టణీకరణ జరిగినట్లు, పట్టణ జనాభా ఎక్కువగా ఉన్నట్లు తెలంగాణలో చెప్తున్నారు కానీ మొత్తం మీద చూసుకున్నప్పుడు ఎక్కువ పట్టణాలు, నగరాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. కానీ ఈ పట్టణాలు ఎలా ఏర్పడ్డాయి? ఈ పట్టణాల ఏర్పాటు తరువాతి పరిణామాలేమిటి? ప్రస్తుతం 29.52 శాతం పట్టణ జనాభా ఉన్నట్లు సోషల్ ఎకనామిక్ సర్వేవారు ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల చెప్పారు. కానీ హైదరాబాద్‌లో 23.56 శాతం జనాభాతో 28 శాతం మురికివాడలున్నాయి. ఆ హైదరాబాద్ పోయినందువల్ల ఆ మురికివాడలు కూడా మనకు లేకుండా పోయాయి కదా? ఒక రకంగా ఆనందాగాను, బాధగాను ఉంది.

విశాఖలో 7.7 లక్షలు, విజయవాడలో 4.5 లక్షలు, గుంటూరులో 2.66 లక్షలు, నెల్లూరులో 2.04 లక్షలు, తిరుపతిలో 1.25 లక్షలు, ఒంగోలులో 1.08 లక్షల జనాభా మురికివాడలలో ఉన్నారని 2011 జనాభా లెక్కల ద్వారా తెలిసింది. విశాఖపట్టణాన్ని ఎక్కువ కాలుష్యం ఉండే నగరంగా డిక్లేర్ చేశారు. పట్టణాలకు ఈ జనం ఎలా వస్తున్నారు? ఎందుకు ఇలా పెరుగుతోందంటే గ్రామాల్లో ఉపాధి కోల్పోయి, నైపుణ్యం లేక పొట్ట చేత పట్టుకుని నగరాలకు వచ్చి నగర జనాభా పెరగడమనే రూపంలో పట్టణీకరణ అని మనం నిర్వచించుకుంటున్నామా? లేక గ్రామాలలో ఉన్నవాళ్ళు ఎక్కువ నైపుణ్యాలను అదనంగా సంపాదించుకుని, మంచి హోప్‌తో, బెటర్ స్కిల్‌తో, బెటర్ సెటిల్‌మెంట్‌తో ఉండేటటువంటి విధంగా గ్రామ జనాభా పట్టణాలకు రావడమనే రూపంలో పట్టణీకరణను మనం చూస్తున్నామా అనేది ప్రత్యేకమైనటువంటి అంశం. దీనిమీద పెద్ద చర్చ జరిగింది. పెద్ద ఎత్తున మహా నగరాలను నిర్మించి గ్లోబల్ ఇన్‌వెస్ట్‌మెంట్ డెస్టినేషన్స్ కింద వాటిని మార్చుకోవడమనేది ఒక పద్ధతి. ఆఖరికి ఇది ఎంత దూరం వెళ్ళిపోతుందంటే షాంఘైలాంటి నగరాలు వాటి మేయర్లకు కూడా ఆ పట్టణంలోకి రావాలంటే పాస్‌పోర్టు, వీసాలు ఇచ్చేటటువంటి అధికారం కూడా వాటికి ఉండేటటువంటి విధంగా ఉన్న నగరాలని ప్రపంచ బ్యాంకు

కథనం. దాని ప్రకారం ఈ పెద్ద నగరాలన్నీ రాబోయే కాలంలో పెద్ద పెద్ద కేంద్రాలుగా, ఒక రకంగా చెప్పాలంటే స్వతంత్రంగా పరిపాలించుకునే చిన్న దేశాల స్థాయిలోకి వెళ్ళిపోయే విధంగా ఉండాలనేటటువంటిది ఒక రకమైన కథనం, ఒక రకమైన నిర్వచనం, ఒకరకమైన అభివృద్ధికి సంబంధించిన నమూనా.

ఒక నాలుగైదు లక్షల జనాభా ఉండి, గ్రామీణ జనాభా అక్కడికి వస్తూ, పోతూ, గ్రామాలతో టచ్‌లో ఉండి, వాటికి అందుబాటులో ఉండే విధంగానూ, అక్కడ సరియైన గృహ వసతి కలిగి, పర్యావరణ మిత్రంగా ఉండే విధంగానూ ఉన్నటువంటి రిచ్ డైవర్సిటీ టౌన్‌ల రూపంలోని పట్టణాలను నిర్మించుకోవడమనేది రెండవ పద్ధతి. ఈ రెండు పద్ధతులపై అర్బన్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన మేధావులు పెద్ద చర్చ చేశారు. ఈ రెండింటిమీద ఇప్పటికి కూడా చర్చ జరుగుతోంది. అదృష్టవశాత్తు ఆంధ్రప్రదేశ్‌కి ఈ రెండు అవకాశాలున్నాయని మనవి చేస్తున్నాను. మనకి రెండో, మూడో మెగాసిటీలు ఉన్నా కూడా రెండుకోట్ల జనాభా ఉన్న హైదరాబాద్ తొందర్లోనే ఆవిష్కరింపబడుతుందని ఇటీవల కె.సి.ఆర్‌గారు చెప్పారు. హైదరాబాద్‌లో రెండు కోట్ల జనాభాతోపాటు యాభై లక్షల మురికివాడలు కూడా ఉంటాయి. ఎక్కడో ఒరిస్సా నుంచి కూడా ఇక్కడికొచ్చి మురికివాడల్లో చేరిపోతున్నారు. అలాంటి అవసరం మనకి లేదు. గ్రామాలకు దగ్గరగాను, చిన్న చిన్న పట్టణాలతో కూడి ప్రకృతికి దగ్గరగాను, ప్రతీచోటా ఒక్కొక్కరకమైన ఉపాధి, ప్రత్యేకత ఉండే విధమైన నగరాలను, పట్టణాలను నిర్మించుకోవలసిన అవసరముంది. దానికి గ్రామాలనుంచి వచ్చినటువంటి వాళ్ళకి మంచి స్కిల్స్, ఒకేషనల్ స్కిల్స్ అందించే ఏర్పాట్లు కూడా చేయవలసి ఉంటుంది.

భారతదేశం మొత్తంలో మన ఆంధ్రప్రదేశ్‌ను చూసినట్లయితే ఏమంత గొప్పస్థానంలో లేము. గ్రామీణ నిరుద్యోగంలో 12వ స్థానం, ఆయుః ప్రమాణంలో 11వ స్థానం, శిశు మరణాలలో 9వ స్థానం, పేదరికంలో 7వ స్థానం, పాఠశాల నమోదులో 12వ స్థానంలోనూ మనమున్నాము. గ్రామీణ దైన్యమనేది చాలా బాధాకరమైన పరిస్థితి. ఇటీవలి కాలంలోని స్టాటిస్టిక్స్ ప్రకారంగా చూస్తే 67 శాతం మంది ప్రజలకి మరుగుదొడ్లు లేవు. మొన్న ప్రధానమంత్రిగారు ఎర్రకోట నుంచి అదేపనిగా మరుగుదొడ్ల గురించి మాట్లాడాల్సిన అవసరమేమొచ్చింది? ఆ విధంగా ఎందుకంటున్నానంటే మరుగుదొడ్లు లేకపోవడమనేది ఆత్మాభిమానానికి, ఆరోగ్యానికీ సమస్యే. అంతేకాదు పౌష్టికాహారం లేకపోవడంవల్ల రక్త హీనత ఎక్కువగా వస్తోందా? మరుగుదొడ్లు వాడకపోవడంవల్ల రక్తహీనత ఎక్కువగా వస్తోందా? అనేటటువంటి విశ్లేషణ కూడా జరిగింది. ఎక్కడంటే అక్కడ విసర్జన చేయడంవల్ల వచ్చే జబ్బులు ఎక్కువ. కాళ్ళల్లో నుంచి పైకి పాకే పురుగుల వల్ల జీర్ణశక్తి కోల్పోవడంతో పెద్ద ఎత్తున రక్తహీనత వస్తోందనేది మనకు సర్వే వల్ల తెలిసింది. అది అంత పెద్ద కీలకమైనటువంటి అంశం. అదేదో కేవలం పారిశుభ్రతకు సంబంధించిన అంశమే కాకుండా ఆరోగ్యానికి సంబంధించినది కూడా.

52 శాతం మందికి మంచినీటి కుళాయిలు లేవనేది మరింత బాధాకరమైనది. 40 శాతం మందికి స్నానం చెయ్యడానికి గదులులేవు. 50 శాతం మంది ప్రజలు ఒకే గది గల ఇంట్లో ఉంటున్నారు. 32 శాతం పూరిళ్ళు ఇంకా ఉన్నాయి. 73.5 శాతం గ్యాస్ కాకుండా ఇతర ఇంధనాన్నే వాడుతున్నారు. మన ఎఫ్.సిలలో 68 శాతంమంది పేదలుగా ఉన్నారు. దీనికేమీ మనం బాధపడనక్కర్లేదు. అన్ని ప్రభుత్వాలూ ఇంతకాలం పరిపాలన చేసినా కూడా ఉన్నటువంటి ఒక

వాస్తవిక దృశ్యం. అలానే ఇంకా బాధాకరమైనది ఇది ఉమ్మడి రాష్ట్రానికి సంబంధించిన లెక్క. ఇంకా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం తేలలేదు. ఆంధ్రప్రదేశ్‌లో 15 లక్షల మంది పిల్లల సజీవ జననాలు జరుగుతుంటాయి. 64 వేల మంది ఒక నెల రాకముందే మరణిస్తారు. ఇది తమిళనాడు కంటే 20 వేలు, కేరళకంటే 40 వేలు ఎక్కువ. ఒక గిరిజన గర్భిణీ మహిళ బరువు 49 కే.జీలు ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో 35 కే.జీలు మాత్రమే ఉంటోంది. ఎస్.సి ఉమెన్‌యొక్క బాడీమాస్ ఇండెక్స్ 41 శాతం తక్కువ ఉండగా, ఎస్.టిలు 47 శాతం తక్కువగా ఉన్నారు. వీటిని సరిచేయాల్సిన అవసరముందని ప్రఖ్యాత శాస్త్రవేత్త అమర్త్యసేన్‌గారు తెలిపారు. ఇక్కడి నుంచే మన అభివృద్ధి పుట్టుకొని రావాలి. ముందు అంగన్‌వాడీల మీద కేంద్రీకరించాలి. 48399 అంగన్‌వాడీలున్నాయి. నాకు ఈ అంగన్‌వాడీలంటే చాల ముచ్చట. నేను మొదటిసారి ఎం.ఎల్.సి అయినప్పుడు అత్యుత్సాహంతో మొదటి నెలలో ఈ అంగన్‌వాడీలకు వెళ్ళాను. అక్కడ చిన్నపిల్లలు ఆ రకమైన స్థితిలో ఉండడం నేనైతే చూడలేక తరువాత వెళ్ళకుండా వదిలేసుకున్నాను. ఈరోజు పరిస్థితి కూడా అంతే. 27 లక్షల మంది పిల్లలు, 8 లక్షల మంది గర్భిణీలు ఉండే అంగన్‌వాడీలకు మనం కేటాయించింది రు.1049 కోట్లు. అసలు మన అభివృద్ధిని గురించి మాట్లాడుకునేటప్పుడు అంగన్‌వాడీల నుంచి మనమెందుకని మాట్లాడుకోవడంలేదు. ఇది చాలా బాధాకరమైన అంశం. అలాగే లేటెస్ట్‌గా మీరిచ్చినటువంటి సోషల్ ఎకనామిక్ సర్వే కానీ చూసినట్లయితే ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాల మధ్య ఉండే తారతమ్యాలు చాలా స్పష్టంగా కనిపించింది. ఉదాహరణకి ఉత్తరాంధ్రలో ఉండే రెండు జిల్లాలు, రాయలసీమలో ఉండే నాలుగు జిల్లాలు కూడా సగటు తలసరి ఆదాయం కంటే చాలా తక్కువగా ఉండే జిల్లాలు. అట్లాగే అక్షరాస్యతలో పశ్చిమగోదావరి 74.63 శాతం, విజయనగరం 50 శాతం దగ్గరికి వచ్చి ఆగిపోయింది. అంత పెద్ద తేడా ఉంది. ఈ బడ్జెట్‌కానీ, మీరు చెప్పే విజన్ కానీ, మరొకటి కానీ, రీషెడ్యూల్ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఎగుడు, దిగుడు పరిస్థితులకు, జిల్లాలలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఉండబోతోందా? లేదా? అనేది చూడాలి. మీరు అనేక రకాలైన విజన్లు, మిషన్లు పెట్టారు. అసలు ఈ సమానమైన అభివృద్ధి అన్ని ప్రాంతాల్లో పెరగడానికి ఒక మిషన్ కూడా పెడతారేమో ఆలోచించండి. మీరు ప్రాజెక్టుల కేటాయింపులకు పెట్టే శ్రద్ధను మీరు రాయలసీమ మీద కానీ పెట్టకపోయినట్లుగానైతే అదొక సామాజిక పరిణామంగా మారిపోతుంది. దానికి వ్యతిరేకమైనది ఏదైనా వస్తే బాధపడాల్సి ఉంటుందని కూడా నేను చాలా స్పష్టంగానే చెప్పదలచుకున్నాను.

మ. 12.20

అలాగే నాకు ఒక చిన్న డౌటు, సహజంగానే శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం మీద కొందరికి కొన్ని ఆశలు వుంటాయి. కొందరి మీద కొన్ని ఆశలు పెట్టుకోవడం తప్పులేదు. పరిపాలనకు సంబందించి గట్టిగా ఉంటారని, రాజకీయ పాలన కాకుండా న్యాయమైన పాలన ఉంటుందని, సహజంగానే తెలుగుదేశం ప్రభుత్వంవద్ద ఆ రకమైన ధోరణి ఉంటుందని, కఠినంగా ఉంటారని, పారదర్శకంగా ఉంటారని, వేగంగా పనిచేస్తారని, అవినీతికి వ్యతిరేకంగా ఉంటారని భావించారు. కానీ, ఇవేవీ మాకు కనిపించడం లేదు. ఈ కొన్ని రోజులలో మీరు ఏమి చూశారు, మీ కళ్లకు ఏమి కనపడింది, మీ కళ్లజోడు మార్చుకోవాలంటే మేమేమీ చేయలేము. చూద్దాం, మాకూ ఓపిక ఉంది. కానీ కలెక్టర్లతో మాట్లాడేటప్పుడు మా కార్యకర్తలను కనిపెట్టి ఉండండి అని ఆయన చెప్పినట్లుగా పత్రికల్లో ప్రకటనలు వచ్చాయి. రాజకీయ పరిపాలనే ఉంటుందనే విధంగా ప్రకటనలు వచ్చాయి. మేము దీనిని ఊహించలేదు. పనికి ఆహార పథకం ప్రవేశపెట్టినప్పుడు పరిస్థితి ఎలా ఉందో, ఆ తరువాత ఎలా ఉందో, ఇప్పుడు కూడా అలాగే

ఉంటుంది. మీకు ఓట్లు వేసింది ప్రజలే కాని కార్యకర్తలు కాదు. ప్రజలకు చంద్రబాబు నాయుడుగారి మీద నమ్మకం వుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని విభజించి నాశనం చేసింది, దానిని చంద్రబాబు నాయుడుగారు సరిచేసి అభివృద్ధి చేస్తారనే నమ్మకంతో ఉన్నాము. కానీ అధికారంలోకి రాగానే అంగవాడీ కార్యకర్తల్ని, మధాహ్న భోజన కార్మికులను, యం.ఇ.వోలందరినీ తీసివేసి మా వాళ్లని పెట్టుకుంటాం అనే ధోరణిలో వెళితే it is not expected from Sri Nara Chandrababu Naidu, or from your party. మేము మారము, మా పద్ధతి ఇంతే అంటే ఎవరూ ఏమీ చేయలేరు. ప్రజలు చాలా తెలివిగల వారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన ఎన్నికలలో అన్ని పార్లమెంటు స్థానాలు బి.జె.పికి వచ్చిన మాట వాస్తవం. ఎన్నికలు ముగిసిన తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మూడు అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ కు వచ్చాయి. పన్నెండు జిల్లా పరిషత్తులకు ఎన్నికలు జరిగితే పది కాంగ్రెస్‌కు, రెండు బి.జె.పికి వచ్చాయి. ఈ నాలుగు నెలల్లోనే ఏ మార్పులు జరిగాయో నాకు తెలియదు. నేను యాత్రికుడిగా కూడా ఉత్తరాఖండ్ వెళ్లలేదు. కాబట్టి, ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉంటారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు టీచర్స్ ఒక్కొక్కరికీ రూ. 1.50 లక్షలు ఖర్చు పెట్టి ఇష్టం వచ్చినట్లు బదిలీ చేశారు. ఇదేం అన్యాయం అని ప్రశ్నించడానికి వెళితే మీకూ కావాలంటే ఒక పది రాసివ్వండి, చేస్తాం అన్నారు.

మిస్టర్ ఛైర్మన్ః ఇది టిడిపి బడ్జెట్.

శ్రీ విటపు బాలసుబ్రమణ్యంః బడ్జెట్టే సార్, ఇప్పుడు టిడిపి ప్రభుత్వంలో కూడా కౌన్సిల్‌కి ఒక పద్ధతి ఉంది, కౌన్సిల్‌ని ప్రవేశ పెట్టింది కూడా చంద్రబాబు నాయుడుగారే. చంద్రబాబు నాయుడుగారు ఇటువంటి కాగితాలు తీసుకురారని మా నమ్మకం. కానీ తెస్తున్నారని మా బాధ, తెస్తే పాలకపక్షం కూడా వారిలాగే అయిపోతారని మా హెచ్చరిక. మీరు ఆ రకంగా చూడడం లేదని మా బాధ. అయితే మేము చెబుతోంది మీ మంచి కోసమే కానీ, మా మంచి కోసం కాదు కదా? అయితే, ఈ బడ్జెట్‌లో పిఆర్‌సి ప్రస్తావన లేదు సార్. పిఆర్‌సి ఇస్తారా, ఇవ్వరా? పిఆర్‌సి ఇవ్వడంవల్ల ఇంత భారం పెరుగుతుంది, దానికోసం బడ్జెట్‌లో ఇంత కేటాయించాం అనే ప్రస్తావన లేదు. మావాళ్లు అందరూ ఏమనుకున్నారంటే కె.సి.ఆర్.గారు పిఆర్‌సి ఇచ్చినతరువాత మనం కూడా అడుగుదాము, పోటీ పెడదాము, మనకి కూడా ఎక్కువ పిఆర్‌సి ఇస్తారని అనుకున్నాం. కానీ తీరా ఇక్కడ చూస్తే అసలు పిఆర్‌సి ప్రస్తావనే లేదు. ఖచ్చితంగా సమాధానం ఇచ్చేటప్పుడు పిఆర్‌సి గురించి కూడా చెప్పాలని కోరుతున్నాను. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు ఒక పాలసీని పెడతాము, ఒక కమిటీని వేస్తాము అని చెప్పారు. ఇప్పుడు కొన్ని చోట్ల కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు ఒక పద్ధతి వుంది. ఉదాహరణకు గురుకుల పాఠశాలల్లో ఫైలు నడుస్తోంది, ఆల్‌రెడీ యాక్సెప్టెడ్. కానీ ఇప్పుడేమో పాలసీని తీసుకురానివ్వండి అని అంటున్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. దాని గురించి ఏమైనా ప్రస్తావన చేయాలి కదా? ఇప్పుడుకాదు, అక్టోబర్ 2 నుండి లేదా నవంబర్ 14 నుండి ఇస్తామనో లేకుంటే ఎప్పటినుండి ఇస్తారో చెప్పాలి కదా? దాని గురించి మీరు ఏ ప్రస్తావన చేయలేదు. సమీకృత హాస్టళ్లు పెట్టాలనేది గతంలో ప్రతిపాదన. కానీ గౌరవనీయులైన రాజశేఖర్ రెడ్డిగారు మరణించిన తరువాత మిగిలిన వాళ్లు దానిని డైల్యూట్ చేశారు. ఇప్పుడు దానిగురించి ఏమైనా చేయగలిగితే మంచిది. ఫలితం ప్రజలకు చేరడం లేదు. అనవసరంగా వాటిని కడుతూ ఉన్నాము. పెద్ద పెద్దహాస్టల్స్‌లో అన్ని కులాలకు చెందిన వారు 500-600 మంది పిల్లలు ఉండే విధంగా కట్టాలని ఆరోజు అనుకున్నాం, ప్రారంభించాం, కొన్ని చోట్ల మొదలయ్యాయి. కానీ ఇప్పుడు దాని గురించిన

ప్రస్తావన ఏమీ చేయలేదు. విశాఖపట్టణంకు ఇనుప గనులు ఇవ్వాలనే దాని గురించి పెద్ద డిమాండే జరిగింది, ఇస్తామని కూడా చెప్పడం జరిగింది. కానీ బడ్జెట్‌లో దాని గురించిన ప్రస్తావన చేసివుంటే బాగుండేది. అలాగే రాయలసీమకు ఉక్కు కర్మాగార గనులు ఇస్తామనే చర్చ జరిగింది, దాదాపుగా ఉత్తర్వులు కూడా ఇచ్చారు అని కూడా అన్నారు. కానీ బడ్జెట్‌లో దాని గురించిన ప్రస్తావన జరగలేదు. సాంఘిక సంక్షేమం, గురుకులాలు ఇటువంటి వాటికి ఎప్పటికప్పుడు గ్రీన్ ఛానల్‌ద్వారా బడ్జెట్ రిలీజ్ చేయటానికి ఒక విధానాన్ని గతంలో పాటించారు, దాని వలన కొంత మేలు జరిగింది. పిల్లలకు భోజనం పెడితే ఆ డబ్బులు వచ్చేవి కావు, ఆ బిల్లులు రాక సతమతమయ్యేవారు. దానిని కూడా కొంచెం పరిశీలిస్తే మంచిది. లేదంటే తీవ్రమైన ఇబ్బంది కలుగుతుంది. కొన్ని మంచి పాజిటివ్ పాయింట్లు చెప్పారు. 24 గంటలు, 7 రోజులు విద్యుత్ ఇచ్చే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ని ఢిల్లీ, పంజాబ్‌లతోపాటు ఏర్పాటుచెయ్యడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. దానికి మేము గర్విస్తున్నాము. అలా జరిగితే కావలసింది ఇంకేమీ వుండదు. అలాగే ఆంధ్రప్రదేశ్‌కి నాలుగు కేజి బేసిన్ బ్లాక్స్ ఇప్పటికే కేంద్రప్రభుత్వం కేటాయించింది. గత ప్రభుత్వమే చాలా వరకు చేసింది. ఇప్పుడు దానిని కొనసాగించి ఆ బ్లాక్స్‌ని వినియోగించుకున్నట్లయితే చాలా ఉపయోగకరంగా ఉంటుంది. చాలా మంచి ఆలోచన, దీనిని కొనసాగించవలసిందిగా కోరుతున్నాము. అలాగే సౌర విద్యుత్‌ని ప్రధానంగా ముందుకు తీసుకుని వచ్చి వెయ్యి మెగావాట్లని ఈ సంవత్సరమే ఉత్పత్తి చేస్తాం, ఐదు వేల మెగావాట్లు పవన విద్యుత్‌తో కలిపి, ఉత్పత్తి చెయ్యడానికి ప్రయత్నం చేస్తామని చెప్పారు. అందుకు గుంటూరు, అనంతపురంలు ఎంచుకున్నారు, అనంతపురం మంచిదే కాని, గుంటూరు బదులు కడపను కేంద్రంగా తీసుకుంటే మంచిది. ఎందుకంటే గుంటూరులో కంటె కడపలో ఎండలు ఎక్కువగా వుంటాయి. సౌర విద్యుత్‌ని కూడా గుంటూరులో పెట్టవలసిన అవసరం ఉందేమో ఒక్కసారి ఆలోచించండి. చివరగా ఒక మాట చెప్తాను. ఒక విజన్ ఉందన్నారు, ఒక మిషన్ పెట్టామన్నారు, 2020 నాటికి అంటే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్ అత్యున్నత పురోగతి సాధించి, దేశంలోనే మూడవ స్థానంలో ఉంటుందని చెప్పారు. ఆ పురోగతికి మీరు తీసుకున్న ప్రమాణాలు ఏమిటి, ఆ మొదటి రెండు రాష్ట్రాలు ఏవై ఉంటాయనేది అర్థం కావడం లేదు. మనం మూడవ స్థానంలో ఉన్నామంటే వినడానికి ఎంతో బాగుంటుంది. ఆటలలో ఒకటవ స్థానమో, రెండవస్థానమో రావాలని కోరుకుంటాము. కనీసం మూడవ స్థానం వచ్చినా సంతోషమే. అలాగే 2029 నాటికి పౌర జీవన సంతృప్తి, సూచికలలో మనం ముందుంటాం అన్నారు. భూటాన్ ప్రభుత్వం మొట్టమొదట GDP కాకుండా GDH అనే దానిని ప్రతిపాదించింది. GDH అంటే Gross Domestic Happiness. నేను అంతకు ముందు బడ్జెట్‌లో మాట్లాడేటప్పుడు దాని గురించి ప్రస్తావన కూడా చేశాను. భూటాన్ కూడా మనకు ఆదర్శవంతమైనదే, దానిని నేను కాదనడం లేదు. కానీ ఆ Happiness అనేటువంటిది ఏమిటి? ఎలా లెక్క తీయాలి? భూటాన్ వాళ్లు చాలా తమాషాగా వుంటారు. వారికి మనకుపెద్దగా పోలికలు లేవు కదా? అందుకని వాళ్లకి సంతోషంగానే ఉంటుంది. వాళ్లు ఒక మాట చెప్పారు. భర్త భార్య, పిల్లలతోపాటు కలసి ఎంత సమయం ఇంట్లో ఉంటారనేది ఒక సూచిక అన్నారు. నిజమే కదా, తాగి తందనాలాడి వీధుల్లో తిరిగి గందరగోళం చెయ్యకుండా ఇంట్లో ఉండి పిల్లకాయల్ని ఎత్తుకుంటూ వుంటే వ్యతిరేకత కొంతవరకు తగ్గుతుందనే పద్ధతిలో వారు చెప్పారు. మరి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంకూడా ఇటువంటి లెక్కలేవైనా చేస్తే మాత్రం మద్యపానం నిషేధించాల్సిన పరిస్థితి వస్తుంది. సారాయి తాగే భర్తలు ఇంట్లో ఉండే కంటే బయట ఉంటేనే మంచిది. అబ్‌స్ట్రాక్ట్‌గా ఉంటే కుదరదు, స్పెసిఫిక్‌గా ఉండవలసిన అవసరం ఉందని చెబుతున్నాను. వికేంద్రీకరణగురించి మాట్లాడి ఉంటే బాగుండేది. ఈ పంచాయితీలు పి.పి. మోడ్‌లో లెగిసిపోయేలా ఉన్నాయి. వాటిగురించి

ఆలోచించండి. ఏడు మిషన్లు పెడతామన్నారు. పెట్టినప్పుడు అందరితో మాట్లాడండి. పెద్ద పెద్ద మెగా సిటీలు, స్మార్ట్ సిటీలు వుంటే వుండనీయండి లేకపోతే పోనీయండి, మా టౌన్లకి మంచినీరు, మరుగుదొడ్లు, డ్రైనేజీలు ఇవ్వండి. ఐటి హబ్‌ల గురించి మేము ఆలోచించడం లేదు, మీరిస్తే మాకు అభ్యంతరం లేదు. మా స్కూళ్లలో కంప్యూటర్లకి ఆపరేటర్లు లేరు, దయచేసి దానిగురించి ఏమైనా ఆలోచించండి. విజ్ఞాన సమాజాన్ని నిర్మించండి, మేము కూడా ఆహ్వానిస్తాం. కానీ మొట్టమొదట మా ప్రాథమిక పాఠశాలలను చూడండి, అవి శిథిలమైపోయిన దేవాలయాలకన్నా దారుణంగా వున్నాయి. హెల్త్ టూరిజం గురించి ఎన్ని చర్చలైనా జరపండి, ఎన్ని కలలైనా కనండి, దయవుంచి మా పిహెచ్‌సిలు ఇద్దరు డాక్టర్లతో 24 గంటలు పని చేసినట్లయితే మాకు చాలా ఉపయోగకరంగా వుంటుంది. సింగపూర్, జపాన్‌లను మాకు చూపించాల్సిన అవసరం లేదు. శ్రీలంక, బంగ్లాదేశ్‌లతో పోల్చినట్లయితే మనం చాలా వెనుకబడి వున్నాం. HRDలో శ్రీలంక 0.714లో వుండగా మనం .500 దాటీ దాటకుండా ఉన్నాం. చిన్న చిన్న వాటితో పోల్చుకుని చిన్న చిన్న పనులు చెయ్యమని మేము కోరుతున్నాము. మైక్రో సాఫ్ట్ సిఇవోలుగా మా బిడ్డలందరూ కావాలని కోరుకోవడం లేదు. లేబర్ల క్రింద ఏదైనా టౌన్‌కి వెళ్లి భవన నిర్మాణ కార్మికులుగా లేకపోతే ఏదో వాచ్‌మెన్‌లుగా ఉండే పరిస్థితి లేకుండా ఏదైనా చిన్న చిన్న పనులు, నిపుణతతో కూడిన పనులు చేసుకోగలిగితే చాలు. జెనిటిక్ మాడిఫైడ్ విత్తనాలు మేము కోరుకోవడం లేదు. గోరు చిక్కుడుతో అనంతపురం జిల్లా బాగుపడుతుందని ఏదో యూనివర్శిటీ వాళ్లు చెప్పారట. అటువంటి చిన్న చిన్న విషయాలు ఉంటే మాట్లాడమనండి. చిరునామాలు గల్లంతయ్యే పెద్ద పెద్ద వ్యవహారాలు మాకు అవసరం లేదు.

మ.12.30

మనం మనంగా ఉందాం. అంతరిక్షంలోకి ఆలోచనలు పోతే పోనివ్వండి. పాదాలు మాత్రం భూమికి గట్టిగా తన్నుకుని నిలబడాలనేది మా ఉద్దేశం. సంక్లిష్టంగా, ఆడంబరంగా, పోస్ట్ మోడ్రనిస్ట్ పద్ధతుల్లో ఉండే జీవితం కాదు. నిరాడంబరంగా, వాస్తవాలకు దగ్గరగా, సరళంగా ఉండే జీవితాన్ని మేం కోరుకుంటున్నాము.

MR. CHAIRMAN: Dream high and achieve high…

SRI VITAPU BALASUBRAMANYAM: Chairman Sir, every theory is proved in practice only. As per my knowledge is concerned, every dream has to be proved in theory only. కాబట్టి, కలలు కందాం. కానీ, ఆ కలలు కనేటప్పుడు కూడా నేను ఒబామా స్థానంలో కూర్చుంటానని చెప్పి కలలు కంటే ఏం లాభం సార్! మంచం మీద నుండి క్రిందపడ్డట్టే. ఎన్నైనా చెప్పండి. కలలు కనొచ్చు, అందులో తప్పు లేదు. కానీ, ఆ రకమైన కలలు కనడం ఎంతసేపు అధ్యక్షా? కనీసం నాకు మీ సీట్లో కూడా కూర్చునే అవకాశం రాదని తెలుసు కదా అధ్యక్షా.

(అధ్యక్షా, మీ సీటుకే ఎసురొచ్చింది అంటూ కొందరు సభ్యుల వ్యాఖ్యలు)

కలలు కనమంటే, మేం అటువంటి కలలు కనేశామనుకోండి, పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పండి, ఏముండవు. కాబట్టి, ఆంధ్రప్రదేశ్‌లో..

శ్రీ కె.వి.వి.సత్యనారాయణరాజు (ఉపాధ్యాయుల నియోజకవర్గం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి): సార్, సుబ్రహ్మణ్యం గారు ఒక్క పది నిమిషాలన్నా కూర్చోవాలక్కడ.....

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యంః మీరు అక్కడ కూర్చోవాలని ప్లాన్ చేసుకుంటున్నారు. కూర్చోండి. మమ్మల్ని ఎందుకు ఆ గొడవలోకి నెడతారు. అధ్యక్షా, చూడండి..

శ్రీ బి.చెంగల్ రాయుడుః అధ్యక్షా, సుబ్రహ్మణ్యం గారిని ప్యానెల్ స్పీకర్‌గానన్నా పెట్టండి.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యంః అవును నేను స్పీకర్‌గానే ఉంటాను. మాట్లాడే వాడిగానే ఉంటాను తప్ప, స్పీకింగ్ చేయించేటటువంటి వాడిగా ఉండాల్సిన అవసరం నాకైతే లేదు. అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఇంకేం లేదు, అంతా దివాళా తీసేశాం, అన్యాయమైపోతున్నాం, గోచిగుడ్డతో తిరుగుతున్నామని మనం అనుకోవాల్సిన అవసరం లేదు. మనకు కావాల్సినన్ని వనరులున్నాయి, వారసత్వముంది. అన్నింటికీ మించి ఒక అనలిటికల్ స్టోరీ వచ్చింది. పొలిటికల్‌గా ఎంత అడ్వాన్స్‌డ్‌గా ఉండాల్నో, సోషల్‌గా కూడా అంతే అడ్వాన్సుడుగా ఉండాలనేటటువంటిది ఏ దేశాభివృద్ధికైనా కీలకమైనటువంటిది. ఆంధ్రప్రదేశ్‌లో రోజూ మిగతా వ్యవహారాలు ఎట్లాగున్నా సామాజిక విప్లవానికి పెద్ద ఎత్తున బీజాలు నాటిన వేమన, వీరబ్రహ్మేంద్రస్వామి, వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, ఉన్నవ లక్ష్మీ నారాయణ రావు, గుర్రం జాషువా మనవారే. ప్రకాశం పంతులు గారి జయంతిని మొన్న జరిపారు. పొలిటికల్‌గా ఎంత గొప్ప ఆదర్శం. డా.జయప్రకాశ్ నారాయణ్ గారు ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు, ఆయన కార్యలయానికి వచ్చినప్పుడు అటెండరు ఒకాయన గేటు తీశాడు. ఆ అటెండరు ఎవరూ, ఏమిటని విచారిస్తే, ప్రకాశం పంతులు గారి మనవడని వారికి తెలిసింది. ప్రకాశం పంతులు గారి మనవడు ప్రకాశం కలెక్టరేట్‌లో అటెండరుగా పనిచేసే పరిస్థితి ఉన్నదంటే, ఎంత మోడల్‌గా వారు వ్యవహరించారు అధ్యక్షా. ఆ వారసత్వమంతా ఉంది. త్రిపురనేని రామస్వామి చౌదరి ఇలాంటి అద్భుతమైన సంస్కరణవాదులు, విప్లవకారులు, సామాజికోద్యమ కార్యకర్తలు, ఉద్యమకారులున్న రాష్ట్రం మనది. కొంచెం వారి వారసత్వాన్ని, వాళ్ల పేర్లు మాటిమాటికీ తలుచుకుంటూ, వాళ్ల వారసత్వంతో నడుస్తామని, వారే మాకు ఆదర్శమని చెప్పి ఆ వైపున మేం ప్రయాణించడానికి మా ప్రయాణంలో తొలి అడుగు వాళ్ల అడుగుల్లో ఇంకొక అడుగ్గా ఉంటుందని చెప్పుకున్నట్లయితే చాలా బాగుండేది. ఎందుకో అది కనపడలేదు. అందుకు నాకు చాలా బాధేస్తుంది.

అందువల్ల ఆంధ్రప్రదేశ్‌కు కావాల్సినన్ని పెట్టుబడులున్నాయి. తీరమే కాదు, మనుషులున్నారు. మనుషులే కాదు, మేధావులున్నారు. మేధావులే కాదు, సామాజికోద్యమ కార్యకర్తలు, ఉద్యమాలు కూడా ఉన్నాయి. వాటన్నింటినీ పెట్టుబడిగా వాడుకుని, ఒక వైబ్రెంట్‌గా ఉండేటటువంటి ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి అందర్నీ కలుపుకుని పోండి. మీరు కూడా ఉదారంగా ఉండండి. తలుపులు తెరిచి, హృదయాలతో పని చేయండి. మేమందరం కూడా సపోర్టు చేస్తాం. లేదూ, మేం బిగుసుకుని ఉంటాం. మళ్లీ మాకు 2019లో 1990 గుర్తుకు వస్తుంది అనంటే, 2004 గుర్తుకు వచ్చే ప్రమాదం ఖచ్చితంగా ఉంటుందని గుర్తు చేస్తూ సెలవు తీసుకుంటున్నాను. ధన్యవాదాలు.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడుః అధ్యక్షా, మొన్న 20 వ తారీఖునాడు గౌరవనీయులు ఆర్థిక శాఖామాత్యులు శ్రీ యనమల రామకృష్ణుడు గారు శాసన సభలోనూ, పెద్దలు, గౌరవనీయులు శ్రీ పి.నారాయణ గారు ప్రభుత్వం తరఫున శాసన పరిషత్తులోనూ ఆంధ్రప్రదేశ్

రాష్ట్రం విభజన జరిగిన తరువాత మొట్టమొదటి బడ్జెట్‌ని ప్రవేశ పెట్టిన సందర్భంలో వారికి, ప్రభుత్వానికి, నాకు ఈ అవకాశమిచ్చిన మీకందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియ జేసుకుంటున్నాను. రాష్ట్ర విభజన ప్రభావం చాలా ఎక్కువగానే అన్ని వర్గాల ప్రజల్లోనూ ఉంది. అయితే, ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని ముందుకు తీసుకువెళ్లడమనేది అధికారంలో ఉన్న పెద్దలకు చాలా ఇబ్బందికరమైన పరిస్థితి. కొత్త సమస్యలు, సంక్లిష్టతలను సరిదిద్దుకుంటూ, మళ్లీ పూర్వం నుండి కొనసాగుతున్న సంక్షేమ పథకాలకి భంగం లేకుండా చేసుకుంటూ, ఎన్నికల్లో మనం ఏమేం చేస్తామని మాటిచ్చామో, వాటిని జయప్రదం చేసుకుంటూ, బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్లడమనేది కత్తి మీద సాములాంటిదేనని చెప్పక తప్పదు. అయితే, ఇటువంటి కష్టాల నేపథ్యంలో గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసి, ఈ హైదరాబాదు సిటీని అత్యద్భుతంగా తయారుచేసి, అన్ని దేశాలతోబాటు మన రాష్ట్రంలోనూ, ఈ ప్రాంతంలోనూ ఎక్కువ మందికి ఉపాధి, విద్యావకాశాలు దొరికేటట్లుగా అన్నందాలా డెవలప్ చేసిన అనుభవమున్న ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గారు అధికారంలోకి రావడం, వారు వస్తేనే ఈ కష్టాలన్నింటికీ సమాధానం దొరుకుతుందనే పెద్ద నమ్మకంతో రాజకీయాలను సైతం పక్కనపెట్టి, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని తెలుగుదేశం పార్టీకి, వారి నాయకత్వానికి ప్రజలు ఓటేసి గెలిపించడం జరిగింది. దానివల్ల వారిపై బాధ్యత ఇంకా పెరిగిందని కూడా ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. అయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన వల్ల ఏదైతే కోల్పోయారో, వాటన్నింటినీ కూడా తిరిగి 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన నాడే వారు పెట్టుకున్న నమ్మకం నిజమౌతుందని మీ ద్వారా నేను తెలియజేస్తున్నాను.

గత కేంద్ర ప్రభుత్వం అంతవరకు ఊరుకుని, చివరి మూడు నెలలలోనే తొందరపడి, నిర్ణయం తీసుకుని ఈ రకమైన పరిస్థితికి అవకాశం కల్పించారు. సరే, వారు రాష్ట్ర విభజన చేద్దామనుకున్నప్పుడు ఒక రాజధానిని కొత్తగా ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన వనరులు సమకూర్చుకోవడానికి ఒక ప్యాకేజీని, విద్యార్థులకు సంబంధించి ఒక సమాధానాన్ని, ఉద్యోగుల్లోని తారతమ్యాలకు సంబంధించిన సమాధానాన్ని ఇస్తూ, వీటన్నింటినీ పరిష్కరించి రాష్ట్ర విభజన చేసుంటే కొంతలో కొంత నష్టం లేకుండా బాగుండేది. కానీ, ఏమీ చేయకుండా, పేపర్ మీద రాష్ట్ర విభజన చేసి, చట్టాన్ని చేసి ' తాంబూలాలిచ్చాము తన్నుకు చావండి ' అన్న చందంగా ఈ విభజన చేపట్టడం వల్ల ఇప్పటివరకూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసున్న 23 జిల్లాల ప్రజలందరూ కూడా, ఈ రోజు ప్రతి చిన్న విషయానికీ పోట్లాడుకునే పరిస్థితి ఏర్పడింది. మీది-మాది అనే పరిస్థితి, మమ్మల్ని మీరు మోసం చేస్తున్నారనే అభద్రతా భావం, మమ్మల్ని మీరు గౌరవించడం లేదనే ఒక బాధ.. ఇవన్నీ కూడా మనకి కలిగేటట్లుగా చేసే విధానం సరిగ్గా లేదని మీ ద్వారా నేను మనవి చేసుకుంటున్నాను.

అయితే, మన రాష్ట్రానికి సంబంధించి ఇక్కడున్నటువంటి విద్యా సంస్థలు గానీ, ఇక్కడున్నటువంటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గానీ, అంటే ఐటీ రంగం వంటి చాలా విషయాలు కొత్త రాష్ట్రంలో మనం ఏర్పాటు చేసుకోవాలి. అయితే, ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఇంకా కొత్త కార్యక్రమాలు చేపట్టడమన్నది చాలా ఇబ్బందికరమైన పరిస్థితి. ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు అందరూ కూడా ఇందులో ఇబ్బందిపడే పరిస్థితి వచ్చింది. కాబట్టి, రాజధానిని ఏర్పాటు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కోవాలేమోనన్న భయం కూడా ఒకవైపు కలుగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం 10 జిల్లాలు ఒక పక్షంగా, 13 జిల్లాలు మరో పక్షంగా ఏర్పడ్డాము. రాజధాని ఏర్పాటులో కూడా ఎక్కడ మళ్లీ ఈ ప్రాంతాల మధ్య వైరుధ్యాలు బయటపడతాయో, మళ్లీ ఏ

రకంగా దాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న భయం కూడా వెంటాడుతోంది. కాబట్టి, ప్రభుత్వాన్ని మీ ద్వారా ఒక్కటే కోరుతున్నాము. రాజధాని పేరు ఎత్తకుండా, ముందు మీరు డెవలప్‌మెంట్ యాక్టివిటీస్ ఏవైతే ఉన్నాయో, వాటన్నింటినీ అన్ని జిల్లాలకు సమానంగా సర్ది, అన్ని ప్రాంతాలు డెవలప్ అయ్యాయి అన్న భావన మీలో వచ్చిన తరువాత, అప్పుడు రాజధానిని ప్రకటిస్తే ఈ వైషమ్యాలకు అవకాశం ఉండదని నేను మీ ద్వారా మనవి చేసుకుంటున్నాను.

మ.12.40

అధ్యక్షా, మొన్న చంగల్‌రాయుడు గారు మాట్లాడుతూ, రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు గారు ఎప్పుడూ నవ్వే వారు కాదు. ఇప్పుడు ముఖ్యమంత్రి అయిన తరువాత నవ్వుతూ కనపడుతున్నారనే మాట ప్రస్తావనకు వచ్చింది. దీని మీద మీరు అవకాశం ఇస్తే అప్పుడే మాట్లాడాలని అనుకున్నాను కాని అప్పుడు టైం లేక మీరు అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు అవకాశం వచ్చింది కాబట్టి దాని గురించి ఒక మాట చెబుతాను.

మిస్టర్ ఛైర్మన్ ః శ్రీనివాసులు నాయుడు గారూ.. ముందు బడ్జెట్ మీద మాట్లాడండి.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు ః అధ్యక్షా, దాని మీద కూడా మాట్లాడతాను. చంద్రబాబునాయుడు గారు 3 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినప్పుడు వారు ప్రతిపక్ష నాయకుని హోదాలో ఉన్నారు. అప్పుడు వారి దృష్టికి వచ్చినటువంటి ప్రజల సమస్యలను పరిష్కరించలేకపోతున్నానే బాధతో వారు నవ్వలేకపోయారు. ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యారు కాబట్టి తప్పనిసరిగా వారి సమస్యలను పరిష్కరించగలననే నమ్మకంతో వారున్నారు కాబట్టి నవ్వుతున్నారు. రాబోయే కాలంలో అన్ని పనులను వారు నవ్వుతూనే చేయాలని, ఆ శక్తిని భగవంతుడు ప్రసాదించాలని మీ ద్వారా కోరుకుంటున్నాను.

అధ్యక్షా, మహిళల కోసం డ్వాక్రా సంఘాలను, మహిళా గ్రూపులను ఏర్పాటు చేసి మహిళలలో ఆత్మ విశ్వాసం నెలకొనేట్లుగా చంద్రబాబునాయుడు గారు కృషి చేశారు. ఇప్పటి పరిస్థితుల్లో వారిని ఇంకా అభివృద్ధి చేయడం కోసం ఏ విధంగా కార్యక్రమాలు చేయాలో రూపకల్పన చేసి వాటికి పూర్తి సార్థకతను చేకూర్చే విధంగా కృషి చేయాలని కోరుతున్నాను.

ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి వచ్చిన తరువాత పూర్వం జరిగినటువంటి విషయాలను అవగాహన చేసుకోవడం ఎంతైనా అవసరం. అందుకోసమే గత ప్రభుత్వం చేసినటువంటి కార్యక్రమాల గురించి అవగాహన చేసుకోవడం కోసం దశల వారీగా ముందు 7 శ్వేత పత్రాలను, తరువాత 2 శ్వేత పత్రాలను మొత్తం 9 శ్వేత పత్రాలను వారు విడుదల చేసి పూర్వం పరిస్థితి ఏ విధంగా ఉంది, ఏ రకంగా లోపాలున్నాయి, ఏ విధంగా అభివృద్ధి జరిగింది, లోపాలను ఏ రకంగా రెక్టిఫై చేయాలనే వాటి గురించి తెలుపుతూ శ్వేత పత్రాలను విడుదల చేశారు. ఆ శ్వేత పత్రాలను విడుదల చేయడంలో వారికున్నటటువంటి విజన్ మరియు ప్రజలకు మేలు చేయాలనే తపన వారిలో కనపడుతుందని మనవి చేస్తున్నాను.

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే వారు ఐదు దస్త్రాలపై సంతకాలు పెట్టారు. వాటిల్లో రైతులు మరియు డ్వాక్రా సంఘాలకు ఋణమాఫీకి సంబంధించి ఒకటి, పెన్షన్లను

రూ.1000లకు పెంచేందుకు ఒకటి, సామాజిక బాధ్యతలో భాగంగా ఎన్.టి.ఆర్ సుజల స్రవంతి పేరున రూ.2లకే 20 లీటర్ల త్రాగునీటి సరఫరా చేయడం ఒకటి, బెల్టు షాపులను రద్దు చేస్తూ ఒకటి, అదే విధంగా ఉద్యోగులకు పనికివచ్చేదైన పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలకు పెంచుతూ సంతకాలు పెట్టడం ఎంతైనా అభినందించదగిన విషయం. కాని, 60 సంవత్సరాలను వయస్సును అమలు చేసే దానిలో భాగంగా విద్యా శాఖలోని కొన్ని విభాగాలు కవర్ కాకపోవడం వల్ల వారంతా నిరాశకు గురవుతున్నారు. ముఖ్యంగా, ఎయిడెడ్, అన్-ఎయిడెడ్ జూనియర్, డిగ్రీ కాలేజీలలో పని చేసే అధ్యాపకులకు ఈ 60 సంవత్సరాల వయస్సు ఇంకా అమలు కావడం లేదు. మంత్రివర్గ సమావేశంలో ఆమోదించినా, యంత్రాంగం నుండి ఇంకా జీ.ఓలు రాకపోవడం వల్ల ఎయిడెడ్ విద్యా సంస్థలలో ప్రైమరీ నుంచి యూనివర్శిటీ వరకు పని చేస్తున్న అధ్యాపకులందరూ కూడా చాలా నిరాశనిస్పృహలతో ఎదురు చూస్తున్నారు. మరల రేపు 31 తేదీన పదవీ విరమణ చేసే వారు కూడా ఉంటారు కాబట్టి దయచేసి ఈ నెలాఖరు లోగా ఈ అధ్యాపకులకు కూడా పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాలకు పెంచుతున్నట్లు కాగితం రూపంలో విడుదల చేయాల్సిందిగా కోరుతున్నాను. అదే విధంగా, ఉద్యోగులకు ఐదు రోజుల పని దినాలు, పిఆర్సీని అమలు చేస్తామని, అన్ని ప్రభుత్వ శాఖలలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అర్హులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి వాటిని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టి ఉద్యోగులలో ఆత్మ విశ్వాసాన్ని, నమ్మకాన్ని కలిగించారు. కాబట్టి, దయచేసి ఈ ఐదు సంతకాలతో ఆపేయకుండా, వాటిని కూడా దశల వారీగా త్వరలోనే పూర్తి చేయాలని కోరుతున్నాను. డిపార్ట్‌మెంట్ల వారీగా చేసిన కేటాయింపుల్లో వీటి కోసం ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించి ఆ కార్యక్రమాలన్నింటిని పూర్తి చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఫీజు రీ-ఇంబర్స్‌మెంట్ విషయానికి వస్తే - రాష్ట్రంలోని చాలా ఇనిస్టిట్యూషన్లకు, మేనేజ్‌మెంట్లకు బకాయలు గతం నుండి ఉన్నాయి. ఇప్పుడు ఎంసెట్‌కు సంబంధించి కొత్తగా ఫీజు రీ-ఇంబర్స్‌మెంట్ కార్యక్రమాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది. అయితే, ఆర్థిక ఇబ్బందులున్నా ప్రభుత్వం ముందుకు వచ్చి తెలంగాణ ప్రాంతంలో చదువుతున్నటువంటి మన విద్యార్థులకు కూడా ఫీజు రీ-ఇంబర్స్‌మెంట్ మేమే చేసుకుంటామని ఒక జీ.ఓ ఇవ్వడం పట్ల విద్యార్థులందరి తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఎందుకంటే.. చదువుకునేందుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా రాజకీయాలకు అతీతంగా ఒక సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకొని విద్యార్థుల చదువు కోసం ముందుకు వచ్చినందుకు ప్రభుత్వాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

రాష్ట్రంలోని అన్ని రంగాలను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలనే దాని మీద ఒక ప్లాన్‌గా, ఒక పద్ధతి ప్రకారంగా ఒక విజన్‌తో ఏడు మిషన్లను ఏర్పాటు చేయడాన్ని స్వాగతించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే మనకున్నటువంటి జాతీయ హోదా కలిగిన పోలవరం ప్రాజెక్టుతోపాటు మిగతా ప్రాజెక్టులను కూడా పూర్తి చేయాలని కోరుతున్నాను. అదే విధంగా, పోలవరం ప్రాజెక్టు తాలూకు నీరు శ్రీకాకుళం వరకు వచ్చేటట్లుగా ఏర్పాటు చేయాలనీ, రైతులను ఆదుకునే విధంగా చేసి ప్రభుత్వం మీద పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడాలని మీ ద్వారా మనవి చేస్తున్నాను.

సంక్షేమ శాఖ విషయానికి వస్తే – సాంఘిక సంక్షేమ శాఖలో ఆశ్రమ పాఠశాలలను, గురుకుల పాఠశాలలను, వసతి గృహాలను నిర్వహిస్తున్నారు. వాటి కోసం ప్రభుత్వం ఖర్చు పెడుతున్న ప్రతి పైసా కూడా ఆ పేద విద్యార్థులకు అందే విధంగా చేయాలి. మన యంత్రాంగలో కొన్ని లోపాలున్నాయి. ఇంతకుముందు మంత్రి గారు కూడా మాట్లాడుతూ ఆ విషయాన్ని స్పష్టం చేశారు. వారి కోసం బడ్జెట్‌ను కేటాయిస్తున్నాం. ఖర్చు పెడుతున్నాం. కాని రెక్టిఫై చేయడం కోసం వచ్చే సరికి బడ్జెట్‌ను ఇవ్వడం లేదు. దాని వల్ల డబ్బును మనం కేటాయించినప్పటికి క్రింది స్థాయికి వెళ్లే సరికి అది సరిగా చేరాల్సిన వారికి చేరడం లేదు. ఉదాహరణకు ఒక బస్సును కొనుగోలు చేసేటప్పుడు ప్రయాణీకులు ఎంత ముఖ్యమో దానిని నడిపే వ్యక్తి కూడా అంతే ముఖ్యం కాబట్టి ఆ బస్సును కొనుగోలు చేయడానికి ఖర్చు పెట్టేటప్పుడు దానిని నడిపే డ్రైవర్‌కు కూడా తగినంత వసతిని కల్పించవలసిన అవసరం ఉన్నట్లుగానే ప్రభుత్వ పథకాలకు అమలు చేయడానికి అవసరమైన సిబ్బందిని నియమించడం ద్వారా ఈ కార్యక్రమాలు జయప్రదం కావడం కోసం ముందుకు రావలసిందిగా మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అధ్యక్షా, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, బి.సీ సంక్షేమ శాఖల ద్వారా నడిచే పాఠశాలల్లో ఉపాధ్యాయులు పార్ట్ టైంగా కంట్రాక్టు పద్దతిలో అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నారు. వాళ్లకు వయో పరిమితి కూడా దాటిపోయింది. వారందరికి, 2007 వ సంవత్సరంలో గురుకులాల్లో పని చేస్తున్న వారిని ఏ విధంగానైతే రెగ్యులరైజ్ చేశారో అదే విధంగా, ఈ ప్రభుత్వంలో కూడా కంట్రాక్ట్ పద్దతిపై పనిచేస్తున్న ఉపాధ్యాయుల సర్వీసులు రెగ్యులరైజ్ చేయడం కోసం, వారికి ఒక నమ్మకం, భద్రత కలగడం కోసం ఏర్పాట్లు చేయాలని మీ ద్వారా కోరుతున్నాను. అధ్యక్షా, రాష్ట్రంలో ఉన్న మైనార్టీ పిల్లలు చదువుకోవడానికి సరిపడా పాఠశాలలు లేవు. వారి భాషలో బోధించే ఉపాధ్యాయులు కూడా ఎక్కడా నియమించబడడం లేదు. ముఖ్యంగా, శ్రీకాకుళం ప్రాంతంలో ఒరియా భాషకు సంబంధించి చాలా ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. దాని మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కోరుతున్నాను.

వికలాంగులకు, వృద్ధులకు ప్రతి నియోజకవర్గంలోను వసతి గృహాలను ఏర్పాటు చేసినట్లయితే వారికి అవసరమైన అన్ని రకాల కార్యక్రమాలను వాటి ద్వారా మనం చేయడానికి అవకాశం ఉంటుంది కాబట్టి వారికి వృద్ధాశ్రమాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని మీ ద్వారా కోరుకుంటున్నాను.

అధ్యక్షా, రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు అందరూ కలుపుకొని దాదాపు ఏడు లక్షలకు పైగా ఉన్నారు కాబట్టి వారి సంక్షేమం కోసం కూడా ఏదైనా ఒక మిషన్‌ను నెలకొల్పి ఒక బాధ్యతను అప్పగించినట్లయితే మంచి ఫలితాలు వస్తాయి. ఈ మిషన్ ఉద్యోగుల సర్వీస్ విషయాలకు సంబంధించి గాని, బాగా పనిచేయడానికి గాని, ప్రభుత్వానికి సహకరించడానికి గాని అన్ని రకాల ఉపయోగపడుతుంది కాబట్టి ఉద్యోగుల సంక్షేమం కోసం ఒక మిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. ఉద్యోగులు కూడా ప్రజలలో ఒక భాగమే కాబట్టి వారికి సంబంధించిన సర్వీస్ విషయాలలో కాని, ఇతరత్రా విషయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం కోసం మాకు ఆ అవకాశాన్ని కల్పించాల్సిందిగా మీ ద్వారా కోరుతున్నాను. పర్యాటక రంగం విషయానికి వస్తే – పర్యాటక మరియు సాంస్కృతిక రంగాలకు సంబంధించి మన రాష్ట్రంలోని 13 జిల్లాలలో ఉన్న అవకాశాలన్నింటిని ఉపయోగించుకోవడానికి అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను, గైడ్స్‌ను, తగిన ప్రచారాం చేయడం వంటి వాటన్నింటిని కూడా పూర్తి చేసి పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఉద్యోగులకు గృహాల విషయానికి వస్తే – రాష్ట్ర ప్రభుత్వం ఎంతో మంది పేదవాళ్లకు గృహాలను నిర్మించి ఇస్తోంది. కాని, మా ఉద్యోగస్థులలో నాల్గవ తరగతి ఉద్యోగుల నుండి మధ్య తరగతి ఉద్యోగుల వరకు వారికున్న కుటుంబ సమస్యల వల్ల ఇళ్లు లేని ఉద్యోగస్థులు చాలా మంది రాష్ట్రంలో ఉన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి పదవీ విరమణ చేసే నాటికి ఒక గృహాన్ని నిర్మించి ఇవ్వడం జరుగుతుందని తెలుగుదేశం ఎన్నికల మానిఫెస్టోలో పెట్టడం జరిగింది. దానిని అమలు పరచడానికి హౌసింగ్ బోర్డు క్రింద లేదా ఏదో ఒక స్కీం క్రింద ఒక ఉద్యోగికి ఒక గృహం వచ్చేటట్లుగా ప్రణాళికలు తయారు చేయాలని కోరుతున్నాను. గృహ నిర్మాణ నిమిత్తం ఉద్యోగి జీతం నుండి ప్రతి నెలా డిడక్ట్ చేయడం జరుగుతుంది కాబట్టి ప్రభుత్వం మీద ఆర్థిక భారం కూడా పడదు కాబట్టి దానికి ఒక రూపకల్పన చేసి ఒక సొసైటీ ద్వారా ఉద్యోగస్థులందరికీ అంటే.. నాల్గవ తరగతి నుండి ఐఏఎస్ దాకా అందరికీ సొంత గృహాలు ఇచ్చేటట్లుగా ఏర్పాట్లు చేయాల్సిందిగా కోరుతున్నాము. ఆధార్ కార్డుతో లింకప్ చేసినప్పుడు ఒకవేళ ఎవరి పేరు మీదనైనా గృహం ఉంటే వారిని తప్పించండి. లేని వారికి ఫస్ట్ ప్రేయార్టీ ఇచ్చి అందరికి ఒక గృహం వచ్చేటట్లు చేసి ఉద్యోగులలో ఒక నమ్మకాన్ని, భద్రతను కలిగించాలనీ, పదవీ విరమణ చేసేనాటికి సొంత ఇంటిలోకి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నాను.

అధ్యక్షా, 2004 వ సంవత్సరం తరువాత ఉద్యోగులకు సంబంధించి పాత పెన్షన్ విధానం పోయి కొత్త పెన్షన్ విధానం అమలులోకి వచ్చింది. 2004 వ సంవత్సరం తరువాత ప్రభుత్వ ఉద్యోగాలలో చేరిన ఉద్యోగులకు కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం వల్ల కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగి షేరింగ్‌కు సంబంధించిన అకౌంట్స్‌ను సరిగా మెయిన్‌టెయిన్ చేయడం లేదు. దాని వల్ల రేపు పదవీ విరమణ చేసిన తరువాత ఆ ఉద్యోగి రిటైర్‌మెంట్ డబ్బులు ఏవి అంటే ఏ డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదు. రిటైర్‌మెంట్ అయిన తరువాత అది ఒక విప్లవంగా వస్తుంది కాబట్టి ఇప్పటి నుండే దానిని సరిదిద్దడం కోసం, సక్రమంగా అమలు చేయడం కోసం ప్రభుత్వం కృషి చేయాలని, దానికి సంబంధించిన విధానాన్ని ఏర్పాటు చేయాలని మీ ద్వారా కోరుతున్నాను.

పౌరసరఫరాల శాఖ ద్వారా జారీ చేసిన రేషన్ కార్డులలో డూప్లికేషన్ ఉంది. వాటిని తగ్గించడం కోసం ఆధార్ కార్డులతో లింకప్ చేస్తామని చెప్పారు. అది చాలా మంచి కార్యక్రమం కాబట్టి దానిని వెంటనే అమలులోకి తీసుకువచ్చే విధంగా చేయాలని కోరుతున్నాను.

ప్రభుత్వ పాఠశాలల విషయానికి వస్తే – ఎడ్యుకేషన్‌లో ఎప్పుడో ప్రవేశపెట్టిన పాత విధానాలే నడుస్తున్నాయి. పేపరు రహితంగా ఆన్‌లైన్ ద్వారా పంపించుకునే సిస్టం ఇప్పుడు వచ్చింది. కాని, ఆ స్థాయికి మా పాఠశాలల్లో బోధన ఇంకా రాలేదు కాబట్టి పాఠశాల విద్యలో కొత్త విద్యా విధానానికి రూపకల్పన చేయాలనీ, పాత విద్యా విధానాన్ని తప్పించాలనీ, 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు అనే లెక్కను ప్రక్కన పెట్టి క్లాస్‌కు ఒక టీచర్ ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. ఆ రకంగా చేస్తే మంచి ఎడ్యుకేషన్‌ను విద్యార్థులకు అందించడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులు వెళుతున్నారు కాని ప్రభుత్వ పాఠశాలలకు రావడం లేదు. దాని కోసం పాఠశాల విద్యకు సంబంధించి బడ్జెట్‌లో దాదాపు రూ.12,595కోట్లు కేటాయించడం జరిగింది.

మ.12.50

అయితే, ఈ రూ.12,595 కోట్లను పూర్వం ఉన్న విద్యా విధానానికి కేటాయిస్తున్నాము. డబ్బులు ఖర్చవుతున్నాయి కానీ, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ జరగడంలేదు. విద్యార్థులకు ఉచితంగా యూనిఫారాలు, పుస్తకాలు ఇస్తున్నాము. మధ్యాహ్నభోజన పథకం కల్పిస్తున్నాము. సౌకర్యాలన్నీ కల్పిస్తున్నప్పటికీ విద్యార్థులు రావడం లేదు. విద్యార్థుల తల్లితండ్రులు కొత్త విద్యా విధానాన్ని కోరుకుంటున్నారు. అంటే 5 సంవత్సరాల తరువాత కాకుండా 3 సంవత్సరాల వయసులోనే వారి పిల్లలు పాఠశాలల్లో చేరాలని అనుకుంటున్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా మన పాఠశాలలు తయారు చేయాలని, అందుకు తగ్గ మౌలిక వసతులు, టాయిలెట్స్ కల్పించాలని కోరుతున్నాను. రాష్ట్రవిభజన తరువాత ఆర్థికభారం ఉంటుంది కాబట్టి అన్ని పాఠశాలలు కాకపోయినా, పంచాయతీకి ఒక ఎలిమెంటరీ స్కూలు చొప్పున ఒక మోడల్ స్కూలును అభివృద్ధి చేసినట్లయితే ప్రాథమిక విద్యావిధానం బాగుపడుతుందని మనవిచేస్తున్నాను. ప్రభుత్వ బస్సుల ద్వారా విద్యార్థులను పాఠశాలలకు చేరవేసే కార్యక్రమం చేద్దాము. ప్రతిసంవత్సరం రేషనలైజేషన్ పేరుమీద ఉపాధ్యాయులు తగ్గించుకుంటూ పోతే విద్యార్థులు పెరిగే ముచ్చటే ఉండదు. విద్యార్థులు పెరిగే ఆలోచన చేయాలి తప్ప ఉపాధ్యాయులను తగ్గించుకుంటూపోతే చాలా కష్టమవుతుంది. ఇంటర్మీడియట్‌కు వచ్చేసరికి బడ్జెట్‌లో రూ.812కోట్లు కేటాయించడం జరిగింది. అయితే, ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థలో పర్మినెంట్ లెక్చరర్లు 20 శాతం ఉంటే, కాంట్రాక్టు లెక్చరర్లు 80 శాతం ఉన్నారు. కాబట్టి కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయడానికి, వారికి ఉద్యోగ భద్రతను కల్పించడానికి విధి విధానాలను రూపొందించాలని మీ ద్వారా కోరుతున్నాను అధ్యక్షా. ఇంటర్మీడియట్ కళాశాలల్లో ల్యాబ్ ఎక్విప్‌మెంట్ చాలా పాతదిగా ఉన్నది. మారుతున్న విధానంలో ల్యాబ్ ఎక్విప్‌మెంట్ సరిగ్గా ఉన్నట్లయితే విద్యార్థులు బయటకు వచ్చిన తరువాత వారికి భవిష్యత్తులో ఉపయోగపడుతుంది. లేకపోతే మనం పెట్టే ప్రతి పైసా వృథా అవుతుందని నేను మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, మున్సిపల్ ఉపాధ్యాయులు కూడా చాలామంది ఉన్నారు. వారికి కూడా సర్వీసు రూల్సు కావాలని మేము సంబంధిత మంత్రిగారికి, ముఖ్యమంత్రిగారి దృష్టికి కూడా తీసుకువెళ్లాము. జిల్లా పరిషత్తు, ప్రభుత్వ ఉపాధ్యాయులతోపాటు వారికి కూడా అన్ని బెనిఫిట్స్ వచ్చేటట్లు చూడాలని తమ ద్వారా కోరుతున్నాను. మున్సిపల్ పాఠశాలల్లో శానిటేషన్ గానీ, ఇతర వసతులు కల్పించేందుకు మున్సిపల్ వారు టేకప్ చేసేవిధంగా ఉంటే బాగుంటుంది.పంచాయతీ పాఠశాలలకు సంబంధించి పంచాయితీ వింగ్ టేకప్ చేసేవిధంగా ఉంటే మనం దానికోసం ఖర్చుపెట్టే డబ్బులు ఉపయోగపడడంతోపాటు పాఠశాలలు పరిశుభ్రంగా ఉంటాయని నేను తెలియచేస్తున్నాను. ఉన్నతవిద్యను మనం ఏర్పాటు చేసుకున్నాము గానీ, అందుకు సంబంధించి మనం ఇంతవరకూ కమిటీ వేసుకోలేదు. ప్రొఫెసర్లను నియమించుకోలేదు. అందుకు సంబంధించి ఇంతవరకూ ఏమీ చేయలేకపోయాము. కాబట్టి ఉన్నతవిద్యలో మనం ఇంకా మెరుగ్గా చేసుకోగలిగితే రీసెర్చ్ బాగా జరిగి శాస్త్రవేత్తలు తయారవుతారు. టెక్నికల్‌గా స్కిల్డ్ ఉన్న వ్యక్తులు బయటకు వస్తారు, తద్వారా సమాజానికి ఉపయోగపడతారు.

ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉండేలా ప్లాన్ చేయాలి. విజయనగరం జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజి లేదు. అటువంటి వ్యత్యాసాలను మనం సరిచేసుకుంటూ ప్రతిచోటా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండేలా చర్యలు తీసుకుంటే విద్యార్థుల

అందుబాటులోకి విద్య వస్తుంది. ఆ విధంగా తగు ప్రణాళికలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచిస్తున్నాను. విద్యార్థినీ విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించి వారికి రక్తహీనత లేకుండా పౌష్టికాహారం ఇచ్చి వారికి ఎప్పటికప్పుడు హెల్త్ చెకప్‌లు చేయడానికి ప్రత్యేక కేంద్రాలను, మొబైల్ టీమ్స్‌ని ఏర్పాటు చేసి బాలబాలురకు ఇబ్బంది కలుగకుండా మానవ వనరులు తగ్గిపోకుండా చేయాలని నేను కోరుతున్నాను. అదేవిధంగా పర్యావరణం అడవులకు సంబంధించి విద్యార్థినీ విద్యార్థులు సైన్స్ ఫెయిర్స్ ద్వారా ప్రయోగాలు చేస్తున్న బాల శాస్త్రవేత్తలను గుర్తించి ప్రత్యేకంగా రీసెర్చ్ ఇనిస్టిట్యూషన్లను ఏర్పాటు చేయాలి. ఈ విధంగా వారిని ప్రోత్సహించినట్లయితే సమాజానికి పనికివచ్చే భవిష్యత్ శాస్త్రవేత్తలుగా, కాబోయే అబ్దుల్ కలామ్‌లాగా ఈ దేశానికి మంచి నాయకులు, సైంటిస్ట్‌లు అవుతారు. అప్పుడే వారు ఈ సమాజంలో వచ్చే మార్పులకు సమాధానం చెప్పగలుగుతారు. వాటికి బడ్జెట్‌లో కేటాయింపులు జరగాలని నేను కోరుతున్నాను.

రోడ్లు, భవనాలకు సంబంధించి – ఎక్కడ రోడ్లు వేసినా వర్షాలు పడేసరికి మళ్లీ మొదటికే వస్తున్నాయి అధ్యక్షా. నాణ్యతా ప్రమాణాల విషయంలో రూల్సును పటిష్టపరచవలసిందిగా కోరుతున్నాను. ఒకసారి రోడ్డు వేస్తే, మినిమమ్ 5 సంవత్సరాలపాటు మెయింటెన్స్ ఉండేలా చూడాలి.

మౌలికసదుపాయాల విషయానికి వస్తే – సముద్ర తీరప్రాంతంలో పోర్టులు, ఇతర వసతులను ఏర్పాటు చేసుకుంటే మంచి ఫలితాలు వచ్చి ఆర్థికవనరులు కూడా సమకూరతాయి. ఇంధనానికి సంబంధించి, సముద్రంలో అనేక గ్యాస్ నిక్షేపాలు మనకు లభ్యపడతాయి. కానీ, వాటివల్ల మనరాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా లాభం చేకూరడంలేదు. ఈ విషయంపై కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసి అవసరమైతే పోరాడి ఇంధనం విషయంలో మనకు రావలసిన వాటాను తెచ్చుకోవలసిన అవసరం ఉన్నది. బడ్జెట్‌లో కూడా మనం ఇంతవరకు రావచ్చు అనేది చూపించుకోగలిగితే ఆ టార్గెట్స్ పెట్టుకుని పనిచేయగలుగుతామని మనవిచేస్తున్నాను.

పరిశ్రమలు – వాణిజ్య సంస్థలకు సంబంధించి ఏ ప్రాంతంలో అయితే పరిశ్రమలను నెలకొల్పుతున్నారో అక్కడ ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించి వారికి ప్రాధాన్యమిచ్చినట్లయితే, అక్కడ భూమిని ఇచ్చి సహకరించినవారికి ఉపయోగకరంగా ఉంటుంది. ఐటి రంగానికి సంబంధించి – విశాఖపట్టణంలో ఐటి కారిడార్ అనుకున్నంతగా అభివృద్ధి జరగలేదు. సరైన ట్రాన్స్‌పోర్టు విధానం లేకపోవడం, అంతర్జాతీయ విమానాశ్రయం లేకపోవడమే అందుకు ప్రధాన కారణం. కాబట్టి విమానాశ్రయం ఏర్పాటుతోపాటు ఔత్సాహికులు రావడం కోసం 13 జిల్లాలలో మౌలిక వసతులు కల్పించినట్లయితే ఆయా ప్రాంతాలు అభివృద్ధిచెందడానికి ఆస్కారమేర్పడుతుంది కాబట్టి దానికి కూడా ప్రత్యేక కేటాయింపులు చేయాలని నేను కోరుతున్నాను.

శాంతిభద్రతల విషయానికి వస్తే – విద్యార్థినీ విద్యార్థులు ఎంతసేపూ పరీక్షలలో మార్కులు బాగా రావాలని స్ట్రెస్ ఫీలవుతున్నారు తప్ప మిగతా విలువలపైన దృష్టిపెట్టడం లేదు. ఈ విలువల విషయమై పాఠశాల స్థాయినుంచే వారికి ఎన్.సి.సి., స్కౌట్స్ అండ్ గైడ్స్ గానీ, గ్రీన్ కోర్ కార్యకర్తలను మనం పెంపొందించేందుకు తగ్గ బడ్జెట్‌ను కేటాయించుకోగలగాలి. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పిల్లలకు నేర్పించే మంచి విలువల ఆధారంగానే వారు మంచి పౌరులుగా తయారవడానికి

అవకాశం ఏర్పడుతుంది కాబట్టి అందుకు తప్పనిసరిగా బడ్జెట్‌ను కేటాయించాలని కోరుతున్నాను. గతంలో ఎమ్ఎల్ఏ, ఎమ్ఎల్‌సిలు ఒక కోటి రూపాయలు ఖర్చు పెట్టేందుకు ప్రభుత్వం కేటాయించడం జరిగింది. ఇప్పుడు రెండుకోట్లవరకూ దానిని పెంచుతారని ఆశిస్తున్న తరుణంలో ఈ బడ్జెట్‌లో దాని ప్రస్తావనే లేదు. దానిని కనీసం రూ.5కోట్లైనా చేసినట్లయితే మా నియోజకవర్గాలలో చిన్నచిన్న అవసరాలకు నిధులు కేటాయించుకునే అవకాశం ఉంటుందని నేను తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. విద్యాసంస్థలకు సంబంధించి 010 హెడ్ కింద జీతభత్యాలను ఇవ్వడం జరుగుతుంది. కానీ, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్నవారికి ఈ 010హెడ్ కింద జీతాలు ఇచ్చే పద్ధతి అమలుకావడం లేదు. వారికి 010 హెడ్ కింద జీతాలు ఇవ్వాలని కోరుతున్నాను. ఎయిడెడ్ పాఠశాలల్లోని పిల్లలకు కూడా యూనిఫారాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.

రాష్ట్రవిభజన నేపథ్యంలో అన్ని రంగాలలో సమతుల్యత పాటిస్తూ ముందుకు తీసుకువెళ్లవలసిన ఈ తరుణంలో ప్రభుత్వానికి అన్ని విధాల మా సహాయసహకారాలను అందిస్తాము. మేము చెప్పిన అంశాలన్నింటినీ ఈ ప్రభుత్వం సూచనలుగా తీసుకుంటూ రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించడానికి మమ్మల్ని కూడా భాగస్వాములుగా చేస్తూ ముందుకు వెళ్లాలని కోరుతున్నాను.

మ.1.00

మమ్ములను భాగస్వాములను చేసినట్లయితే, మంచి అభివృద్ధిని సాధించడంలో కీలకమైన పాత్ర పోషించే అవకాశం మాకు లభిస్తుంది. బయటి కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఉపాధ్యాయులమైన మాకు సమయం బాగా మిగులుతుంది, కాబట్టి మమ్మల్ని ఏదైనా కమిటీల్లో సభ్యులుగా చేసి కానీ లేక మీరు చేసే ప్రజోపయోగ కార్యక్రమాల్లో ఏదోరకంగా భాగస్వాములను చేసినట్లయితే అందరూ బాగా పని చేసి అనుకున్న లక్ష్యాలను చేరడం కోసం నిర్దేశించుకున్న విజన్‌ను ఛేదించవచ్చని, అందుకు ప్రతి ఒక్కరం మీతో కలసి పని చేస్తామని, మేము మీతో ఎప్పుడూ కలిసి ఉంటామని తెలియజేస్తూ, బడ్జెట్‌పై మాట్లాడే అవకాశాన్ని, సమయాన్ని నాకు ఇచ్చినందుకు మా ఛైర్మన్ గారికి, సభ్యులందరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అలాగే మా ఉపాధ్యాయులకు సర్వీసు నిబంధనలు లేకపోవడం వల్ల యంఈఓ, డెప్యూటి డిఈఓ, డైట్ లెక్చరర్ల పదోన్నతులు ఆగిపోయి, పర్యవేక్షణ అధికారులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాబట్టి గతంలో జి.ఓ. నెం.505, 535 చంద్రబాబునాయుడు గారే ఇచ్చారు కాబట్టి మరలా ఆ నిబంధనలు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. గతంలో ఇదే సభలో ఎయిడెడ్ ఉపాధ్యాయులకు, పండితులకు చట్టాల వల్ల డబ్బులు రివకవరీ అవుతున్నాయని, 37, 1/ 2005 చట్టాలపైన మనం సరైన చర్యలు చేపట్టాలని ఛైర్మన్ గారే ఆదేశించారు, కానీ దురదృష్ట వశాత్తు అది అమలు జరుగలేదు. చట్టం చేయడం వల్ల డబ్బులు పొంది, మరలా చట్టం చేయడం వల్ల డబ్బులు రికవరీ చేయడం అనేటువంటిది చాలా బాధాకరం, వారు పదవీ విరమణ పొందిన తరువాత ఏ విధంగా చెల్లించగలరనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని దాని విషయమై న్యాయం చేయాలని కోరుకుంటూ, ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వెంకట సతీష్ కుమార్ రెడ్డి సింగారెడ్డి : అధ్యక్షా, 2014-15 సంవత్సరం వార్షిక బడ్జెట్ సందర్భంగా ప్రసంగించడానికి అవకాశం ఇచ్చినందుకు మొట్టమొదటగా మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈరోజు శ్రీ నారా చంద్రబాబు గారి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రవేశ పెట్టినటువంటి ఈ బడ్జెట్ చాలా వాస్తవికంగా ఉంది. అన్ని రంగాలకు సమానమైనటువంటి న్యాయం, అన్ని వర్గాలకు న్యాయం జరిగే విధంగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు చేయడం జరిగింది. గడచిన కొద్ది రోజుల నుంచి ఇక్కడ జరుగుతున్నటువంటి చర్చలు గాని, బయట జరుగుతున్నటువంటి చర్చలు మరియు విమర్శలు చూసినట్లయితే ఒక్కొక్కసారి బాధ కలుగుతుంది. గడచిన పది సంవత్సరాల్లో జరుగుతున్నటువంటి అవకతవకలు, తప్పులను అన్నింటిని కూడా ఈ ప్రభుత్వానికి ఆపాదించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. 08-06-2014 నాడు గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన తరువాత 80 రోజులు కూడా పూర్తి కాలేదు. 80 రోజుల్లో ఏమి చేయగలుగుతాం, ఏమి చేస్తాం అని ఎవరైనా ఆలోచన చేయగలిగినప్పుడు, ప్రత్యక్షంగా ఈ రాష్ట్రం విడిపోయినటువంటి నేపథ్యంలో, తీవ్రమైనటువంటి సమస్యలున్న ఈ సమయంలో ప్రతిపక్ష నేత గారు ఏమయ్యా మేమేమన్న ఆకులు, అలములు కట్టుకున్నామా, మీ ప్రక్కన లేమా ఎందుకు మీరు అలా మాట్లాడుతున్నారని వాఖ్య చేశారు. రాష్ట్రం విడిపోయిన తరువాత 58 శాతం జనాభా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గాను, 42 శాతం జనాభా తెలంగాణాలో ఉన్నారు. తెలంగాణాలో ఉన్నటువంటి అత్యున్నతమైన విద్యా సంస్థలు గాని, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏమైనా ఉన్నదా అధ్యక్ష. ఇక్కడ ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆదాయం ఎంత? హైదరాబాద్ లేకుండా ఆంధ్రప్రదేశ్ ఆదాయం ఎంత అనేది కూడా మనం ఆలోచన చేయాలి. 58 శాతం మంది ఉన్న జనాభాకు ఈరోజు రెవెన్యూ 50 శాతం కూడా రావడం లేదంటే మనం నష్టపోయామా? లేదా? అన్న విషయాన్ని ప్రతిపక్ష నేత గారు గాని, మిగతా సభ్యులు గాని గుర్తించాలని కోరుతున్నాను. ఇటీవల చర్చ సందర్భంగా ఐటి శాఖ నుండి గౌరవ మంత్రి వర్యులు మాట్లాడుతూ, ఈ రాష్ట్రం విడిపోయినప్పుడు ఏ రకంగా కేటాయింపులు జరిగాయి, ఐటి పరిశ్రమ ఏ రకంగా విభజింపబడింది? వాటివల్ల ఎటువంటి ప్రభావాలు ఉన్నాయని ఆలోచన చేసినప్పుడు కేవలం 21వేల మంది మాత్రమే ఐటి ఉద్యోగులు ఉన్నారు. మిగిలిన వారందరూ కూడా హైదరాబాద్‌లో గాని, తెలంగాణాలో గాని ఉన్నారని, ఐటి శాఖ మంత్రి గారు చెప్పారు. ఉన్నటువంటి ఐటి శాఖ ఉద్యోగుల్లో రెండు శాతం కూడా ఆంధ్ర రాష్ట్రంలో లేనటువంటి పరిస్థితి. అదేరకంగా ఐటి శాఖకు సంబంధించిన ఆదాయం రెండు శాతం కూడా లేదు. మిగతాది అంతా కూడా ఈరోజు తెలంగాణాలో గాని, హైదరాబాద్‌లో గాని ఉన్నటువంటి పరిస్థితి. ఇంతకంటే రుజువు ఇంకా ఏమి కావాలి. ఈరోజు చదువుకున్నటువంటి విద్యార్థులంతా 90 శాతం మంది ఇంజనీర్లు అయి, ఐటిలో ఉద్యోగం కావాలని కోరుకునే సమయంలో అటువంటి రంగంలో మనకు రెండు శాతం కూడా లేకుండా ఉంటే అంతకంటే తీవ్రమైనటువంటి కష్టం, నష్టం ఏముస్తుంది. ఇటువంటి వాఖ్యలు చేసేప్పుడు మీరందరు కూడా ఆలోచన చేయాలని మీద్వారా ప్రతిపక్ష నేత గారిని కోరుకుంటున్నాను. ఇంత తీవ్రమైన, ఇబ్బందికరమైన పరిస్థితుల్లో మనమంతా ఎంత మాట్లాడినా ప్రజలు మాత్రం సరైన నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడున్నటువంటి విపరీతమైన పరిస్థితుల్లో ఏ నాయకుడైతే ఈ రాష్ట్రాన్ని గట్టుకు చేర్చగలుగుతాడు, ఈరోజు ఉన్నటువంటి కష్టాలు తీర్చగలుగుతాడు. ఏ నాయకుడి చేతుల్లో పెడితే, ఈ రాష్ట్రం దగా కాకుండా ఉంటుందో, పిల్లల భవిష్యత్తు అంతా బ్రహ్మాండంగా ఉంటుందనే ఆలోచన చేసి, ఒక మంచి నిర్ణయం తీసుకుని, శ్రీ ఎన్. చంద్రబాబునాయుడిగారి నాయకత్వంలో ఉన్నటువంటి తెలుగుదేశం పార్టీ, ఆ పార్టీకి ఓటు వేసి ప్రజలు మమ్మల్ని గెలిపించారు. ఈ పార్టీని

గెలిపించినందుకు, ప్రజలు మాపైన ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా, తు.చ. తప్పకుండా, అన్ని రంగాలలో కూడా మా నాయకుడు ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెడతారనే దానిలో ఎవరూ ఎటువంటి అనుమానం పెట్టుకోవక్కరలేదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఎందుకంటే, శ్రీ ఎన్.చంద్రబాబునాయుడిగారిలో ఉన్నటువంటి విజన్, ముందుచూపు, ఏ రకంగానైనా ప్రణాళికలు వేస్తే ఈ రాష్ట్రం బాగుపడుతుందో ఎవరికీ కూడా, ఈ సమకాలీన రాజకీయ నాయకులలో ఈ విధంగా ఎవరూ లేనటువంటి పరిస్థితి ఉంది. గడచిన 70 రోజుల పరిస్థితి చూస్తే, ఒక సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి కావలసినటువంటి ముఖ్యమైనటువంటి ఏడు మెషన్లను తయారు చేశారు. వాటితోపాటు, ఇక్కడ ఎంతోమంది మాట్లాడుతూ, క్యాపిటల్ ఇక్కడ, అభివృద్ధి మరొకచోట అని కొంతమంది సభ్యులు మాట్లాడారు. దానికనుగుణంగా మూడు మెగా సిటీలను ఏర్పాటు చేయాలి. అభివృద్ధి అంతా ఒక ప్రాంతంలోనే కేంద్రీకృతం కాకూడదనే ఒక ఆదర్శంతో, శ్రీ ఎన్. చంద్రబాబునాయుడుగారు ఒక స్టేట్‌మెంట్ ఇచ్చారు. తిరుపతి, విజయవాడ-గుంటూరు మధ్యలో ఒకటి, విశాఖపట్టణంలో మూడు మెగా సిటీలను నిర్మించాలని అన్నారు. అలాగే, 14 స్మార్ట్ సిటీలను నిర్మించాలని, ప్రతి ఒక్క జిల్లాలో ఒక స్మార్ట్ సిటీ వచ్చేవిధంగాను, మరియు పోర్టులు నిర్మించాలని అన్నారు. ఇవన్నీ కూడా కేవలం 70 రోజులలోనే ఇంత తీవ్రమైన ఆలోచన చేశారంటే, చూసేవారందరికీ కూడా అది కేవలం శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడుగారికే సాధ్యమనే విషయాన్ని ఈ సందర్భంగా మీ అందరికీ తెలియజేస్తున్నాను. అధ్యక్షా, మనకు స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి ఉన్న ముఖ్యమంత్రులను చూసినట్లయితే, ఈ దేశంలో ముఖ్యమంత్రి అంటే ఇలా ఉండాలి, వర్కింగ్ కల్చర్ అంటే ఈ విధంగా ఉండాలని, ఒక ముఖ్యమంత్రి అంటే ఈవిధంగా పనిచేయాలని, ఒక ఆదర్శవంతమైన రాష్ట్రాన్ని నెలకొల్పే ఒక గొప్పవ్యక్తి మన ముఖ్యమంత్రి. ఆయన ముఖ్యమంత్రి అయిన తరువాత, ఆయన వ్యవహారశైలిని ఆదర్శంగా తీసుకుని, ఆ రకంగా ఇప్పుడు ఉన్న ఛానెల్‌లో ఉన్న ముఖ్యమంత్రులు అందరూ కూడా, ఈవిధమైన సంస్కృతిని అలవాటు చేసుకున్నారని మీ ద్వారా ఈ సభకు తెలియజేస్తున్నాను. ఇప్పుడే మన గౌరవసభ్యులు శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం గారు తమ ప్రసంగం ద్వారా చాలా ఉన్నతంగా, ఆదర్శంగా మాట్లాడడమే కాక, చక్కటి సలహాలు కూడా ఇచ్చారు. ఈ రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలి, రాష్ట్రంలోని అన్ని వర్గాలను ఏ విధంగా ఆనందంగా ఉండేట్లు చేయాలనే విషయంలో 24 గంటలు కష్టపడి పని చేస్తున్నారు. (నిద్రపోవడం చాలా తక్కువ)

మ 1.10

ఈ రకంగా ఒక ముందుచూపుతో, ఒక విజన్‌తో ముందుకు తీసుకువెళ్ళే వ్యక్తి చేతిలో ఈ రాష్ట్రాన్ని పెట్టి ప్రజలందరూ కూడా సంతోషంగా ఉన్నారు. మేము ఒక సేఫ్ హ్యాండ్స్‌లో ఈ రాష్ట్రాన్ని పెట్టాము, ఆ నాయకుడు మమ్మల్ని సుదీర్ఘతీరాలకు తీసుకుపోతారు, అభివృద్ధి వైపు నడిపిస్తారనే నమ్మకం ప్రజలలో ఉంది. కానీ ఇటీవల కొంతమంది నాయకులను చూస్తుంటే రెస్ట్‌లెస్ అయిపోతున్నారు. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీ నాయకులు. దేశమంతా ఏ రకంగా అభివృద్ధి చెందాలి? రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధిపథంలోకి తీసుకెళ్ళాలనీ, రైతులను ఎట్లా ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో చంద్రబాబునాయుడుగారు ప్రతిపక్షనాయకులుగా ఉన్నప్పుడు కూడా ఎన్నో ఉద్యమాలు చేశారు. మీరు చూసినట్లయితే జులై 2010 సంవత్సరంలో ఈ రాష్ట్రమంతా చాలా దుర్భిక్షమైన వాతావరణంలో ఉండేది. మహారాష్ట్ర నుంచి మనకు రావలసిన నీళ్ళు సరిగా విడుదల కాలేదు. అక్కడ బాబ్లీమీద కడుతున్నటువంటి అక్రమ కట్టడాలకు వ్యతిరేకంగా మనకు రావలసిన హక్కుల కోసం ఒక ప్రతిపక్ష నాయకులుగా శాసనసభ్యులందర్నీ మహారాష్ట్రకు తీసుకెళ్ళి ఆ

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం చేస్తే అక్కడున్న మహారాష్ట్ర పోలీసులు లాఠీలతో వాళ్ళందరిమీద దౌర్జన్యం చేసిన విషయం మనందరికీ కూడా తెలిసిందే. ఈరోజు అధికారంలోకి వస్తూనే మేము చేయడమనేది కాదు, ప్రతిపక్ష పార్టీలో కూడా మాయొక్క కర్తవ్యాన్ని మేము నిర్వహించినామనే విషయాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

అలాగే అక్టోబర్ 2, 2012వ తారీఖున చంద్రబాబునాయుడుగారు ఈ రాష్ట్ర ప్రజలందరి కష్టసుఖాలు తెలుసుకోవాలని చెప్పి మొదలుపెట్టినటువంటి పాదయాత్ర రాష్ట్ర చరిత్రలోనే చిరస్థాయిగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. పాదయాత్రలో దాదాపు 2850 కిలోమీటర్లు నడిచినటువంటి సుదీర్ఘ చరిత్ర చంద్రబాబునాయుడుగారిదే. 63 సంవత్సరాల వయస్సులో ఆ రకమైన సాహసోపేతమైనటువంటి నిర్ణయం తీసుకుని రోజుకి 25, 30 కిలోమీటర్లు నడవడమంటే అది సామాన్యమైన విషయం కాదు. ఎవరికోసం చేశారు అధ్యక్షా ఈ పాదయాత్ర.

శ్రీ ఎం.సుధాకర్ బాబు (శాసనసభ నియోజకవర్గం)ః అధికారం కోసం చేశారు.

శ్రీ వెంకట సతీష్‌కుమార్ రెడ్డి సింగారెడ్డి (శాసనసభ నియోజకవర్గం)ః అధికారం కోసమని మీరనుకుంటున్నారు. కానీ ప్రజల కోసమని ప్రజలు కూడా గుర్తించారు. సరే అధికారం వస్తేనే ప్రజలకు మేలు చేసే అవకాశముంటుందనేది రెండో విషయం. 2850 కిలోమీటర్లు ఆయన తన ఆరోగ్యాన్ని పణంగా పెట్టి రోజుకు 25, 30 కిలోమీటర్లు మండుటెండలో నడిచినటువంటి చరిత్ర, ఈ రాష్ట్ర ప్రజలకోసం ఆయన చేసినటువంటి త్యాగమని కూడా నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అంతేగాకుండా 2012 సంవత్సరం డిసెంబర్‌లో ఎవరూ కూడా ఇంతవరకూ చేయని సాహసం చేశారు. అదేంటంటే ఈ దేశ చరిత్రలోనే రైతులకోసం ఆమరణ నిరాహార దీక్ష చేసిన ఘనత కూడా చంద్రబాబునాయుడు గారిదేనని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. ఏడు రోజులు అసెంబ్లీ ఎం.ఎల్.ఏ క్వార్టర్స్‌లో కూర్చుని నిరాహార దీక్షలు చేశారు. దేనికోసం చేశారు? ఈ ప్రాంతంలో ఉన్నటువంటి రైతులకు వ్యవసాయం లాభాసాటిగా ఉండాలనీ, వారు బాగుండాలనీ, వారిపైన ప్రభుత్వం దృష్టిపెట్టాలని చెప్పి ఏడు రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి తరువాత ఆరోగ్యం బాగలేకుండా ఉంటే ప్రభుత్వం ఆయనను అరెస్ట్ చేసి తీసుకుని వెళ్ళి లోపల పెట్టింది. ఇన్ని కార్యక్రమాలు చేసిన తరువాత, ఈ రాష్ట్రమంతా తగలబడుతోంటే ఢిల్లీవాళ్ళు చోద్యం చూస్తూ వాళ్ళ ఇష్టానుసారం వాళ్ళు చేస్తోంటే, ఈ రాష్ట్రంలో ఉన్న ప్రజలందరికీ సమన్యాయం చేయమని కోరుతూ ఢిల్లీలో ఐదు రోజులు నిరాహారదీక్ష చేసినటువంటి చరిత్ర కూడా చంద్రబాబునాయుడు గారిదే. కొంతమంది రాజకీయ నాయకులు జేబులు నింపుకోవడమే ధ్యేయమై, వాళ్ళు సంపాదించిన ఆస్తులు లక్షల కోట్లు దాటినటువంటి పరిస్థితి ఉంది. ప్రతిపక్షాలవాళ్ళు కోర్టులకు వెళ్ళడమే గాకుండా, వారు చేసిన ఆర్థిక నేరాలకు శిక్షగా సంవత్సరాల తరబడి జైళ్ళల్లో మగ్గినటువంటి చరిత్ర కలిగిన లీడర్లు. ఒకవైపు అటువంటి నాయకులుంటే, మరొకవైపు రైతుల కోసం, సమాజం కోసం, ఈ రాష్ట్రం కోసం, ఈ రాష్ట్ర ప్రజల కోసం పోరాడినటువంటి నాయకుడున్నారు. ఈ తేడాను ఈ రాష్ట్ర ప్రజలందరూ గమనించిన తరువాత ఈయన చేతిలో పెడితేనే ఈ రాష్ట్రం బాగుపడుతుందనే ఉద్దేశంతో ఆయనకు అధికారమిచ్చారు. అయిదు సంవత్సరాలు అధికారం మా చేతిలో పెట్టారని అందరూ అనుకుంటున్నారు. కానీ అయిదు సంవత్సరాలు కాదు. కచ్చితంగా చంద్రబాబునాయుడుగారు ఈ భూమి మీద ఉన్నంతవరకూ ఈ

తెలుగుదేశం పార్టీ అధికారంలోనే ఉంటుందన్న విషయాన్ని స్పష్టంగా చెప్తున్నాను. అది ఏదో మా గొప్పతనమని చెప్పడంలేదు. చంద్రబాబునాయుడుగారు ఏ విధంగా వ్యవహరించబోతారనే ఆలోచనలు మాకు తెలిసినప్పుడు అటువంటి కాన్ఫిడెన్స్ ఇప్పుడు మా అందరిలో ఉంది. ఇంక భవిష్యత్తులో మేము ఉన్నంతకాలం, మా చంద్రబాబునాయుడుగారు ఉన్నంతకాలం ప్రతిపక్ష స్థానాలలోకి వెళతామనే ఇబ్బంది మాకు కలగడంలేదు. ఈ రోజు చంద్రబాబునాయుడుగారు ప్రజలపట్ల చూపించే చిత్తశుద్ధిని గమనించినట్లయితే ఇంక ఏ రోజూకూడా మేము ప్రతిపక్షంలో కూర్చునే అవకాశమే లేదని ఈ సందర్భంగా తెలియజేస్తు న్నాను. మా ప్రభుత్వం వచ్చి 70 రోజులే అయ్యింది. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా కూడా రుణమాఫీ చేయాలనే దృఢ సంకల్పంతో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వముంది. ఈ రోజు బడ్జెట్‌లో రు.5000 కోట్లే పెట్టారు, మరి ఏ రకంగా రుణాల మాఫీ చేస్తారని కొంతమంది ప్రతిపక్ష సభ్యులు అంటున్నారు. Definitely, I believe in the word that where there is a will, there is a way. We have already told this House that we have the will and we will definitely find a way out. We will pay all the dues of the farmers. అయితే, ఈ బడ్జెట్‌లో ఆఫ్ ది బడ్జెట్ కూడా చేయాల్సిన కార్యక్రమాలు కొన్ని కొన్ని ఉన్నాయి. అంటే నవ్విన నాపచేనే పండుతుంది. ఈ రోజు మీరు నవ్వుకోవచ్చు. మీరు చూడండి రాబోయే ఒకటిన్నర, రెండు నెలల లోపల రైతులకు రుణమాఫీ పూర్తిగా చేతికందే విధంగాచేసి మా తెలుగుదేశం పార్టీ నిబద్ధతను చేసి చూపిస్తామని తెలియజేస్తున్నాను.

శ్రీ బి.చంగల్‌రాయుడు : ఒకటిన్నరనెల కాదు రెండు నెలల్లో అప్పులు తీర్చేస్తే నేను రాజీనామా చేసి ఇంటికెళ్తాను.

శ్రీ వెంకట సతీష్‌కుమార్ రెడ్డి సింగారెడ్డి : అధ్యక్షా, చెంగల్‌రాయుడుగారు కూడా మా మిత్రులు. వారు రాజీనామా చేయాల్సిన అవసరం లేదు. మేము చేసి చూపిస్తాము. మేము చేసిన తరువాత కూడా నిస్సందేహంగా మీరిక్కడే ఉండండి. దీనిగురించి ఎటువంటి సందేహాలు పెట్టుకోవాల్సిన అవసరంలేదు. వ్యవసాయానికి 2013-14 సంవత్సరంలో 3.8 శాతం నిధులు కేటాయించారు. ఈరోజు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఈ రాష్ట్రంలో 8 శాతం నిధులను వ్యవసాయానికి కేటాయించింది. ప్రధానంగా ఈ రు.40 వేల కోట్లచుట్టే ప్రతిపక్షాలన్నీ ఎక్కువగా మాట్లాడుతున్నాయి. ఈ నిధులను ఎక్కడ్నుంచి తీసుకువస్తారని, బడ్జెట్‌లో దీనినెందుకు చూపించలేదని వారు ప్రశ్నిస్తున్నారు. అయితే, రిజర్వ్‌బ్యాంక్ యొక్క ఆంక్షలు కొన్ని ఉంటాయి. దాని ప్రకారంగా మూడు శాతం కంటే ఎక్కువగా లోటును బడ్జెట్‌లో మనం చూపించడానికి అవకాశంలేదు. కానీ మనం వేరే సోర్సెస్ ద్వారా ఈ ఫండ్స్ జనరేట్ చేసుకోవడానికి అవకాశముంది. అవి పూర్తయ్యేంతవరకూ మాట్లాడడం సవ్యంగా ఉండదనే ఉద్దేశంతోనే దాని గురించి బడ్జెట్‌లో చెప్పలేదు. కానీ మా నాయకునితో మేము మాట్లాడిన అంతర్గత చర్చల్లో నూటికి నూరుపాళ్ళు కాన్ఫిడెన్స్ వచ్చింది. రాబోయే ఒకటిన్నర, రెండు నెలల్లోపల ఈ రుణమాఫీ, డ్వాక్రా రుణాల మాఫీ కానీ జరుగుతుందనే విషయంలో ఎటువంటి సందేహం మాకు లేదు. వంద శాతం ఇవన్నీ కూడా చేయగలుగుతాము.

మ.1.20

ఆ తరువాత మీరు గమనించినట్లయితే, నోటిఫైడ్ డేట్ జూన్ 2, రాష్ట్రం విడిపోవడం గాని కొత్త రాష్ట్రం ఏర్పడటం అంటే తెలంగాణా రాష్ట్రం మన రాష్ట్రం నుండి విడిపోయిన తేదీ జూన్ 2వ తేదీ. అప్పటికి మన ముఖ్యమంత్రి గారు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ప్రమాణస్వీకారం

చెయ్యలేదు. కానీ, ఒక ముందు చూపుతో ఈ రాష్ట్రం విడిపోతే అపాయింట్‌మెంట్ డేట్ తరువాత రకరకాలైనటువంటి రిసల్యూషన్స్, వాళ్ల తీర్మానాలు, వీళ్ల తీర్మానాలు అని అనేక ప్రతిబంధకాలు ఏర్పడతాయని, అపాయింట్‌మెంట్ డేట్ కంటే ముందే పోలవరంకు సంబందించిన ఆర్డినెన్స్ ని తీసుకువచ్చిన ఘనత మన ముఖ్యమంత్రిగారిదే అన్న విషయం కూడా ఈ సభకు తెలియజేస్తున్నాను. ఎందుకంటే రాష్ట్రం విడిపోయిన తరువాత ఈ పోలవరం మనకు ఒక లైఫ్ లైన్ వంటిది. పోలవరం, Polavaram is supposed to be a lifeline for the State అక్కడ వున్నటువంటి నీరు మరెక్కడా లేదు. ఆనీటిని మనం ఉపయోగించుకోవలసిన అవసరం ఉంది. పోలవరం ముంపు ప్రాంతాలైన ఏడు మండలాలు మన ప్రాంతంలోకి రాకుండా వున్నట్లయితే ఆ ప్రాజెక్టు కట్టడానికి అనేక రకాలైన ఇబ్బందులు ఏర్పడతాయి. కాబట్టి ముందు చూపుతో రాష్ట్రం ఆవిర్భవించక ముందే ముఖ్యమంత్రిగారు ఆలోచించారు కాబట్టే ఆయన లీడర్ కాగలిగారు. ఆయన యొక్క శక్తి సామర్థ్యాలను అందరూ అర్థం చేసుకోవాలని అభ్యర్థిస్తున్నాను.

శ్రీ యం. సుధాకర్ బాబు : అధ్యక్షా, ఆ రెండూ కూడా కేంద్ర ప్రభుత్వమే చేసింది. చంద్రబాబు నాయుడు గారు ఏమీ చేయలేదు.

శ్రీ వెంకట సతీష్ కుమార్ రెడ్డి సింగారెడ్డి: అధ్యక్షా, 2013లో ఉత్తరాఖండ్‌లో పెద్ద విపత్తు సంభవించింది. మన రాష్ట్రానికి చెందిన వారు కూడా చార్‌ధామ్ యాత్రకు వెళ్లి అక్కడ చిక్కుకుపోయారు. ఆ పరిస్థితుల్లో ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా, ప్రభుత్వ సహాయం కూడా తీసుకోకుండా వ్యక్తిగతంగా తన పార్టీ మనుషులను, తన శ్రేయోభిలాషులను తీసుకుపోయి, అక్కడ వున్న యాత్రికులను కాపాడిన ఘనత మన చంద్రబాబునాయుడు గారిదే. ఎక్కడ ఆపద వుంటే అక్కడకు వెళ్లి, ఆ సమస్యను పరిష్కరించడం, ఒక ముందు చూపుతో, ఏ రకంగా అంటే ఈ పోలవరం ఆర్డినెన్స్‌ని జారీ చేయించుకోవడం, ఒక కమిట్‌మెంట్ ఎలాగంటే రైతుల కోసం ఆయన చేసిన నిరాహార దీక్ష, పాదయాత్ర, ఇవన్నీ నాయకత్వ లక్షణాలు కల గొప్ప వ్యక్తి శ్రీ చంద్రబాబు నాయుడు గారు. అవన్నీ రాష్ట్ర ప్రజలు గుర్తించే ఆయన్ని ముఖ్యమంత్రిగా చేశారు. ఈ 70,80 రోజులలో ఏ ఏ పనులు చేయాలో ఒక బ్లూ ప్రింట్ తయారయ్యింది. ఒక విజన్, ఏడు మిషన్స్ తయారయ్యాయి. మూడు మెగా సిటీలు, ఆ తరువాత ఐదు గ్రిడ్ లు. ఈ రోజున తాగడానికి నీరు లేవనుకున్నాం. మనం ఇక్కడ కూర్చుని మాట్లాడుతున్నాం. కానీ చంద్రబాబు నాయుడుగారు ఎప్పుడో ఆలోచించి, ఈ రాష్ట్రాన్నంతటిని అనుసంధానం చేసి త్రాగడానికి ఒక వాటర్ గ్రిడ్‌ను తయారు చేసేందుకు బ్లూప్రింట్‌ని తయారు చేశారు. కావాలంటే ఆ బ్లూప్రింట్‌ని ప్రతిపక్షంలో సభ్యులందరికీ పంపిస్తాను. మేము ఖాళీగా కూర్చోలేదు. ఈ అరవై ఎనిమిది, డెబ్బై రోజుల్లోనే ఈ రాష్ట్రాన్ని ఎలా ముందుకు తీసుకుపోవాలో హ్యాపీ ఆంధ్రప్రదేశ్‌ని ఏవిధంగా తయారు చేయాలి అనే దానిమీద ఒక డ్యాకుమెంట్ తయారు అయ్యింది. దానిని తప్పకుండా అమలు చేస్తాం. ఈ రాష్ట్ర ప్రజలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లే విధంగా మా పరిపాలన ఉంటుంది. ఎన్నో లోపాలు ఎత్తి చూపారు. ఆ లోపాలన్ని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేము చెప్పినవే. అవన్ని పునరావృతం కావు. ఏవైతే అవసరమో వాటిమీద ప్రత్యేకమైనటువంటి శ్రద్ధ ఉంటుంది. ఇందాక శ్రీ శ్రీనివాసులు నాయుడు గారు చెప్పారు. 12వేల కోట్లు ప్రాథమిక విద్య కోసం ఖర్చు పెడుతున్నారని. ఇవి చాలా ఎక్కువ నిధులు. నాలుగు వేల కోట్లు వైద్యానికి పెడుతున్నారు. ఇవన్నీ నిజంగా ప్రజలకు ఉపయోగపడుతున్నాయా? అంటే దానికి మనందరం బాధ్యత తీసుకోవాలి. ఒక విషయం ఈ సందర్భంగా మీకు తెలియజేస్తున్నాను. కేవలం నిధులు విడుదల చేసినంత మాత్రాన

ఈ రాష్ట్రానికి గాని, రాష్ట్ర ప్రజలకు గాని మేలు జరగదు. ఖర్చు పెట్టిన ప్రతి పైసాను సద్వినియోగం చేయగలిగితే ఈ రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుంది. రాష్ట్ర నాయకుడు ఎలా ఉండాలంటే ఖర్చు పెట్టే ప్రతి పైసా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలి. కాని గడచిన ప్రభుత్వాల్లో ఈయొక్క విధానం తప్పి పోయి జేబులు నింపుకునే దానికే ప్రాధాన్యం ఇచ్చారు. ఒక చిన్న ఉదాహరణ, పోలవరం ఇంకా మొదలు కాలేదు. కాని ఐదు వేల కోట్లు ఖర్చు అయ్యాయి. తోక ఎక్కడో కట్టారు, కాని తల ఇంకా మొదలు కాలేదు. తల మొదలు కాకుండానే కాలువలు కట్టిన పరిస్థితి. అవసరం లేని పనులన్నీ చేశారు. ఒక చిన్న ఉదాహరణ నేను పులివెందుల ప్రాంతం నుంచి వస్తున్నాను. పులివెందుల నుంచి అసెంబ్లీకీ నాలుగుసార్లు పోటీ చేశాను. అక్కడ ఐజి కార్ అనే ఒక వ్యవస్థ పెట్టారు. దాదాపు రూ.450కోట్లు ఖర్చు పెట్టి భవనాలు నిర్మించారు. దాదాపు ఆ భవనాలు నిర్మించి ఆరు, ఏడు సంవత్సరాలు అవుతుంది. కాని ఆ భవనాల్లో ఎటువంటి కార్యక్రమాలు జరగలేదు. ఆ భవనాల్లో అసాంఘీక కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఆ భవనాలను ఏమి చేయాలో, నిర్మించిన ప్రభుత్వాలకు కూడా అర్థం కావడం లేదు. గడచిన కాలంలో గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి గారు ఉన్నప్పుడు ఆ విషయం గురించి మీకు ఏమైనా ఆలోచన ఉందా అని నన్ను పిలచి అడిగారు. అదేంటి సార్ మీరు ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు, వాటిని ఏమి చేయాలో మీకు తెలియనిది ఏమి ఉందని అని నేను వారికి చెప్పాను. అందుకు ఆయన చెప్పిన సమాధానం నిజంగా చెబుతున్నాను వాటిని ఏమి చేయాలో అర్థం కావడం లేదని అన్నారు. మా అధికారులతో సమీక్ష చేయించినా కూడా వారు ఏమి చెప్పలేక పోయారు అని చెప్పారు. ఆవిధంగా ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిన ఘనత గత ప్రభుత్వానిదే. మా ప్రాంతంలోనే లిఫ్టు ఇరిగేషన్ పథకం పెట్టారు. గండికోట నుండి చిత్రావతి రిజర్వాయరు వరకు నీరు తీసుకుపోవాలనే ఉద్దేశ్యంతో ఐదు స్టేజెస్‌లో ఐదు లిఫ్టులు పెట్టారు. ఒక్కొక్క లిఫ్టుకు రెండువందల యాభై నుండి మూడు వందల కోట్లతో మొత్తం దాదాపు పదిహేను వందల కోట్లతో టెండర్లు పిలిచారు. ఇప్పటికీ దాదాపు 95 శాతం నిధులు అయిపోయాయి. బిల్లులు అన్నీ తినేశారు. ఈరోజుకు ఇంకా పంపింగ్ మొదలు కాలేదు. కానీ, మోటార్లు ఆరు సంవత్సరాల క్రితమే కొన్నారు. కమీషన్ వచ్చే వ్యవహారం ఉంటే మొదట డబ్బులిచ్చి కొనివేయడమే. ఈరోజు మీరు వెళ్లి చూడచ్చు. గండిపేట లిఫ్టు ఇరిగేషన్ పథకం అని చెప్పి ఆరు సంవత్సరాల క్రితం దానికి కావాల్సిన మోటార్లు, స్టాటర్లు, పంపులన్నీ కొంటే అవన్నీ ఈరోజు తుప్పు పట్టే స్థితిలో ఉన్నాయి. అటువంటి వృథాని ఈ ప్రభుత్వం చేయదని చెబుతున్నాను. ఏ పైసా ఖర్చు పెట్టినా దాని ఫలితం సామాన్యుడికి, బీద వాడికే లబ్ధి చేకూరాలనేదే మా లక్ష్యమని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ రకంగా అనేకమైనటువంటి అవినీతులు కేవలం జేబులు నింపుకునేటువంటి పనులు ఈ ప్రభుత్వంలో ఉండవు. ఈ ప్రభుత్వం యొక్క ప్రతి కార్యక్రమం సంక్షేమానికి, పేదవాడి అభ్యున్నతికే తోడ్పడుతుందని తెలియజేసుకుంటూ, ఇవి జరగడానికి మీయొక్క సహాయం పూర్తిగా ఉండాలి. ఎందుకంటే, ప్రతి ఒక్కరి ఆలోచన రైతులు బాధల్లో ఉన్నారు. రైతులను ఆదుకోవాలి. ఋణమాఫీ వెంటనే జరగాలి. ఎంతో దారుణంగా ఉన్న ఈ పరిస్థితుల్లో ఏదో ఒక రకంగా నిధులు సేకరించి ఋణమాఫీ చేయాలని చూస్తూ ఉంటే, ప్రతిపక్షం వాళ్లు మా నాయకుడి దిష్టి బొమ్మను దగ్ధం చేస్తున్నారంటే వారిని చూసి నవ్వాలో, ఏడవాలో మాకు అర్థం కావడం లేదు. కనీసం మాకు కొంత సమయమైనా ఇవ్వాలి కదా. వారు ఆలోచన చేసుకోవాలి . ఈ సందర్భంలో నేను చెబుతున్నాను . రెండు నెలల్లోగా ఈ ఋణమాఫీ పూర్తిగా అయిపోయిన తరువాత మీ దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తాం. ఇవేకాదు డ్వాక్రా రుణాలు కూడా పూర్తిగా మాఫీ అయిపోతాయి. అంతేకాకుండా వెనుకబడిన తరగతులకు సంబంధించిన లోన్లు, వీవర్స్‌కి

సంబంధించిన లోన్లు ఏవైతే మా ఎన్నికల మ్యానిఫెస్టోలో వున్నాయో వాటిని తూ .చా తప్పకుండా అమలు చేసేందుకు మా శాయశక్తులా ప్రయత్నం చేస్తాం . దానికి మీ అందరి కో–ఆపరేషన్ కావాలి. ఇవే కాకుండా ఈ రాష్ట్రం అభివృద్ధి చెందడానికి ఏవేవిచెయ్యాలో అవన్నీ కూడా బ్లూ ప్రింట్స్ తయారు చేశాం. వాటి కాపీలను మీకు కూడా పంపిస్తాం. తప్పకుండా అవన్నీ సాధ్యపడతాయి, మీరందరూ కూడా ఒక సురక్షితమైనటువంటి చేతులలో ఈ రాష్ట్రాన్ని పెట్టారు . కాబట్టి ఆ ఫలాలను మీకు అందిస్తాం. ఇందాక అపోజిషన్ పార్టీ వాళ్లు చాలా మంచి సూచనలిచ్చారు. మన శ్రీ విటపు బాలసుబ్రమణ్యం గారు, శ్రీనివాసులు గారు, చంద్రశేఖర్ గారు మంచి సూచనలిచ్చారు. కాకపోతే అనవసరమైన విమర్శలు చేశారు. 70 రోజులలోనే ఒక మనిషి యెక్క పనితనాన్ని ఎవరూ బేరీజు వేయలేరు. అయినప్పటికీ కూడా ఈ 70 రోజులలొనే ఏఏ పనులు చేయాలో మేము సిద్ధ చేసుకున్నాం. అలు పెరగని 68 రోజుల ప్రయాణంలో మేము ఏం చేశామో మీరు చూడొచ్చు (సభలో చూపిస్తూ). 7 మిషన్లు, 5 గ్రిడ్‌లు, తరువాత ప్రతి ఒక్క కార్యక్రమం ఏం చెయ్యాలో మా దగ్గర వుంది. We are clear, we have the clarity. ఎక్కడైతే క్లారిటీ వుంటుందో తప్పకుండా అది సాధ్యమవుతుంది . ఇందాక మీరు అనుకున్నట్లు నిద్రలో బిల్ క్లింటన్ కావాలనుకోవడం లేదు. We have prepared blue prints. ఏమేమి చెయ్యాలి అనే దాని గురించి కాబట్టి ఇవన్నీ సాధ్యమవుతాయని చెప్పుకుంటూ, తెలుగుదేశం పార్టీ చిరస్థాయిగా మా నాయకుడు శ్రీ ఎన్.చంద్రబాబు నాయుడి గారి నాయకత్వంలో ఈ రాష్ట్రంలో ఎప్పుడూ అధికారంలో వుండి ఈ ప్రజల యొక్క మంచి చెడులను చూసుకుంటామని చెబుతూ, ఒక మంచి బడ్జెట్ ఇచ్చినందుకు చంద్రబాబునాయుడు గారిని, ముఖ్యంగా ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు గారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ధన్యవాదాలు అధ్యక్ష .

MR. CHAIRMAN: The House is adjourned to meet tomorrow at 10.00 a.m.

(Then the House adjourned at 1.31 p.m. to meet again
on 26.08.2014 at 10.00 a.m.)